ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త
epaper.vaartha.com WWW.VAARTHA.COM
హైదరాబాద్

మీ ఆర్థిక అవసరాల ఆశయసాధన
కపిల్ చిట్స్
KAPIL GROUP
Visit Us: www.kapilchits.com
కపిల్ చిట్స్ మీ కలలకు సాకారం
: fb.com/vaartha Digital

Published from Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam
11-11-2025 మంగళవారం సంపుటి: 31 సంచిక: 280 పేజీలు: 10+4 వెల: 6.50

# ఢిల్లీలో ఉగ్రరాక్షసం



సోమవారం ఢిల్లీ ఎర్రకోట వద్ద పేలుడుతో ఎగసిపడితున్న మంటలు

## పేలుడుతో దేశ వ్యాప్తంగా హై అలర్ట్

**న్యూఢిల్లీ, నవంబరు 10:** దేశంలో ఉగ్రవాదుల కుట్రలు భగ్నం అవుతున్న వేళ రాజధాని ఢిల్లీలో సోమవారం రాత్రి జరిగిన పేలుడు పెను ప్రకంపనలు సృష్టించింది. దేశంలో ఉగ్రవాద దాడులకు పాల్పడేందుకు కుట్రలు చేస్తున్న పలువురిని అరెస్ట్ చేయడం, వారి ప్రయత్నాలను ఫెయిల్ >>2

## 13 మంది మృతి
## 24 మందికి తీవ్రగాయాలు

## ఎర్రకోట వద్ద కారులో పేలుడు

### సిగ్నల్ వద్ద ఆగగానే పేలిపోయిన కారు
### ఎనిమిది వాహనాలు పూర్తిగా ధ్వంసం
### వెంటనే ఘటనాస్థలికి వెళ్లి పరిశీలించిన అమిత్‌షా
### ఢిల్లీ, యుపి, హార్యానా, జమ్ము కాశ్మీర్, పంజాబ్, హైదరాబాద్, అమరావతిలో హై అలర్ట్



సోమవారం రాత్రి ఘటనాస్థలిని పరిశీలిస్తున్న కేంద్ర హోంమంత్రి అమిత్‌షా

### జయ జయహే తెలంగాణ.. రాష్ట్ర గీత రచయిత
## ప్రజాకవి అందెశ్రీ కన్నుమూత



నివాసంలో హఠాత్తుగా కుప్పకూలిన వైనం

అందెశ్రీ మృతి మేధో ప్రపంచంలో పూడ్చలేని లోటు: ప్రధాని మోడీ

తెలంగాణ సాహితీ శిఖరం నేలకూలింది: సిఎం రేవంత్

నేడు అధికారిక లాంఛనాలతో అందెశ్రీ అంత్యక్రియలు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, నవంబర్10:** తెలంగాణ రాష్ట్ర గీతం జయ జయహే తెలంగాణ రూపశిల్పి, ప్రముఖ కవి, రచయిత అందెశ్రీ (64) కన్నుమూశారు. సోమవారం తెల్లవారు జామున లాలాగూడలోని తన నివాసంలో ఒక్కసారిగా కుప్పకూలి పడిపోయారు. దీంతో కుటుంబ సభ్యులు హుటాహుటిన గాంధీ దవాఖానకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆయన తుదిశ్వాస విడిచినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. అందెశ్రీ కలం నుంచి >>2

# జూబ్లీ 'బిగ్ ఫైట్' నేడే

## ఉప ఎన్నికకు భారీ భద్రతా ఏర్పాట్లు

### ఉదయం 7గం. నుంచి సాయంత్రం 6గంటల వరకు పోలింగ్
### కాంగ్రెస్ నుంచి నవీన్‌యాదవ్, బిఆర్ఎస్ నుంచి మాగంటి సునీత
### బిజెపి నుంచి లంకల దీపక్‌రెడ్డి సహా 58మంది అభ్యర్థులు

**హైదరాబాద్ (జూబ్లీహిల్స్) నవంబరు 10, ప్రభాతవార్త:** అధికార ప్రతిపక్ష పార్టీలు ఏంతో ప్రతిష్టాత్మకంగా తీసుకున్న జూబ్లీహిల్స్ ఉప ఎన్నికకు సర్వం సిద్ధమైంది. ఓటర్లను ఆకట్టుకునేందుకు అన్ని పార్టీలు హోరాహోరీగా ప్రచారం నిర్వహించాయి. కాంగ్రెస్‌కు నగరంలో ఒక కంటోన్మెంట్ స్థానం మాత్రమే ఉండగా, ఇపుడు జూబ్లీహిల్స్ సీటును కైవసం చేసుకునేందుకు పావులు కదుపుతుంది. ప్రతి పక్ష బీఆర్ఎస్ పార్టీ సైతం గత ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ నెరవేర్చలేదన్న విషయంతో ప్రజల్లోకెళ్లి కాంగ్రెస్‌ను >>2

**నేడే బీహార్‌లో మలి విడత పోలింగ్** 5



సోమవారం హైదరాబాద్‌లో ఎన్నికల సామాగ్రితో జూబ్లీహిల్స్ నియోజకవర్గంలోని పోలింగ్ కేంద్రాలకు తరలివెళ్తున్న సిబ్బంది

# చలికి గజగజ

## ఉత్తర తెలంగాణ జిల్లాల్లో ఉధృతంగా శీతవాయువులు

### కనిష్ట ఉష్ణోగ్రతలు 2,3 డిగ్రీలు తక్కువ నమోదు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,నవంబర్10:** తెలంగాణ రాష్ట్రంలో శీతల గాలులు వీస్తున్నాయని, వాటి ప్రభావంతో చలి తీవ్రత పెరిగిందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం ప్రకటించింది. ఉత్తర తెలంగాణ జిల్లాలపై చలి ప్రభావం అధికంగా ఉందని వాతావరణ శాఖ అధికారి ధర్మరాజు తెలిపారు. సాధారణం కన్నా రెండు నుంచి మూడు డిగ్రీలు తక్కువగా ఉష్ణోగ్రతలు నమోదవుతున్నట్లు తెలిపారు. నాలుగైదు రోజుల్లో చలి తీవ్రత మరింత పెరుగుతుందన్నారు.



సోమవారం ఆదిలాబాద్‌లో కనిష్ఠ ఉష్ణోగ్రత 12.5 డిగ్రీలుగా నమోదైందని, రానున్న నాలుగు రోజుల్లో మరింతగా తగ్గుతాయని స్పష్టం చేశారు. ఆదిలాబాద్‌తో పాటు నిజామాబాద్,మెదక్ జిల్లాల్లో చలి తీవ్రత అధికంగా ఉంటుందని, పొగ మంచు, శీతల గాలుల కారణంగా రాత్రి పూట చలి ఎక్కువగా ఉంటుందన్నారు. నవంబర్ నెల నివేదిక ప్రకారం పగటి పూట ఉష్ణ తీవ్రత తగ్గి రాత్రి కనిష్ఠ ఉష్ణోగ్రతలు పెరుగుతాయని రిపోర్టులో ఉన్నట్లు వివరించారు. తమకు వచ్చినటువంటి లాంగ్ రేంజ్ అంచనాల ప్రకారం వాతావరణ పరిస్థితులు ఎలా ఉంటాయని నెలలో ప్రతి రోజు నివేదిక రూపంలో వివరాలు వస్తాయని తెలిపారు. గతంలో నైరుతి రుతుపవనాల కారణంగా ఆగస్టు,సెప్టెంబరు నెలలో వర్షాల ప్రభావం ఎక్కువగా ఉంటుందని చెప్పినట్లు వాతావరణ శాఖ అధికారి గుర్తుచేశారు. అలాగే ప్రతి రాత్రి ఉష్ణ తీవ్రత తగ్గినప్పటికీ కనిష్ఠ తీవ్రత కొంచెం అధికంగా ఉండి పగటి పూట గరిష్ఠ ఉష్ణోగ్రతల స్థాయి తగ్గుముఖం పట్టే >>2



సోమవారం సమీక్ష చేస్తున్న మంత్రులు ఉత్తమ్, తుమ్మల

## 8.54 లక్షల మె.ట ధాన్యం కొనుగోలు

### మొక్కజొన్న, పత్తి కొనుగోళ్లు కూడా వేగవంతం

### అధికారులు అప్రమత్తంగా ప్రక్రియ పూర్తి చేయాలి: మంత్రి ఉత్తమ్

**హైదరాబాద్,నవంబరు 10,ప్రభాతవార్త:** ఖరీఫ్ 2025-26 సీజన్‌లో 8.54 లక్షల మెట్రిక్ టన్నులు కొనుగోలు చేశామనీ, గత సంవత్సరం ఇదే రోజున కొనుగోలు చేసిన 3.94 లక్షల మెట్రిక్ టన్నుల కంటే రెండింతలు ఎక్కువ అనీనీటి పౌరుదల మరియు పౌర సరఫరాల మంత్రి కెప్టెన్ ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. సోమవారం వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి ఎస్. రామకృష్ణారావు,పౌర సరఫరాల కమిషనర్ స్టీఫెన్ రవీంద్రతో కలిసి అంబేద్కర్ సచివాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా కలెక్టర్లు, పౌర సరఫరాల అధికారులతో ఉత్తమ్ సమీక్ష నిర్వహించారు. ధాన్యంతోపాటు మొక్కజొన్న, పత్తి కొనుగోళ్లను వేగవంతం చేయడానికి అన్ని జాగ్రత్తలు తీసుకోవాలనీ కలెక్టర్లకు హితవు చెప్పారు.వాతావరణ ప్రతికూల పరిస్థితుల దృష్ట్యా అధికారులు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. తెలంగాణలో అత్యధిక ధాన్యం దిగుబడి చేయడమే కాకుండా ఒకే సీజన్‌లో 80 లక్షల టన్నుల ధాన్యం కొనుగోలు చేయాలని నిర్ణయించుకోవడం దేశచరిత్రలోనే ఒక చరిత్ర సృష్ఠించడమని స్పోత్కర్షలు చెప్పకొన్నారు..ఇప్పటి వరకు 3.95 లక్షల మె.ట సన్నాలు, 4.59 లక్షల మె.ట దొడ్డు రకం ధాన్యం కొనుగోలు చేసినట్లు మంత్రి గణాంకాలతో వివరించారు. 55,493 మందిరైతులు గత సంవత్సరం ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలలో ధాన్యం విక్రయించగా , ఈ ఏడాది 1,21,960 మంది రైతులు విక్రయించారని చెప్పారు.మొత్తం ధాన్యం కొనుగోలు విలువ రూ. రూ. 2,041.44 కోట్ల విలువైన ధాన్యం ఇప్పటి వరకు సేకరించామని, గత ఏడాది ఇదేరోజున రూ. 915.05 కోట్లతో పోలిస్తే రెట్టింపు అని చెప్పారు. ఇందులో రూ. 832.90 కోట్లు ఇప్పటికే రైతులకు చెల్లించగా, మిగిలిన రూ. 1,208.54 కోట్లు ఆన్‌లైన్ ప్రొక్యూర్‌మెంట్ మేనేజ్‌మెంట్ సిస్టమ్‌లో కొనుగోళ్ళు నమోదు తర్వాత 48 గంటల్లో చెల్లించనున్నట్లు తెలిపారు. సన్నాల బోనస్ విషయంకొస్తే గత ఏడాది ఇదే రోజునాటికి రూ.43.02కోట్ల పరిమాణంలో ఉండగా ఈ సంవత్సరం రూ. 197.73 కోట్లకు పెరిగిందని తెలిపారు. అందులో రూ.35.72 కోట్లు ఇప్పటి వరకు చెల్లించామని తెలిపారు. జిల్లాకలెక్టర్లు కనీసమద్దతుధర, బోనస్ రైతులకు వెంటనే చెల్లించేలా క్షేత్రస్థాయిలో నిరంతర పర్యవేక్షణ చేయాలని సూచించారు.కొనుగోలు చేసిన ధాన్యం తడవకుండా నిల్వ చేస్తూ రక్షించేందుకు ప్రతి కొనుగోలు కేంద్రంలో తార్పాలిన్ షీట్లు అందుబాటులో ఉంచాలని మిల్స్‌కు వెంటనే రవాణా చేయాలని ఆదేశించారు. రైతులకు ప్రతిరోజు వాతావరణ హెచ్చరికలు అందజేయాలని చెప్పారు. వర్షాల కారణంగా తడిసిన ధాన్యాన్ని తక్షణమే బాయిల్డ్ రైస్ మిల్లులకు తరలించి, బాయిల్డ్ రైస్ కోటా కేటాయింపుల కోసం ప్రతిపాదనలు పంపాలని సూచించారు. అదనంగా తగిన గోదాంలు, స్థానిక హమాలీ సిబ్బందిని సమకూర్చి కొనుగోలు ప్రక్రియ అంతరాయం లేకుండా కొనసాగించాలని ఆదేశించారు.ధాన్యం కొనుగోళ్ల పురోగతిపై తప్పుడు ప్రచారం జరుగుతోందని ఉత్తమ్‌కుమార్ రెడ్డి హెచ్చరించారు. కలెక్టర్లు కేంద్రాలను తరచుగా పరిశీలించి, వాస్తవాలను నిర్ధారించి, ప్రజలకు నిజమైన సమాచారం అందించాలన్నారు. ఇది రైతుల ప్రభుత్వమని, ఎటువంటి తప్పుడు ప్రచారం కూడా మా పారదర్శకతను లేదా కట్టుబాటును దెబ్బతీయలేవన్నారు.ధాన్యం కొనుగోలు సమీక్షతో >>2

### ఇక ఎంట్రన్స్ ద్వారా
## కెజిబివిల్లో ప్రవేశాలు!

### వచ్చే యేడాది నుంచి ప్రవేశ పరీక్షను నిర్వహించే యోచన

**హైదరాబాద్, ప్రభాతవార్త, నవంబరు 10:** తెలంగాణ రాష్ట్రంలో కొనసాగుతున్న కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాల్లో (కేజీబీవీ) అడ్మిషన్లకు ఇకపై ప్రవేశ పరీక్షను నిర్వహించనున్నారు. వచ్చే ఏడాది 2026-27 విద్యా సంవత్సరం నుంచే దీనిని అమలు చేయాలని విద్యాశాఖ భావిస్తోంది. కేజీబీవీల్లో ప్రవేశాలకు, సీట్ల భర్తీకి ప్రత్యేకంగా ప్రవేశ పరీక్షను నిర్వహించాలని విద్యాశాఖ నిర్ణయించింది. వచ్చే విద్యాసంవత్సరంలో 6వ తరగతి, ఇంటర్ ఫస్టియర్‌లలో ప్రవేశాలకు ఎంట్రెన్స్‌ను నిర్వహించాలని నిర్ణయించినట్టు తెలిసింది. ఎంట్రన్స్ టెస్ట్‌ను రాష్ట్రస్థాయిలో నిర్వహించాలా? లేకపోతే జిల్లా స్థాయిలో నిర్వహించాలా? అనే అంశంపై పాఠశాల విద్య శాఖ అధికారులు కసరత్తు చేస్తున్నారు. అయితే జిల్లా స్థాయిలోనే ప్రవేశ పరీక్షను నిర్వహించడమే మంచిదనే అభిప్రాయానికి అధికారులు వచ్చినట్టు తెలిసింది. >>2

## స్పీకర్‌పై సుప్రీంలో కోర్టు ధిక్కార పిటిషన్

### ఎమ్మెల్యేల ఫిరాయింపులపై చర్యలు తీసుకోలేదని కెటిఆర్ ఆరోపణ

### మరింత గడువుపై 14న సుప్రీం విచారణ

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,నవంబర్10:** తెలంగాణ రాజకీయాలు మరోసారి సుప్రీంకోర్టుకు చేరాయి. పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయడంలో జాప్యం చేస్తున్నారంటూ శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ పై బీఆర్ఎస్ పార్టీ సుప్రీంకోర్టులో ధిక్కార పిటిషన్‌ను దాఖలు చేసింది.గతంలో అత్యున్నత న్యాయస్థానం నిర్దేశించిన మూడునెలల గడువులోగా స్పీకర్ నిర్ణయం తీసుకోలేదని, ఇది కోర్టు ఆదేశాలను ధిక్కరించడమేనని పిటిషన్‌లో పేర్కొంది. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తరఫున ఈ పిటిషన్ దాఖలైంది. మరోవైపు, ఎమ్మెల్యేలపై విచారణకు సంబంధించి తమకు మరింత గడువు కావాలని కోరుతూ స్పీకర్ కార్యాలయం సైతం ఇప్పటికే సుప్రీంకోర్టులో అదనపు పిటిషన్ దాఖలు చేయడం గమనార్హం. ఈ క్రమంలో, తమ ధిక్కార పిటిషన్‌ను అత్యవసరంగా విచారించాలని చీఫ్ జస్టిస్ బీఆర్ గవాయ్ నేతృత్వంలోని ధర్మాసనాన్ని బీఆర్ఎస్ తరపు న్యాయవాది మోహిత్ రావు కోరారు. తమ కేసు విచారణకు రాకుండా అడ్డుకునే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆయన కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. >>2



## అవి రహదారులేనా?

### తెలంగాణ, రాజస్థాన్ రోడ్డు ప్రమాదాలపై సుమోటోగా విచారణ జరిపిన సుప్రీం కోర్టు

### రాష్ట్రాల ప్రధాన కార్యదర్శులను పార్టీలుగా చేయాలని ఆదేశం

### ఆ రెండు రాష్ట్రాల నుంచి నివేదిక కోరిన బెంచ్

**న్యూఢిల్లీ, నవంబరు 10:** తెలంగాణ,రాజస్థాన్‌లలో జరిగిన రోడ్లప్రమాదాలను సుమోటోగా స్వీకరించిన సుప్రీంకోర్టు జాతీయ రహదారుల భద్రతపై ఆందోళన వ్యక్తంచేసింది. జస్టిస్ జేకే మహేశ్వరి, విజయ్ విష్ణోయ్‌లతో కూడిన ధర్మాసనం జాతీయ రహదారుల భద్రతపై ఆందోళన వ్యక్తం చేసింది. రాజస్థాన్‌లోని జాతీయ రహదారులపై ఉన్న ధాబాలు, ఇతర సంస్థల సంఖ్యను వివరిస్తూ రెండువారాల్లోగా వివరణాత్మక స్టేటస్ రిపోర్ట్ దాఖలు చేయాలని భారత జాతీయ రహదారుల ప్రాధికార సంస్థని ఆదేశించింది. రహదారి పరిస్థితులపై నివేదికను కూడా ఇవ్వాలని చెప్పింది. సీనియర్ న్యాయవాది ఏఎస్ నాదకర్ణిని అమికస్ క్యూరీగా నియమించిన ధర్మాసనం స్టేటస్ నివేదికను దాఖలు చేయడానికి రాజస్థాన్ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని పార్టీగా చేర్చాలని ఆదేశించింది. రాజస్థాన్ ప్రభుత్వం తరఫున హాజరైన అదనపు అడ్వకేట్ జనరల్ శివ్ మంగళ్ శర్మ ఈ అంశంపై రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా కోర్టుకు అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందిస్తుందని తెలిపారు. అలాగే, కర్నూలు రోడ్డు ప్రమాదాన్ని సైతం కోర్టు పరిగణలోకి తీసుకుంది. జాతీయ రహదారి భద్రత, రోడ్డు పక్కన ఉన్న >>2

# జూబ్లీ 'బిగ్ ఫైట్' నేడే

>> ఓడించి, సిట్టింగ్ సీటును కైవసం చేసుకునే దిశగా బీఆర్ఎస్ ప్రయత్నాలు చేస్తుంది. దీంతో ఇరు పార్టీల మధ్య హోరాహోరీగా ప్రచారం జరిగింది. కాంగ్రెస్ నుంచి సిఎం రేవంత్‌రెడ్డి మంత్రులు ప్రచారంలో పాల్గొనగా..బిఆర్ఎస్ నుంచి పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్, మాజీ మంత్రులు హరీష్‌రావుతోపాటు పలువురు మాజీ మంత్రులు,ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు డివిజన్‌ల వారీగా ప్రచారం నిర్వహించారు. బిజెపి నుంచి కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌తోపాటు రాష్ట్ర అధ్యక్షులు రాంచందర్‌రావు తోపాటు ఎంపిలు, ఎమ్మెల్యేలు ప్రచారం నిర్వహించారు. అయితే పోటీలు ముగ్గురు ప్రధాన పార్టీల అభ్యర్థులు ఉన్నప్పటికీ కాంగ్రెస్–బీఆర్ఎస్ మధ్యే పోటీ ఉండనున్నట్లు తెలుస్తుంది. హించారు. కాగా మంగళవారం నిర్వహించే పోలింగ్ కొరకు అధికారులకు ఈవీఎం యంత్రాలను పోలీసుల బందోబస్తు మధ్య కేంద్రాలకు తరలించారు. ఈఏర్పాట్లను ఎన్నికల కమిషనర్ ఆర్.వి.కర్ణన్ పర్యవేక్షించారు. మరోవైపు పోలింగ్ కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసు శాఖ ఇప్పటికే అన్ని జాగ్రత్త చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగానే డ్రోన్ కెమెరాలతో పర్యవేక్షణతోపాటు సీసీ కెమెరాల ఏర్పాటు, సమస్మాత్మక పోలింగ్ కేంద్రాల వద్ద అదనపు బలగాల మొహరింపు చేపడుతుంది. దీనికితోడు ఆర్మ్‌డ్ రిజర్వ్ బృందాలను సైతం ఇప్పటికే రంగంలోకి దించారు. ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం సాయంత్రం 6 గంటల వరకు పోలింగ్ జరగనుంది. డ్రోన్ల పనితీరును సైతం సోమవారం సాయంత్రం కోట్ల విజయభాస్కర్‌రెడ్డి స్టేడియంలో జిల్లా ఎన్నికల అధికారి, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్.వి.కర్ణన్, పోలీసు శాఖ సంయుక్త కమిషనర్ తఫ్సీ ర్ ఇక్బాల్ పర్యవేక్షించారు.

**4,01,365 మంది ఓటర్లు..**

కాగా జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో మొత్తం ఓటర్లు 4,01,365 మంది ఉండగా అందులోపురుషులు–2,08,561 మహిళలు–1,92,779 ఇతరులు–25 మంది ఉన్నారు. వీరికోసం మొత్తం 139 ప్రాంతాల్లో 407 పోలింగ్ బూత్‌లు ఏర్పాటు చేశారు. కాగా జూబ్లీహిల్స్ నియోజకవర్గం ఉప ఎన్నికల బరిలో మొత్తం 58 మంది అభ్యర్థులు ఉన్నారు. ప్రధాన పార్టీలైన కాంగ్రెస్ నుంచి వల్లాల నవీన్‌యాదవ్, బీఆర్ఎస్ నుంచి మాగంటి సునీతా గోపీనాథ్, బీజేపీ నుంచి లంకల దీపక్‌రెడ్డిలు ఉన్నారు. వీరితోపాటు స్వతంత్రులతో కలిసి 58 మంది అభ్యర్థులు కావడంతో దాదాపు నాలుగు ఈవీఎం యంత్రాలను పోలింగ్ కేంద్రాలలో వినియోగించే అవకాశం ఉంది. ఈవీఎంలలో ఈ సారి అభ్యర్థుల ఫొటోలను సైతం ఏర్పాటుచేశారు.

# ధాన్యం కొనుగోలు

>> పాటు, మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పత్తి, మొక్కజొన్న, సోయాబీన్ కొనుగోళ్లపై జిల్లా కలెక్టర్లతో విస్తృతంగా చర్చించారు. నవంబర్ నెలను పంటల సేకరణకు అత్యంత కీలకమైన కాలంగా పేర్కొన్నారు.మొక్కజొన్న రైతులు ఎకరాకు కొనుగోలు పరిమితిని 18.5 క్వింటాళ్ల నుండి 25 క్వింటాళ్లకు పెంచిన ప్రభుత్వ నిర్ణయంపై సంతృప్తిగా ఉన్నారని కలెక్టర్లు తెలిపారు.పత్తి కొనుగోళ్ల విషయంలో సీసీఐ, కొత్త ఎల్1, ఎల్2 నిబంధనల కారణంగా రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని కలెక్టర్లు వివరించారు.దీనిపై స్పందించిన తుమ్మల నాగేశ్వరరావు, పత్తి కొనుగోళ్ల పరిమితిని ఎకరాకు 7 క్వింటాళ్ల నుండి 12 క్వింటాళ్లకు పెంచేందుకు కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువస్తామన్నారు.వర్షాల కారణంగా రంగు మారిన సోయాబీన్ పంటను కూడా కొనుగోలు చేయడానికి అనుమతించాలంటూ కేంద్రానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదన పంపిందని ఆయన తెలిపారు.మొండా తుఫాన్ కారణంగా సుమారు 1.10 లక్షల ఎకరాలలో ధాన్యం, మొక్కజొన్న, పత్తి పంటలకు నష్టం వాటిల్లిందని నాగేశ్వరరావు తెలిపారు. వ్యవసాయ శాఖ రూపొందించిన పంటనష్టం నివేదికను కేంద్రానికి పంపామని, ప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో కొనుగోళ్లు సజావుగా సాగేందుకు ధాన్య తేమ శాతం నిబంధనలను సడలించమని కేంద్రాన్ని అభ్యర్థించామని చెప్పారు. మేము కేంద్రంతో చర్చలు కొనసాగిస్తామన్నారు. వాతావరణ ప్రభావంతో నష్టపోయిన పంటలు రైతులకు నష్టం కాకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. సమీక్ష ముగింపు సందర్భంగా ఇద్దరు మంత్రులు నవంబర్ నెలను రాష్ట్రవ్యాప్తంగా పంటల కొనుగోళ్లకు అత్యంత కీలకమైన నెలగా పేర్కొన్నారు.తదుపరి నాలుగు వారాల్లో మొత్తం ధాన్యం కొనుగోళ్లలో 55 శాతం జరగనుందని, అందువల్ల అన్ని శాఖలు సమన్వయంతో పని చేసి రాష్ట్ర లక్ష్యం అయిన 80 లక్షల మెట్రిక్ టన్నుల కొనుగోళ్లను సాధించాలన్నారు. తెలంగాణ ధాన్యం ఉత్పత్తి, కొనుగోళ్లలో చరిత్ర సృష్టించింది అని ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. ఇప్పుడు ఆ వేగాన్ని కొనసాగిస్తూ, సమర్థవంతమైన రవాణా, సమయానికి చెల్లింపులు, రైతుల ప్రయోజనాల పరిరక్షణపై దృష్టి పెట్టాలన్నారు ఇది రైతుల ప్రభుత్వం. కొనుగోలు చేసిన ప్రతి గింజ, చెల్లించిన ప్రతి రూపాయి, తీసుకున్న ప్రతి జాగ్రత్త రైతుల పట్ల మా నిబద్ధత ప్రతిబింబిస్తోందన్నారు.

# కెజిబివిల్లో ప్రవేశాలు!

>> రాష్ట్రంలో ఉన్న 495 కేజీబీవీల్లో ఇప్పటి వరకు ఎలాంటి ఎంట్రెన్స్ లేకుండా స్థానికంగా చదివే బాలికలకు అడ్మిషన్లు ఇస్తున్నారు. ప్రస్తుతం రాష్ట్ర వ్యాప్తంగా 495 కేజీబీవీలుండగా.. వాటిల్లో 1.55 లక్షల మంది విద్యార్థులు చదువుతున్నారు. ఇకపై వచ్చే విద్యాసంవత్సరం నుంచి ప్రవేశ పరీక్షను నిర్వహించి అందులో వచ్చిన మెరిట్ ఆధారంగా కేజీబీవీల్లోని సీట్లను భర్తీచేయనున్నారు. ప్రస్తుతం కొనసాగుతున్న 495 కేజీబీవీల్లో 93 కేజీబీవీలను సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ (సీవోఈ)లుగా అప్‌గ్రేడ్‌చేశారు. వాటిల్లో ఇంజనీరింగ్‌లో చేరాలనుకునే వారికి ఎప్‌సెట్, మెడికల్ సైన్సెస్‌లో చేరాలనుకునే వారికి నీట్ పోటీ పరీక్షలకు ప్రత్యేకంగా శిక్షణను ఇస్తున్నారు. రాష్ట్రంలోని కేజీబీవీల్లో వసతులను ఏర్పాటు చేయడానికి రూ. 243.16 కోట్లను ఖర్చు చేయనున్నారు. ప్రధానంగా బాత్రూమ్‌లు, టాయిలెట్ల కొరత సమస్యను పరిష్కరించాలని నిర్ణయించారు. 8,009 టాయిలెట్లు, బాత్రూమ్స్ మరమ్మత్తులు చేయించడం, 149 వాటర్ సంప్‌లు, 93 కేజీబీవీలకు ప్రహరీగోడలు నిర్మించడంతోపాటు 341 అదనపు తరగతి గదులను నిర్మించాలని ఇంజినీర్లు చెప్పగా.. ఆ మేరకు అంచనాలను రూపొందించి.. 475 కేజీబీవీల్లో అదనపు వసతుల కల్పన కోసం రూ.243.16 కోట్లను వెచ్చించేందుకు పరిపాలన పరమైన అనుమతులిచ్చింది. నాబార్డు నిధులను వెచ్చించేందుకు అనుమతులు మంజూరు చేసింది.

**మాడల్ స్కూళ్లలో ఇకపై 5వ తరగతిలో అడ్మిషన్లు!**

రాష్ట్రంలోని మాడల్ స్కూళ్లల్లో వచ్చే ఏడాది 2026–27 విద్యా సంవత్సరం నుంచి 5వ తరగతిలో అడ్మిషన్లు తీసుకోనున్నారు. ఇందుకు సంబంధించి ప్రభుత్వం అనుమతి కోరుతూ విద్యాశాఖ ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించింది. ప్రస్తుతం మాడల్ స్కూల్స్‌లో 6వ తరగతి నుంచి ఇంటర్ వరకు నిర్వహిస్తున్నారు. రాష్ట్రంలో వివిధ సంక్షేమ శాఖల అధ్వర్యంలో గురుకులాలను కొనసాగిస్తుండగా.. వాటిల్లో 5వ తరగతి నుంచే అడ్మిషన్లు తీసుకుంటున్నారు. దీంతో 6వ తరగతిలో మాడల్ స్కూల్స్‌లో చేరే విద్యార్థుల సంఖ్య తగ్గుతోంది. ఈ ఒక్క ఏడాదే సుమారు 40వేల సీట్లు మిగిలిపోయినట్టు అధికారుల లెక్కలు చెబుతున్నాయి. ఈ నేపథ్యంలోనే మాడల్ స్కూల్స్‌లోనూ 5వ తరగతిని ప్రవేశపెట్టాలన్న నిర్ణయానికి విద్యాశాఖ అధికారులొచ్చారు. ప్రభుత్వం మాడల్ స్కూల్స్‌లో 5వ తరగతిలో అడ్మిషన్లకు అనుమతి ఇస్తే.. ఇకపై 6వ తరగతిలో మాడల్ స్కూల్ ప్రవేశ పరీక్షను నిర్వహించకుండా.. తెలంగాణ సెట్ ద్వారానే మాడల్ స్కూల్స్‌లో కూడా 5వ తరగతిలో అడ్మిషన్లను చేపట్టాలని భావిస్తున్నారు. ఇందుకు ప్రభుత్వం అనుమతి ఇస్తే వచ్చే ఏడాది నుంచి మాడల్ స్కూల్స్‌లో 5వ తరగతిలో అడ్మిషన్లను తీసుకునే అవకాశం ఉంది.



మిర్యాలగూడలో రోడ్డుమీద శిశువును పరిశీలిస్తున్న పోలీసులు, స్థానికులు

# ఆమె అమ్మేనా!

## నెలలు నిండని శిశువును కవర్లో చుట్టి కాల్వలో పడేసిన నిర్దయురాలు

## మిర్యాలగూడలో హృదయవిదారక ఘటన

**మిర్యాలగూడ. నవంబర్ 10 ప్రభాతవార్త:** మాయమై పోతున్నడమ్మా మనిషన్న వాడు అన్న కవి అందె శ్రీ వ్యాఖ్యలు నిజం చేసే హృదయ విదారక ఘటన సోమవారం మిర్యాలగూడ పట్టణంలో వెలుగు చూసింది. సభ్య సమాజం తల దించుకునేలా సబ్ జైలు రోడ్డులో నెలలు నిండని పిండాన్ని గర్భ విచ్ఛిత్తి చేసి కవర్లో చుట్టి కాల్వలో పడేయటం మానవత్వాన్ని ప్రశ్నిస్తుంది. ఆడపిల్ల అని వద్దనుకున్నారో... లేక అసహజ అవాంచిత గర్భాన్ని తొలగించారో తెలియదు కానీ.... నెలలు కూడా నిండని ఆ మాంసం ముద్దని వీధి కుక్కలు పసిగట్టి నోట కరిచి పీక్కు తింటూ వెళ్తుండగా స్థానికులు గుర్తించి కుక్కలను తరిమి పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోస్టు మార్టం నిమిత్తం మృతశిశువుని ఏరియా ఆసుపత్రికి తరలించిన పోలీసులు స్త్రీ శిశు సంక్షేమశాఖ అధికారుల సాయంతో దర్యాప్తు చెస్తున్నారు.

# రహదారులేనా?

>>నిర్మాణాల నియంత్రణ కోసం సమన్వయ విధానం అవలంబించడానికి ఏపీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని పార్టీగా చేయాలని ఆదేశించింది. దేశంలో రోడ్డు ప్రమాదాలు ఆందోళన రేకెత్తిస్తున్నాయి. నిత్యం వందల సంఖ్యలో ప్రమాదాలు జరుగుతుండగా ఇందులో ప్రయాణికులకు ప్రాణసంకటంగా మారాయి. ఈ క్రమంలో సుప్రీంకోర్టు ప్రమాదాలపై దృష్టి సారించింది. నేషనల్ హైవేలపై ప్రమాదాలు కేవలం డ్రైవింగ్ లోపాలు మాత్రమే కాకుండా అధికార యంత్రాంగం నిర్లక్ష్యం వల్ల జరుగుతున్నట్లుగా కోర్టు పేర్కొంది. ఈ క్రమంలో ఈ వ్యవహారంపై ద్విసభ్య ధర్మాసనం స్పందించింది. రోడ్ల పక్కన అనుమతి లేకుండా ఏర్పాటు చేసిన దాబాలు, టీ దుకాణాలు, లారీ పార్కింగ్ కేంద్రాలు ప్రమాదాలకు కారణమని పేర్కొంది. అదే సమయంలో రహదారుల నిర్వహణలో కాంట్రాక్టర్లు, స్థానిక అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని రోడ్లపై గుంతలు, లైటింగ్ లేకపోవడం, రోడ్డు పక్కన సరైన రక్షిత గోడలు లేకపోవడం వల్లే ప్రమాదాల తీవ్రత మరింత పెంచుతున్నట్లుగా అభిప్రాయపడింది. ఈ క్రమంలోనే తెలంగాణ, రాజస్థాన్ ప్రమాదాలపై సుప్రీంకోర్టు సుమోటోగా తీసుకొని విచారణ చేపట్టింది. ఇందులో భాగంగా రహదారుల పరిస్థితిపై, భద్రతా చర్యలు, ప్రమాదాలకు కారణాలపై పూర్తి నివేదికను ఇవ్వాలని ఆదేశించింది. రోడ్ల పక్కన అనుమతి లేకుండా ఉన్న దాబాలు, హోటళ్లు, వర్క్‌షాప్‌లు ఎన్ని ఉన్నాయో సమగ్రంగా సర్వే చేయాలని ఆదేశించింది. రహదారుల నిర్మాణం, నిర్వహణ విషయంలో కాంట్రాక్టర్లు నాణ్యత ప్రమాణాలు పాటిస్తున్నారా లేదా అన్న అంశంపై సైతం దృష్టి సారించింది. ప్రమా ణాలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించింది. రోడ్ల నిర్వహణ అనేది నిర్మాణ మాత్రమే కాదని ప్రజల భద్రతకు సంబంధించిందని ధర్మాసనం స్పష్టం చేసింది.

## వారం - వర్జ్యం

11-11-2025, మంగళవారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
ఆశ్వయుజ మాసం, దక్షిణాయణం
శరదృతువు, కృష్ణపక్షం
సప్తమి రా.11.14
పుష్యమి సా.6.24, విశాఖ కార్తె
వర్జ్యం : ఉ.7.21-8.58
దు.ఉ.8.27-9.13
2) రా.10.09 - 10.55
రాహుకాలం - మ.3.00-4.30

## వార్తాఫలం

**మేషం :** పోటీ ప్రపంచంలో ముక్కు సూటితనం కన్నా లౌక్యం అవసరమని ఋజువు చేస్తాయి. పెట్టుబడుల విషయంలో తొందరపాటు వద్దు.

**వృషభం:** ఆత్మ సాక్షికి విరుద్ధంగా ఏపని చేయరు. ఆహార నియమాలు పాటించండి. ఆరోగ్య, కుటుంబ సమస్యల నుండి బయటపడతారు.

**మిథునం:** నిలిపివేసినటువంటి విద్యా కళా సంబంధమైన వాటిని పునఃప్రారంభిస్తారు. విలువైన వస్తువులు, ఆభరణాలు కొనుగోలు చేస్తారు.

**కర్కాటకం :** సున్నితమైన మనస్తత్వం ఇబ్బందికి గురి చేస్తుంది. ప్రముఖులతో పరిచయాలు పెరుగుతాయి. వాహనాలు కొనుగోలు చేస్తారు.

**సింహం:** కుటుంబ సభ్యుల సహాయంతో నూతన కార్యక్రమాలకు శ్రీకారంచుడతారు. ఇతరుల విషయాలలో జోక్యం తగదు.

**కన్య:** ఆరోగ్య, వాహనాల విషయాలలో మెలకువ పాటించండి. వివాదాలకు దూరంగా వుండండి. నూతన వ్యవహారాలు చేపట్టి సకాలంలో పూర్తి చేస్తారు.

**తుల :** కొన్ని అవకాశాలు అనుకోకుండా లభిస్తాయి. వీటిని చేజార్చుకోకండి. ఆస్తి విషయాలలో నూతన ఒప్పందాలు కుదురుతాయి.

**వృశ్చికం:** పాతమిత్రులను కలుసుకొని ఆనందంగా గడుపుతారు. ఉద్యోగులలో ఇంక్రిమెంట్లు, పదోన్నతులు పొందుతారు.

**ధనుస్సు:** దూరపు బంధువుల నుండి వచ్చిన సమాచారం ఆనందం కలిగిస్తుంది. వృత్తి, వ్యాపారాలలో ఎదురైన ఒడిదుడుకులు కొంతవరకు తీరుతాయి.

**మకరం:** కుటుంబ సభ్యుల నుండి ప్రోత్సాహం లభిస్తుంది. ఉద్యోగయత్నాలు సాగిస్తారు. ఆకస్మిక బదిలీలు ఉంటాయి.వస్తువులు కొనుగోలు చేస్తారు.

**కుంభం:** శత్రువులు సైతం మిత్రులుగా మారి సహాయం అందిస్తారు. క్రయ విక్రయాలలో లాభాలు పొందుతారు.శ్రమ అధికం.

**మీనం :** సంతానపరంగా సంతృప్తిని కలిగి వుంటారు. బంధువుల కలయిక. నూతన భాగస్వామ్య వ్యాపారాలు ప్రారంభిస్తారు.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# ఢిల్లీలో ఉగ్ర రాక్షసం

>>చేయడం వంటివి కట్టుదిట్టంగా కొనసాగుతున్న సంగతి తెలిసిందే. హర్యానాలో జరిగిన సంఘటన దేశవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. హర్యానాలో భారీ మొత్తంలో ఆర్డీఎక్స్ పట్టుబడటం దేశం మొత్తాన్ని వణికించింది. అయితే ఇది జరిగిన కొన్ని గంటల్లోనే దేశ రాజధానిలో భారీ పేలుడు చోటు చేసుకోవడం తీవ్ర అనుమానాలకు తావిస్తోంది. ఇందుకు సంబంధించి అనుమానితులు ఇద్దరిని అదుపులోకి తీసుకుని ఇంటరాగేషన్‌చేస్తున్నారు. సోమవారం సాయంత్రం ఢిల్లీలోని ఎర్రకోట మెట్రో స్టేషన్ వద్ద కారులో ఈ పేలుడు సంభవించినట్లు స్థానికులు వెల్లడించారు. ఎర్రకోట గేట్ నంబర్ వన్ మెట్రో స్టేషన్ వద్ద ఆపి ఉంచిన కారులో ఈ భారీ పేలుడు జరిగినట్లు ఢిల్లీపోలీసులు వెల్లడించారు. సోమవారం సాయంత్రం 6.52 గంటలకు ఈ పేలుడు సంభవించింది. ఈ పేలుడు ధాటికి పక్కనే ఉన్న



ఢిల్లీలో మృతదేహాలను తరలిస్తున్న దృశ్యం



ఎర్రకోట వద్ద పేలుడు ప్రాంతంలో డాగ్‌స్క్వాడ్ బృందం సోదాలు

8 కార్లు పూర్తిగా ధ్వంసం అయ్యాయి. ఈ పేలుడుతో సమీపంలో ఉన్న షాపులు కూడా దెబ్బతిన్నాయి. ఈ ఘటనలో ఇప్పటిదాగా 13మంది మృతి చెందగా వారి మృతదేహాలు ఛిద్రమైపోయాయి.శరీరభాగాలన్నీ చెల్లాచెదురుగా పడిపోయాయి. పేలుడు సంభవించగానే ఒక్కసారిగా మంటలు చెలరేగి అక్కడే ఉన్న 24 మందికిపైగా సామాన్య జనం తీవ్రంగా గాయపడ్డారు. వారిని వెంటనే దగ్గర్లో ఉన్న ఎల్ఎన్‌జేపీ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. గాయపడిన వారిలో పలువురి పరిస్థితి విషమంగా ఉండటంతో మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశాలున్నాయి. ఇక గాయపడిన వారిని పేలుడు ప్రాంతం నుంచి బయటికి లాక్కొచ్చినట్లు స్థానికులు వెల్లడించారు. ప్రమాద సమాచారం అందుకున్న ఫైర్, పోలీస్, ఇతర శాఖల సిబ్బంది హుటాహుటిన అక్కడికి చేరుకుని సహాయక చర్యలు ముమ్మరం చేశారు మరోవైపు బాంబ్ స్క్వాడ్, డాగ్ స్క్వాడ్ కూడా రంగంలోకి దిగి గాలింపుప్రారంభించింది. ఎన్ఐఏ, ఎన్ఎస్‌జీ బృందాలు కూడా ప్రవేశించి దర్యాప్తు ప్రారంభించాయి. 7 ఫైర్ ఇంజిన్లను రంగంలోకి దింపి మంటలను అదుపు చేస్తున్నారు. పేలుడు జరిగిన ప్రాంతానికి 15 క్యాట్ అంబులెన్స్‌లు, వైద్యబృందాలుకూడా చేరుకున్నాయి. పేలుడు జరగడానికి కారణం ఇప్పటివరకూ వెలుగులోకి రాలేదు. గౌరిశంకర్ మందిర్‌కు సమీపంలో సాయంత్రం 6.55 గంటలప్రాంతంలో ఈపేలుడు జరిగిందని ఢిల్లీ ఫైర్ సర్వీస్ అధికారులు తెలిపారు. పేలుడు సమాచారం తెలుసుకున్న ఢిల్లీ స్పెషల్ సెల్ పోలీసులు ఆ ప్రాంతం మొత్తం తమ అధీనంలోకి తీసుకుని పరిస్థితిని అంచనా వేస్తున్నారు. తీవ్రంగా గాయపడినవారిని, మృతదేహాలను ఢిల్లీలోని ఎల్ఎన్‌జె ఆసుపత్రికి తరలించారు. హర్యానాలోని ఫరీదాబాద్‌లో 2900 కిలోల పేలుడు పదార్థాలను స్వాధీనం చేసుకున్న రోజే ఢిల్లీలో ఈ భారీ పేలుడు సంభవించడం గమనార్హం. దీంతో ఈ రెండు సంఘటనలకు ఏదైనా లింక్ ఉందా అనే కోణంలో కేంద్ర దర్యాప్తు సంస్థలు, ఢిల్లీ పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. జమ్ముకాష్మీర్‌లో పోలీసులు భద్రతా దళాలు మొత్తం ఏడుగురిని అరెస్టుచేసిన కొన్ని గంటలకే ఈ పేలుడు జరిగింది. జమ్ముకాశ్మీర్‌లో అరెస్టుచేసిన వారిలోజైషే మహ్మద్, అన్సర్ ఘాజ్‌వాట్ ఉల్ హింద్ ఉగ్రసంస్థలకు చెందినవారే ఉన్నారు. వీరిలో ఇద్దరు డాక్టర్లు కూడా ఉండటం గమనార్హం.వారినుంచి భారీ ఎత్తున ఆయుధాలు, ఆయుధసామగ్రిని కూడా రికవరీచేసారు. వాటిలో ఎకె56 రైఫిల్, ఎకె క్రిన్‌కోవ్‌రైఫిల్,బెరెట్టా పిస్టల్ వంటివికూడా ఉన్నాయి. కారులో ఉంచిన పేలుడు సామగ్రిని రిమోట్‌సాయంతో పేల్చారా అన్న సందేహాలున్నాయి. ప్రతిసోమవారం ఢిల్లీలో పర్యాటకప్రాంతాలు, మార్కెట్లకు సెలవు కావడంతో భారీ ప్రమాదం తప్పింది. కాగా ఢిల్లీలో జరిగిన ఈ భారీ పేలుడుతో దేశం మొత్తం ఉలిక్కిపడింది. దీంతో ఢిల్లీ సహా దేశంలోని పలు నగరాల్లో హైఅలర్ట్ విధించారు. హరియానాలోని ఫరీదాబాద్‌లో సోమవారం ఉదయమే భారీ ఎత్తున పేలుడుసామగ్రి పట్టుకున్నారు. ఢిల్లీ, హరియానా, ఉత్తరప్రదేశ్‌లను కలిపే అన్ని సరిహద్దు కకేంద్రాలవద్ద పోలీస్ నిఘా పెంచారు. రైల్వేస్టేషన్లు,మెట్రోస్టేషన్లవద్ద కూడా భద్రత పెరిగింది.సరిహద్దుల్లో వాహనాలు, లాడ్జీలు, హోటళ్లను కూడా తనిఖీచేయాలని ఆదేశించారు. ఢిల్లీ సరిహద్దులు టిక్రీ, సింఘూ, బదర్‌పూర్‌సరిహద్దుల్లో అదనపు చెక్‌పోస్టులు, పోలీస్ పికెట్లు ఏర్పాటుచేసారు. అదేవిధంగా ఉగ్రమూకల చొరబాట్లు అత్యధికంగా ఉండే జమ్ముకాశ్మీర్‌లో భద్రతా బలగాలు హై అలర్ట్‌ప్రకటించాయి. కాగా పేలుడుకు కారణమైన కారు హర్యానా రాష్ట్రానిదని గుర్తించారు.రిజిస్ట్రేషన్ నంబరు హెచ్ఆర్ 26, 7674గా ఢిల్లీపోలీసులు తెలిపారు. కొందరు ఐ20 అని చెపుతుంటే మరికొందరు మారుతి స్విఫ్ట్ డిజైర్ అంటున్నారు. నదీమ్‌ఖాన్ అనే వ్యక్తిపేరిట ఈ కారు రిజిస్టరు అయిఉంది. పేలుడు సమయంలో కారులో ముగ్గురున్నారని పోలీసులు గుర్తించారు. కాగాపేలుడు సంఘటనకు సంబంధించి అనుమానితులు ఇద్దరిని అదుపులోకి తీసుకుని ప్రశ్నిస్తున్నారు. అయితే వీరు ఎక్కడివారన్నది పోలీసుల దర్యాప్తులో తేలాల్సి ఉంది. ఇద్దరు అనుమానితులను ఎన్ఐఎ, ఢిల్లీపోలీసులు సంయుక్తంగా ఇంటరాగేషన్‌చేస్తున్నారు. అయితే ఉద్దేశ్యపూర్వకంగాజరిగిందా, ప్రమాదవశాత్తూ జరిగిందా అన్నది దర్యాప్తుజరుగుతున్నదని ఢిల్లీపోలీస్ కమిషనర్ సతీష్ గోల్చా అన్నారు.

# పేలుడు ఘటనపై సిఎం రేవంత్ తీవ్ర దిగ్భ్రాంతి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,నవంబర్10:** ఢిల్లీలో జరిగిన పేలుడు ఘటనపై ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ అమానుష ఘటనలో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలకు సానుభూతి తెలిపారు. గాయపడిన వారందరూ త్వరగా కోలుకోవాలని భగవంతుడిని ప్రార్థించారు.

# కోర్టుధిక్కార పిటిషన్

>> దీనిపై స్పందించిన చీఫ్ జస్టిస్ గవాయ్... "నేను ఈ నెల 23న పదవీ విరమణ చేస్తున్నాను. ఆ తర్వాత నవంబర్ 24 నుంచి సుప్రీంకోర్టుకు సెలవులు" అని వ్యాఖ్యానించారు. వాదనలు విన్న అనంతరం, ఈ పిటిషన్‌పై విచారణను వచ్చే సోమవారం చేపడతామని ధర్మాసనం స్పష్టం చేసింది. ఇదిలా ఉండగా, ఎమ్మెల్యేలపై విచారణకు సంబంధించి మరింత గడువు కావాలని కోరుతూ స్పీకర్ కార్యాలయం దాఖలు చేసిన అదనపు పిటిషన్‌పై సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి ధర్మాసనం విచారించే అవకాశం ఉంది. నవంబర్ 14వ తేదికి ఈ కేసు లిస్ట్ అయింది. స్పీకర్ కార్యాలయం అడిగిన విధంగా సుప్రీంకోర్టు మరింత సమయాన్ని ఇస్తుందా.. గడువు సమయంలోగా అనర్హతపై నిర్ణయం తీసుకోనందుకు మందలిస్తుందా అన్నది నవంబర్ 14వ తేదీన తెలియనుంది.

# చలికిగజగజ

>> అవకాశమున్నట్లు తెలిపారు. అలాగే ఉదయం కూడా దీని తీవ్రత ఎక్కువగా ఉంటుందని నివేదిక సారాంశంలో ఉందన్నారు.రాత్రి కంటే ఉదయం 4 గంటల ప్రాంతంలో చలి ఎక్కువగా నమోదవుతున్నట్లు గణాంకాల ద్వారా తెలుస్తుందని చెప్పారు. ఈ నెలలో పొడి వాతావరణం ఉంటుందని భావించినప్పటికీ 1 నుంచి 3 రోజులు చలి అధికంగా ఉండే అవకాశం కనిపిస్తుందన్నారు. చలి కారణంగా వృద్ధులు, చిన్నారులు,బీపీ ఉన్నవారు శరీరాన్ని వెచ్చగా ఉంచేందుకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

# ప్రజాకవి అందెశ్రీ కన్నుమూత

>> జాలువారిన జయ జయహే తెలంగాణ గీతాన్ని తెలంగాణ ప్రభుత్వం రాష్ట్ర అధికారిక గీతంగా గుర్తించిన విషయం తెలిసిందే. తన పాటలు, రచనలతో ఆయన తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఉద్యమంలో కీలక పాత్ర పోషించారు. ఉద్యమ సమయంలో ఆయన గీతాలు ప్రజల్లో స్ఫూర్తిని రగిలించాయి. 1961, జూలై 18న ఉమ్మడి వరంగల్ జిల్లా మద్దూరు మండలం రేబర్తిలో (ప్రస్తుతం సిద్దిపేట జిల్లా) అందెశ్రీ జన్మించారు. ఆయన అసలు పేరు అందె ఎల్లన్న. భవన నిర్మాణ కార్మికుడిగా పనిచేశారు. పాఠశాల చదువు లేకుండానే కవిగా రాణించారు. 'మాయమై పోతున్నడమ్మ మనిషన్నవాడు అనే పాటతో మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. అశువు కవిత్వ చెప్పడంలో దిట్ట అయిన అందెశ్రీ.. ప్రజాకవి, ప్రకృతి కవిగా ప్రసిద్ధి చెందారు. తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించారు. తన పాటలతో ప్రజలను ఉత్తేజితులను చేశారు. తెలంగాణ రాష్ట్ర గీతం జయ జయహే తెలంగాణతోపాటు ఎన్నో పాటలు రాశారు. కాకతీయ విశ్వవిద్యాలయం నుంచి డాక్టరేట్ అందుకున్నారు. 2006లో గంగ సినిమాకు నంది పురస్కారం అందుకున్నారు. 2014లో అకాడమీ ఆఫ్ యూనివర్సల్ గ్లోబల్ పీస్ డాక్టరేట్, 2015లో దాశరథి సాహితీ పురస్కారం, రావూరి భరద్వాజ సాహితీ పురస్కారం, 2022లో జానకమ్మ జాతీయ పురస్కారం, 2024లో దాశరథి కృష్ణమాచార్య సాహితీ పురస్కరం, లోక్‌నాయక్ పురస్కారం అందుకున్నారు.ఇటీవల రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఆయనకు రూ.కోటి పురస్కారం,ఇంటి స్థలం, తామ్రపత్రం అందజేసింది. మాయమైపోతున్న మనిషి తనాన్ని తట్టిలేపినవాడు.. ఒక అనాథగా పెరిగి.. పశువులను కాసి.. అక్షర జ్ఞానం లేకపోయినా.. తనకు ఎదురైన సమస్యలనే అక్షరంగా మార్చి.. తన కవితలతో, రచనలతో ఎంతో మందిని ప్రభావితం చేసిన వ్యక్తి అందెశ్రీ.. ఆయన మరణం అందరిని కలచివేసింది. 'అందె శ్రీ మరణం మన సాంస్కృతిక, మేధో ప్రపంచంలో పూడ్చలేని లోటు. ఆయన ఆలోచనలు తెలంగాణ ఆత్మను ప్రతిబింబిస్తాయి. ఒక గొప్ప కవి, మేధావి అయిన ఆయన, ప్రజల పోరాటాలకు , ఆకాంక్షలకు , అకుంఠిత స్ఫూర్తికి గొంతుకగా నిలిచారు. ఆయన పదాలకు హృదయాలను కదిలించే శక్తి, అన్ని వర్గాల ప్రజల ఆకాంక్షలను ఏకం చేసే శక్తి, ప్రజల సాంఘిక హృదయస్పందనకు రూపం ఇచ్చే శక్తి ఉన్నాయి. ఆయన సామాజిక స్పృహను, సాహితీ సౌందర్యంతో మిళితం చేసిన విధానం అద్వితీయం. వారి కుటుంబసభ్యులకు, అభిమానులకు నా ప్రగాఢ సంతాపం తెలియజేస్తున్నాను. ఓం శాంతి అంటూ ప్రధాన మంత్రి



హైదరాబాద్‌లో సోమవారం అందెశ్రీ భౌతిక కాయం వద్ద నివాళులర్పిస్తున్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

నరేంద్ర మోడీ తెలుగులో ట్వీట్ చేశారు. అందెశ్రీ ఆకస్మిక మరణం పట్ల సీఎం రేవంత్ రెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆయన మరణం తెలంగాణ సాహితీ లోకానికి తీరని లోటన్నారు. తెలంగాణ రాష్ట్ర గీతం 'జయజయహే తెలంగాణ రాసిన సమయంలో అందెశ్రీతో జరిపిన సంభాషణలను గుర్తుచేసుకున్నారు. తెలంగాణ సాహితీ శిఖరం నేలకూలిందని చెప్పారు. స్వరాష్ట్ర సాధనలో అందెశ్రీ చేసిన కృషి చిరస్థాయిగా నిలిచిపోతుందని తెలిపారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. కాగా, అందెశ్రీ అంత్యక్రియలను అధికారిక లాంఛనాలతో నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు ఏర్పాట్లు చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావును సిఎం రేవంత్ ఆదేశించారు. మంగళవారం ఘట్కేసర్ ఎన్ఎఫ్‌సి నగరంలో అందెశ్రీ అంత్యక్రియలు జరుగనున్నాయి. అందెశ్రీ అంత్యక్రియలకు హాజరై ఆప్తులు,అభిమానులతో కలిసి అంతిమ యాత్రలో సిఎం రేవంత్‌రెడ్డి పాల్గొననున్నారు. అందెశ్రీ ఆకస్మిక మృతి పట్ల ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేష్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. తెలుగు సాహితీ లోకానికి అందెశ్రీ అందించిన సేవలు చిరస్మరణీయమని వారు కొనియాడారు. తెలంగాణకు రాష్ట్ర గీతాన్ని అందించిన డాక్టర్ అందెశ్రీ మరణ వార్త దిగ్భ్రాంతిని కలిగించిందని చంద్రబాబు తెలిపారు. తెలుగు సాహితీ లోకానికి ఇది తీరని లోటని చెప్పుకొచ్చారు. అందెశ్రీ ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ.. వారి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని సీఎం చంద్రబాబు తెలిపారు. అందెశ్రీ హఠాన్మరణం తీవ్ర దిగ్భ్రాంతిని కలిగించిందని ఏపీ డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్ తెలిపారు. అందెశ్రీ ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నానని పేర్కొన్నారు. అందెశ్రీ ఆకస్మిక మృతి పట్ల ఏపీ ఐటీ, విద్య శాఖల మంత్రి నారా లోకేష్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా అందెశ్రీ కుటుంబ సభ్యులకు తన సానుభూతి తెలిపారు. అందెశ్రీ అకాల మరణంపై తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. అందెశ్రీ మృతిపై తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. అందెశ్రీ ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.అందెశ్రీ మరణంపై మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. అందెశ్రీ మృతిపై తెలంగాణ రాష్ట్ర రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. అందెశ్రీ అకాల మరణంపై తెలంగాణ రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. అందెశ్రీ హఠాన్మరణంపై మంత్రి సంతాపం వ్యక్తం చేశారు. తెలంగాణ సమాజానికి, సాహితీ లోకానికి ఇది ఎప్పటికీ పూడ్చలేని లోటని పేర్కొన్నారు. అందెశ్రీ అకాల మృతిపై రాష్ట్ర మంత్రి కొండా సురేఖ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. అందెశ్రీ ఆకస్మిక మృతిపై మంత్రి వాకిటి శ్రీహరి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. అందెశ్రీ మరణం తెలంగాణ సాహిత్య లోకానికి తీరని లోటని తెలిపారు. అందెశ్రీ మరణంపై ఢిల్లీలోని తెలంగాణ భవన్ ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి ఏపీ జితేందర్ రెడ్డి సంతాపం వ్యక్తం చేశారు. అందెశ్రీ మరణం పట్ల మాజీ సిఎం,బీఆర్ఎస్ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆయన మరణం పట్ల విచారం వ్యక్తం చేస్తూ తన సంతాపాన్ని ప్రకటించారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం సాగిన సాంస్కృతిక ఉద్యమంలో కవిగా తన పాటలతో, సాహిత్యంతో కీలక పాత్ర పోషించిన అందెశ్రీ మరణం తెలంగాణకు తీరని లోటన్నారు. ఉద్యమ కాలంలో అందెశ్రీతో తనకున్న అనుబంధాన్ని స్మరించుకున్నారు. శోకతప్తులైన వారి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. అందెశ్రీ అకాల మరణం పట్ల భారత రాష్ట్ర సమితి వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆయన మరణం తెలంగాణ సాహితీ లోకానికి, రాష్ట్రానికి తీరని లోటన్నారు. శోకసముద్రంలో మునిగిన వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. అందెశ్రీ మరణం పట్ల కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రామచందర్‌రావు, బిఆర్ఎస్ సీనియర్ నేత,మాజీ మంత్రి హరీశ్‌రావు దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. అందెశ్రీ మరణం పట్ల అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి సంతాపం వ్యక్తం చేశారు.

# మైనార్టీ సంక్షేమ బాధ్యతలు చేపట్టిన మంత్రి అజారుద్దీన్

## ఫకీర్ రిహాబిలిటేషన్ ఫైల్‌పై తొలి సంతకం



**హైదరాబాద్, నవంబరు 10, ప్రభాతవార్త:** రాష్ట్ర మంత్రి వర్గంలో చేరిన మహ్మద్ అజారుద్దీన్ మైనార్టీ సంక్షేమం, పబ్లిక్ ఎంటర్‌ప్రైజెస్ శాఖల మంత్రిగా బాధ్య తలు చేపట్టారు. సచివాలయంలో తనకు కేటాయించిన ఛాంబర్‌లో సోమ వారం మధ్యాహ్నం 12.15 గంటలకు మంత్రిగా బాధ్య తలు స్వీకరించారు. అంతకు ముందు సచివాలయానికి వచ్చిన అజారుద్దీన్ ముస్లిం ప్రార్థనల మధ్య ఆయన తన ఛాంబర్లో ప్రవేశించారు. బాధ్యతలు చేపట్టిన అనంతరం ఫకీర్ రిహాబిలిటేషన్ ఫైల్‌పై ఆయన తొలి సంతకం చేశారు. ఈ సందర్భంగా మాట్లా డుతూ తనపై ముఖ్యమంత్రి పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని చెప్పారు. రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. కాగా మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన అజారుద్దీన్‌కు పలువురు నేతలు, అధికారులు శుభాకాంక్షలు తెలి పారు. కాగా గత నెల 31న అజారుద్దీన్ మంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. ఆయన చేత గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ప్రమాణం చేయించారు. ఆ తర్వాత నవంబర్ 4వ తేదీన అజారుద్దీన్‌కు శాఖలు కేటాయించగా తాజాగా ఆయన ఆ శాఖలకు బాధ్యతలు స్వీకరించారు.

# సిమ్ కార్డులలో సరికొత్త మోసాలకు తెరలేపిన సైబర్ నేరగాళ్లు

## ఆధార్ కార్డుల అప్‌డేట్ పేరిట వినియోగదారుల నుంచి వేలిముద్రలు సేకరిస్తున్న సిమ్ కార్డుల విక్రేతలు

## వీటి ద్వారా కొత్త సిమ్‌కార్డులు కొంటూ సైబర్ నేరగాళ్లకు అందజేస్తున్న వైనం

**హైదరాబాద్, నవంబరు 10, ప్రభాతవార్త:** సైబర్ నేరగాళ్లు కొత్త తరహా మోసాలకు తెరలేపారు. కొందరు సిం కార్డుల వ్యాపారులు సెల్ ఫోన్ విని యోగదారుల ఆధార్ కార్డుల అప్‌డేట్ పేరిట వారి వేలిముద్రలు, ఐరిస్ తీసుకుంటూ దీని ద్వారా కొత్త సిం కార్డులు తీసుకుని వాటిని సైబర్ నేరగాళ్లకు అందజేస్తున్నట్లు సైబర్ క్రైం పోర్టల్ అధికారులు గుర్తించారు. సెల్‌ఫోన్ వినియోగదారులకు తెలియకుండా వారికి ఏ మాత్రం అనుమానం రా కుండా జరుగుతున్న ఈ గోల్‌మాల్ తంతు వెనుక బడా సైబర్ నేరగాళ్ల పాత్ర వుండగా వీరికి మరికొందరు వ్యాపారులు సహకరిస్తున్నారు. ఢిల్లీలో కొందరు సెల్‌ఫోన్ వినియోగదారులు తమ పేరిట మరో సిం కార్డు వుందని, దీనిని సైబర్ నేరాలకు వాడుతున్నట్లు తెలియడంతో షాక్‌కు గురయ్యా రు. దీనిపై వీరిని పోలీసులు విచారించగా సైబర్ నేరాలకు వీరి పేరిట చలామణిలో వున్న సిం కార్డుల్లో వీరి పాత్ర లేదని నిర్ధారణ అయ్యాక నోటీ సులు ఇచ్చి వదిలివేశారు. దీని పై మరింత లోతుగా విచారించిన ఢిల్లీ పోలీసులు ఇద్దరు సిం కార్డుల వ్యాపారుల హస్తం వుండడంతో వారిని అరెస్టు చేశారు. ఈ తరహా మోసాలు ఢిల్లీతో పాటు ఇతర రాష్ట్రాలలోనూ జరుగుతున్న ట్లు సైబర్ క్రైం పోర్టల్ పరిశీలనలో వెలుగు చూసింది. సెల్‌ఫోన్ సి ం కార్డుకు సంబంధించి మరిన్ని వివరాలు కావాలని వినియోగదారులను తమ కార్యాలయాలకు పిలిపించి వారి నుంచి ఆధార్ కార్డ్ అప్‌డేట్ పేరిట పలుమార్లు వేలిముద్రలు, ఐరిస్ తీసుకుంటున్నారు కొందరు వ్యాపారులు. అనంతర ం వీటి సహాయంతో వినియోగదారుల పేరిట కొత్త సిం కార్డు లు తీసుకుని వీటిని సైబర్ నేరగాళ్ల కు అందజేస్తున్నారని సైబర్ క్రైం పోర్టల్ అధికారులు తెలిపారు.

**సంచార్ సాథీ యాప్‌తో మోసాలకు చెక్**

ఇదిలావుండగా సిం కార్డుల దుర్వినియోగాన్ని నిలువరించేందుకు కేంద్రం సంచార్ సాథీ పేరిట ఒక యాప్‌ను తీసుకువచ్చిన విషయాన్ని సైబర్ క్రైం పోర్టల్ అధికారులు చెబుతున్నారు. ఈ యాప్ ద్వారా సెల్‌ఫోన్‌లు వాడుతున్న వారు తమ పేరిట ఎన్ని సిం కార్డులున్నాయో...? తెలుసుకునే వీలుందని వారంటున్నారు. ఈ యాప్‌ను నెట్ సెంటర్‌లో లేదా బిఎస్ఎన్ఎల్ కార్యా యాలల్లో అధికారులను సంప్రదించి డౌన్ లోడ్ చేసుకోవచ్చని, అనంతరం తమ పేరిట ఎవరైనా సిం కార్డులు తీసుకున్నారా...? అనేది తెలుసుకోవచ్చని, ఒకవేళ ఎవరైనా తీసుకుని వుంటే వెంటనే పోలీసులకు ఫి ర్యాదు చేసి వారిపై చర్యలు తీసుకోవచ్చని వారంటున్నారు.

# 17,18 తేదీల్లో రాజీవ్ స్వగృహ ఓపెన్ ప్లాట్లు బహిరంగ వేలం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,నవంబరు 10:** రాజీవ్ స్వగృహ కార్పొరేషన్ ద్వారా అభివృద్ధి చేసిన లే ఔట్‌లలో నివాస భవనాల నిర్మాణానికి అనువైన ప్లాట్లను బహిరంగ వేలం ద్వారా విక్రయించనున్నారు. నగరానికి సమీపంలో ఉన్న తొర్రూర్, బహదూర్ పల్లి, కుర్మల్‌గూడ ప్రాంతాల్లోని 163 ఓపెన్ ప్లాట్లను ఈనెల 17, 18 తేదీల్లో బహిరంగ వేలం ద్వారా విక్రయిస్తున్నట్లు రాజీవ్ స్వగృహ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ వి.పి.గౌతం తెలిపారు. ఔటర్ రింగ్ రోడ్డుకు అతి చేరువలోని తొర్రూర్ ప్రాంతంలో 200 నుంచి 500 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఉన్న125 ప్లాట్లు, కుర్మల్‌గూడ లో 200ల నుంచి 300 చదరపు గజాల విస్తీర్ణంలోని 25 ప్లాట్లు, బహదూర్‌పల్లిలో 200ల నుంచి 1,000 గజాల్లోని 13 ప్లాట్లను విక్రయానికి నోటిఫికేషన్ విడుదల చేశారు. ఎటువంటి వివాదాలు లేని, ఈ ప్లాట్లలో తమ అభిరుచులకు అనుగుణంగా ఇళ్లను నిర్మించుకోవచ్చని, ఈ లే ఔట్లలో ఇప్పటికే మౌలిక వసతుల కల్పన కూడా పూర్తి అయ్యిందని ఎండి వి.పి.గౌతం పేర్కొన్నారు. ఈ ప్లాట్ల కొనుగోలుకు ఆసక్తి ఉన్న వారు ఈ నెల 15 వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని ఆయన తెలిపారు. పెద్ద అంబర్‌పేట్‌లోని అవికా కన్వెన్షన్‌లో నవంబర్ 17,18 తేదీల్లో తొర్రూర్ ప్రాంతంలోని 125 ప్లాట్లకు, 18 వ తేదీ మధ్యాహ్నం నుంచి బహదూర్ పల్లి, కుర్మల్‌గూడల్లోని ప్లాట్లకు బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు ఎండి గౌతమ్ పేర్కొన్నారు. తొర్రూర్‌లో నచ్చిన ప్లాట్ ఎంపిక కోసం ప్రజలు తరలివచ్చారు. రాజీవ్ స్వగృహ కార్పొరేషన్ ఆధ్వర్యంలోని ఓపెన్ ప్లాట్ల విక్రయాలపై అనేక మంది ఆసక్తి చూపుతున్నారు. ముఖ్యంగా తొర్రూర్‌లోని ప్రాజెక్టు సైట్‌లో మౌలిక సదుపాయాల గురించి వాకబు చేస్తూ, ఇప్పటికే ఈ లే ఔట్ లో ఇళ్లు కట్టుకొని నివసిస్తున్న వారితో మాట్లాడటంతో పాటు, ప్లాట్ల వాస్తును చూసుకుంటూ ప్రజలు సందడి చేస్తున్నారు. తొర్రూర్ లే ఔట్ లో ఉన్న 885 ప్లాట్లలో విడతల వారీగా ఇప్పటి వరకు 517 ప్లాట్లను విక్రయించారు. మిగిలిన వాటిలో ప్రస్తుతం 125 ప్లాట్లకు బహిరంగ వేలం నిర్వహిస్తున్నారు.



మండల తహసిల్దార్, మండల విద్యాధికారులు అస్వస్థతకు గురైన విద్యార్థుల నుండి వివరాలు సేకరిస్తున్న దృశ్యం

# వికటించిన మధ్యాహ్న భోజనం

## జమ్మికుంట ప్రభుత్వ పాఠశాలలో 17మంది విద్యార్థులకు అస్వస్థత: హుటాహుటిన ఆసుపత్రికి తరలింపు

**జమ్మికుంట/హుజూరాబాద్, ప్రభాతవార్త:** ప్రభుత్వ గురుకుల పాఠశాలలు, మరో పక్క బాస్ పాఠ శాలలు, ఇంకో పక్క ప్రభుత్వ రెగ్యూలర్ పాఠ శాలల్లో అధికారుల నిఘా కొరవడడంతో విద్యా ర్థుల భోజనాల్లో సుచిశుభ్రత, నాణ్యత ప్రమా ణాలు కొరవడడంతో నిత్యం కరీంనగర్ జిల్లాలో ఎదో ఒక పాఠశాలలో విద్యార్థుల ప్రాణాలకు ముప్పు పొంచి ఉన్నప్పటికి అధికార యంత్రాంగం ఎలాంటి చర్యలు తీసుకోకపోవ డంతో మరో పాఠశాలలో మరో సంఘటన. కరీంనగర్ జిల్లా జమ్మికుంట పట్టణంలోని ప్రభుత్వ బాలికల ప్రాథమిక పాఠశాలలో మధ్యా హ్న భోజనం తిన్న 25మంది విద్యార్థుల్లో 17మంది తీవ్ర అస్వస్థతకు గురికావడంతో పాఠశాల ఉపాధ్యా యులు అప్రమత్తమై చికిత్స కోసం వారిని హుటాహుటిన జమ్మికుంట ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించారు. ఈ సంఘటన పట్టణంలో దావ నంలా వ్యాపించడంతో మీడియాతో పాటు విద్యార్థుల తల్లిదండ్రులు, పట్టణ ప్రజలు హుటాహుటిన పాఠశాలకు పరుగులు తీసారు. మధ్యాహ్న భోజనం తిన్న విద్యార్థులను విలేక రులు ప్రశ్నించగా, భోజనంలో కుళ్లిపోయిన కోడ గుడ్ల వాసన వచ్చిందని, అన్నంలో పురుగులు ఉన్నా యని విద్యార్థులు ఆవేదనతో తెలిపారు. అస్వస్థత గురైన వారిలో 9మంది బాలికలు, 8 మంది బాలురు ఉన్నారు. భోజనం చేసిన అనం తరం మొదట ముగ్గురు విద్యార్థులు వాంతులు చేసుకున్నారని, ఆ తర్వాత కొద్ది సేపటికే మరి కొంత మంది విద్యార్థులు కడుపు నొప్పుందని కళ్ళుతిరుగుతుందని తెలపడంతో ఉపాధ్యాయులు అప్ర మత్తమయ్యారు. మధ్యాహ్న భోజనంలో నాసి రకం వంటసామాగ్రి, చాలా రోజుల కింద పెట్టిన గుడ్ల వలన విద్యార్థులు భోజనంలో సమస్య తలె త్తడంతో అస్వస్థతకు గురైనట్లు విద్యార్థుల తల్లి దండ్రులు ఆరోపిస్తున్నారు. ఒకేసారి ఇంత మంది విద్యార్థులు అస్వస్థతకు గురికావడం పట్ల విద్యా ర్థుల తల్లిదండ్రులు, అధికారులు సైతం ఆందో ళనకు గురవుతున్నారు.

సంఘటన సమాచారం అందుకున్న రెవెన్యూ అధికారులు, మండల విద్యాశాఖ అధికారులు హుటాహుటిన ప్రభుత్వ అసుపత్రికి చేరుకు న్నారు. విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిపై వైద్యులను అడిగి తెలుసుకున్నారు. ఆహారంలో జరిగిన కలుషితంపై న్యాయ విచారణ చేసి బాధ్యులైన వారిపై చర్యలు తీసుకుంటామని తహసిల్దార్ వెంకట్ రెడ్డి, మండల విద్యాధికారి హేమలత విద్యార్థుల తల్లిదండ్రులకు భరోసా ఇచ్చారు. మధ్యాహ్న భోజన పథకంలో పర్యవేక్షణ లోపం ఉందని, విద్యార్థుల ప్రాణాలకు భద్రత లేకుండా పోయిందని తల్లిదండ్రులు అధి కారులను నిలదీసారు. హుజూరాబాద్ బిఆర్ఎస్ శాసనసబ్యుడు పాడి కౌశిక్‌రెడ్డి, కేంద్ర హోం శాఖ సహాయమంత్రి, పార్లమెంట్ సభ్యులు బండి సంజయ్‌కుమార్, మాజీమంత్రి మల్కాజ్‌గిరి ఎంపి ఈటల రాజేందర్‌లు విద్యార్థుల ఆరోగ్యపరిస్థితి పై కరీంనగర్ జిల్లా కలెక్టర్ పమేలా సత్పతికి ఫోన్‌చేసి ఆరోగ్యపరిస్థితిపై అడిగితెలుసుకు న్నారు.

విద్యార్థుల పరిస్థితి నిలకడగానే ఉందని జిల్లా కలెక్టర్ వెల్లడించారు. అవసరమైతే మరింత అదునాతన చికిత్స కోసం కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించాలని ఎమ్మెల్యే, ఎంపిలు కలెక్టర్‌కు సూచించినట్లు తెలిసింది.

# రూ.1.30 కోట్ల సిఎంఆర్ ధాన్యం పక్కదారి

## విజిలెన్స్ తనిఖీలతో బయటపడ్డ 13842 గన్నీబ్యాగుల గల్లంతు వ్యవహారం

## విజిలెన్స్ తనిఖీలకు బెదరరు.. బ్యాంకు గ్యారెంటీలు ఇవ్వరు



విజిలెన్స్ బృందం తనిఖీలు నిర్వహిస్తున్న రైసుమిల్లు

**హైదరాబాద్, నవంబరు 10,ప్రభాతవార్త:** తెలంగాణ వ్యాప్తంగా రైసు మిల్లర్లు కస్టమ్ మిల్లింగ్ ధాన్యం తిరిగి ప్రభుత్వానికి అప్పగించ కుండా నల్లబజా రులోకి తరలిస్తుంటే ప్రభుత్వం అక్రమ దందాను కట్టడి చేసేందుకు విజిలెన్స్ తనిఖీల తీవ్రతను పెంచింది. తాజాగా సంగారెడ్డి జిల్లాలో ఆర్‌సి పురం అధికారులు పుల్కల్ మండలం ముది మానిక్యం గ్రామంలోని విజయదుర్గ ఆగ్రోస్ ఇం డస్ట్రీలో ఆదివారం తనిఖీలు చేశారు. 2024-25 రబీ సీజన్‌కు చెందిన ఒక కోటి 28లక్షల 45వేల 370 రూపాయల విలువగల ధాన్యం రైసు మిల్లరు చీకటిబజారుకు తరలించినట్లు అధికా రులు గుర్తించారు. రబీసీజన్‌లో మిల్లింగ్ చేసి ఇవ్వాల్సిన 5,537క్వింటాళ్ళ ధాన్యం సుమారు 13842 గోనెసంచులు రైస్‌మిల్లులో అధికారులు లెక్కించగా తక్కువ వచ్చాయి. సదరు రైసు మిల్లరును ప్రశ్నించినప్పటికి ఆయన సరైన సమాధానం అధికారులను ఇవ్వడంలేదు. రైస్‌మిల్లర్లు తెలంగాణలో దశాబ్దాలుగా సిఎంఆర్ బియ్యం అప్పగింతలో అనేక అక్రమపద్దతులు ఆచరిస్తుండటంతో వారిని నుంచి తీసుకొని ఎఫ్‌సిఐకి సకాలంలో రాష్ట్రప్రభుత్వం అందిం చడంలో విఫలమవుతోన్నది. సిఎంఆర్ వ్యవస్థను చక్కబరచాలని పౌరసరఫరాలశాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి గత రెండు సంవత్సరాలుగా అనేక ప్రయోగాలు చేస్తున్నప్పటికి సివిల్ సప్లయ్‌శాఖ అధికారులు రైసు మిల్లర్లు మాత్రమే ఆర్థికంగా బలోపేతం అవుతున్నారు కానీ సివిల్ సప్లయ్ కార్పొరేషన్ నానాటికి అప్పుల్లో కూరుకుపోతు చితికి పోతున్నది. రూ.59వేల కోట్లు అప్పులు, రూ.11వేల కోట్ల నష్టంతో ఆ సంస్థ కూనారిల్లు తోంది. సివిల్‌సప్లయ్‌శాఖ, సివిల్‌సప్లయ్‌శాఖ కార్పొరేషనన ఉద్యోగులు, రైసుమిల్లర్లు మాత్రం కోట్లకు పడగలెత్తుతున్నారు. సిఎంఆర్ ధాన్యం ఇవ్వడానికి ఇటీవల గతంలో ప్రభుత్వం చేసిన నిర్ణయం బ్యాంకు గ్యారెంటీ విధానం ఖచ్చితంగా అమలు పరచాలని నిర్ణయించింది. ఖరీఫ్ సీజన్‌లో సిఎంఆర్ ధాన్యం రైతులకు ఇచ్చేందుకు పదిశ శాతం పూచి కత్తుతీసుకొని రైసుమిల్లరుకు కేటా యించాలని నిర్ణయించింది. సిఎంఆర్ బియ్యం ఎగవేత రైసుమిల్లర్లు, లీజుకు రైస్ మిల్ తీసుకొనే వ్యాపారులకు 25శాతం బ్యాంకు పూచి కత్తు ఇవ్వాల్సి ఉంటుంది. అయితే రా, బాయిల్డ్ రైస్ మిల్లర్లు ఎవరు కూడా బ్యాంకు గ్యారెంటీ ఇవ్వ డానికి ముందుకు రావడంలేదు. విజిలెన్స్ దాడులు చేసిన పెద్దగా వారిలో భయం భక్తి లేదు సరికాదా టేక్ ఇట్ ఈజీ ధోరణితో వ్యవహరి స్తున్నారు.

# రోడ్డు ప్రమాదంపై ఎన్‌హెచ్ఎఐ, కేంద్రం నివేదిక అడిగన ' సుప్రీం'

## రోడ్డు ప్రమాదాలు భరించరాని మనోవేదన నింపుతాయి

## తెలంగాణ, రాజస్థాన్ దుర్ఘటనలను సుమోటోగా స్వీకరించిన సుప్రీంకోర్టు

**హైదరాబాద్, నవంబరు 10,ప్రభాతవార్త:** దేశంలోని మన రోడ్లు అమాయకుల పాలిట హంతకులుగా ఎందుకు రూపాంతరం చెందుతున్నాయో కేంద్రప్రభు త్వం, జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ ఎన్‌హెచ్ఎఐ వివరణతో కూడిన నివేదిక ఇవ్వాలని సుప్రీం కోర్టు ధర్మాసనం కోరింది. గత వారంరోజులుగా రాజస్థాన్, తెలంగాణలో వరుసగా జరిగిన రోడ్డు ప్రమాదాలలో 40 మందికి పైగా మృతి చెందిన అంశంను సుమోటోగా ఉన్నత న్యాయస్థానం తీసుకొని కేసు నమోదు చేసింది. రోడ్లపై వాహనాల పార్కింగ్ వల్లే ఈ ప్రమాదాలని జస్టిస్ విజయ్ బ్రిష్ణోయ్,జెకె మహేశ్వరీ ధర్మాసనం సోమవారం విచారణ సందర్భంగా అభిప్రాయపడింది. ఈ మేరకు ఆయా రాష్ట్రాల చీఫ్ సెక్రటరీలను కూడా పార్టీలుగా చేర్చాలని ఉన్నత న్యాయస్థానం ఆదేశించింది. కేంద్ర ప్రభుత్వం,జాతీయ రహ దారుల ప్రాధికార సంస్థ తెలంగాణ,రాజస్థాన్‌లో జరిగిన రెండు వేర్వేరు రోడ్డు ప్రమాదాలలో రెండు రోజులలోనే 40 మంది మృత్యువాత పడటం ఆ కుటుంబాలలో భరించరాని మనోవేదన నిపుంతాయని సుప్రీం కోర్టు జస్టిస్ జెకె మహేశ్వరి ఆవేదన వ్యక్తంచేశారు. గత సోమవారం చెవెళ్ళ సమీపంలోని మీర్జాగూడలో ఓవర్‌లోడ్‌తో ఎదరుగా వస్తున్న లారీని రోడ్డుపై గుంతను తప్పించబోయి తెలంగాణ రాష్ట్రరోడ్డు రవాణా సంస్థ బస్సు ఢీకొట్టిన సంఘటనలో 20 మంది వరకు చనిపోయారు. ఇందులో పాపం పుణ్యం ఏమీ ఎరుగని కొన్నిరోజుల క్రితం జన్మించిన పసికందు కూడా కన్నతల్లి ఒడిలో తొలి ప్రయాణం రోజునే సుదీర్ఘ ప్రయాణం చేసి అందనంత ఎత్తుకు వెళ్ళిపోయింది. రాజస్థాన్ లోని ఫలోడిలో కూడా ఇదే తరహా ప్రమాదం జరిగింది. అంతకు ముందు కర్నూల్ జిల్లాలో బెంగుళూరు వెళ్ళుతున్న బస్సు దగ్ధమై అందులో ప్రయాణిస్తున్న వారు సజీవదహనమైనారు.

# అందెశ్రీ నెల రోజులుగా మందులు వాడటం లేదు: గాంధీ ఆస్పత్రి వైద్యులు

**హైదరాబాద్, నవంబరు 10 ప్రభాతవార్త:** ప్రముఖ కవి, రచయిత అందెశ్రీ మృతిపై గాంధీ హాస్పిటల్ హెచ్‌వొడి డాక్టర్ సునీల్‌కుమార్ కీలక విషయాలు వెల్లడించారు. అందెశ్రీ సోమవారం ఉదయం హైదరాబాద్‌లోని లాలాగూడలోని ఆయన ఇంట్లో ఒక్కసారిగా కుప్పకూలిపోయారు. కుటుంబ సభ్యులు హుటాహుటిన గాంధీ ఆస్పత్రికి తరలించగా అప్పటికే ఆయన మృతి చెందినట్లు వెల్లడిస్తున్నారు. ఆయన ఆరోగ్యం విషయంలో నిర్లక్ష్యం చేయడంతోనే చనిపోయారని పేర్కొం టున్నారు. ఉదయం 7.20 గంటలకు అందెశ్రీని ఆయన కుటుంబ సభ్యులు గాంధీ ఆసుపత్రికి తీసుకొచ్చారని, హార్ట్‌స్టోక్‌తో చనిపోయారని తెలిపారు. ఆయనకు గత ఐదేళ్లుగా హైపర్ టెన్షన్ ఉందని, ఒక నెలరోజుల నుంచి మెడిసిన్ వాడటం లేదని చెప్పారు. ముందులు సరిగ్గా వాడకపోవడంతో ఆయాసం, చెస్ట్ డిస్ కంఫర్ట బుల్‌తో ఉన్నారని డాక్టర్ సునీల్‌కుమార్ తెలి పారు. ఆరోగ్యం విషయంలో అందెశ్రీ నిర్లక్ష్యం చేశారని కుటుంబ సభ్యులు చెప్పినట్లు తెలిపారు. రాత్రి భోజనం తర్వాత అందెశ్రీ మామూలుగానే పడుకున్నారని ఉదయం లేచి చూసేసరికి బాత్‌రూమ్ వద్ద కింద పడిపోయి ఉన్నారని తెలిపారు.



సోమవారం అందెశ్రీ భౌతికకాయం వద్ద నివాళి అర్పిస్తున్న కోదండరామ్

# తెలంగాణ సాహితీ దిగ్గజాన్ని కోల్పోయాం

## మహేష్ కుమార్,ఉత్తమ్,జగ్గారెడ్డి, విహెచ్


**హైదరాబాద్, నవంబరు 10,ప్రభాతవార్త:** తెలంగాణ సాహితి దిగ్గజాన్ని కోల్పోయామనీ అందెశ్రీ మరణం తెలంగాణ కు తీరాని లోటనీ టిపిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ స్వప్నం సాకారమైందే అందెశ్రీ పాటలతోనే అనీ టిపిసిసి చీఫ్ అభిప్రాయపడుతూ ఆయన ఆకస్మిక మరణం తనను తీవ్రంగా కలచివేసిందనీ పత్రికా ప్రకటనలో పేర్కొన్నారు. ఆయన మరణం తెలంగాణ సాహితీ లోకానికి తీరని లోటనీ అన్నారు. అందెశ్రీ పాట జయ జయహే తెలంగాణ పాట రాసినారని గుర్తుచేసుకొన్నారు. తెలంగాణ చరిత్ర, ప్రత్యేక రాష్ట్ర ఉద్యమాన్ని బలోపేతం చేసింది ఆ పాటనే అని ఆయన తెలిపారు. రాష్ట్ర అవతరణలో ఆయన పాత్ర చాలా కీలకమైందనీ అభిప్రాయపడ్డారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తున్నాననీ, ఆయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతినిమహేష్ కుమార్ గౌడ్ తెలిపారు. తెలంగాణ ఆత్మగౌరవ ప్రతీక అందెశ్రీ అనీ నీటి పారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కీర్తించారు. అందెశ్రీ మరణం తెలంగాణ సాహితీ లోకానికి తీరని లోటనీ సంతాప ప్రకటనలో పేర్కొన్నారు. ఆయన ఉద్యమ లక్షణాలు, ఆయన పోరాట పటిమ ఆయన రచనలు, ఆయన పాటలు ప్రస్తుత సమాజానికి యువతకు ఎంతో స్ఫూర్తి అని కొనియాడారు. ఆయన తెలంగాణ చరిత్ర, ఉనికి, ఉద్యమ చరిత్రలపై సాహిత్యం పైన రాసిన పాటలు చరిత్రలో నిలిచిపోతాయనీ అన్నారు. 2004 సంగారెడ్డి ధూంధాంతో ఆయన పాటతో నాకు పరిచయమైందనీ, ప్రజాకవి, రచయిత అందెశ్రీ హఠా న్మరణం బాధాకరమని మాజీ ఎమ్మెల్యే కాంగ్రెస్ నాయకుడు తూర్పు జయప్రకాశ్‌రెడ్డ అనారు. తెలంగాణ ఉద్యమ సమయంలో అందెశ్రీ పాటలు ప్రజలను చైతన్యపరిచాయన్నారు.

**అందెశ్రీ విగ్రహం ఏర్పాటు చేయాలి:హనుమంతరావు:** అందెశ్రీ పాటకు మరణం లేదు, ఆయన పాట ఎప్పటికీ సజీవంగానే ఉంచుతుంది. ఆయన విగ్రహం ఏర్పాటుచేయాలని వి.హనుమంతరావు అన్నారు.

# సంతాపం తెలిపి నివాళులర్పించిన మంత్రులు పొన్నం, అడ్లూరి, దామోదర

## సిపిఎం, సిపిఐ, పలు ఉపాధ్యాయ సంఘాలు

**హైదరాబాద్, ప్రభాతవార్త, నవంబరు 10:** తెలంగాణ రాష్ట్ర గీతం జయ జయహే ..తెలంగాణ గీతాన్ని రచించిన రచయిత.. అందెశ్రీ ఆకస్మిక మృతి పట్ల పలువురు సంతాపం ప్రకటించారు. ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగుల సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. అందెశ్రీ మృతిపట్ల మంత్రి పొన్నం ప్రభాకర్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. అందెశ్రీ మృతిపట్ల ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. స్వరాష్ట్ర సాధనలో, జాతిని జాగృతం చేయడంలో ఆయన చేసిన కృషి చిరస్థాయిగా నిలిచి ఉంటుందన్నారు. అందెశ్రీ (64) ఆకస్మిక మరణం పట్ల సిపిఎం తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ సంతాపం తెలిపారు. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని ప్రకటిస్తున్నా మన్నారు. పలు పురస్కారాలు అందుకున్న అందెశ్రీ అనేక అభ్యుదయ గీతాలు రచించారు. కవి, రచయిత అందెశ్రీ గారికి సిపిఐ జాతీయ కార్యదర్శి పల్లావెంకటరెడ్డి, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి ఎమ్మెల్యే కూనం నేని సాంబశివరావు, సిపిఐ జాతీయ నాయకులు చాడ వెంకటరెడ్డి, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కలవైన శంకర్, సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రమావత్ అంజయ్య నాయక్, మందా పవన్, రాష్ట్ర సమితి సభ్యులు పల్లె నరసింహ, రేగుంట చంద్రశేఖర్ సంతాపం ప్రకటించారు. కవి, రచయిత అందెశ్రీ మృతికి పలు ఉపాధ్యాయ సంఘాలు సంతాపం ప్రకటించాయి. టిఎస్ యూటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు చావ రవి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి వెంకట్ నివాళులర్పించారు. ఎస్‌టియు టిఎస్ రాష్ట్ర అధ్యక్షులు జి సదానందం గౌడ్, రాష్ట్ర ప్రధానకార్యదర్శి జట్టు గజేందర్ సంతాపం ప్రకటించారు. తెలం గాణ స్టేట్ లాంగ్వేజ్ టీచర్స్ అసోసియేషన్(ఎస్ఎల్‌టిఏ) రాష్ట్ర అధ్యక్షులు చక్రవర్తుల శ్రీనివాస్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌరీ శంకర్ రావు సంతాపం ప్రకటించారు. అందెశ్రీ మరణానికి ఎస్‌సి, ఎస్టి ఉపాధ్యాయ సంఘం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు తొంట సంత్యనారాయణ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెంట అంజయ్య సంతాపం ప్రకటించారు. అందెశ్రీ మృతికి డెమొ క్రటిక్ టీచర్స్ ఫెడరేషన్(డిటిఎఫ్) రాష్ట్ర అధ్యక్షులు ఎం సోమయ్య సంతాపం తెలిపారు.




అందెశ్రీ భౌతికకాయం వద్ద నివాళి అర్పిస్తున్న మాజీ మంత్రి కెటిఆర్

## ఉత్తర్‌ప్రదేశ్‌లో దారుణం

# ఫీజు చెల్లించలేదని పరీక్షలకు అనుమతి నిరాకరణ

## నిప్పంటించుకుని విద్యార్థి ఆత్మహత్య



**ముజఫర్‌నగర్, నవంబరు 10:** ఉత్తర్‌ప్రదేశ్ రాష్ట్రం ముజఫర్‌నగర్ జిల్లా బుధాన పట్టణంలో తీవ్ర విషాద ఘటన చోటుచేసుకుంది. ఓ ప్రైవేటు డిగ్రీ కాలేజీలో రెండో సంవత్సరం చదువుతున్న ఉజ్వల్ రాణా అనే విద్యార్థి నిర్ణీత సమ యంలో ఫీజు చెల్లించలేదు. దీంతో సదరు విద్యార్థిని శనివారం నిర్వహించిన పరీక్షలకు యాజ మాన్యం అనుమతించలేదు. ప్రిన్సిపాల్, లెక్చరర్లును పలుమార్లు బ్రతిమాలినా పరీక్ష రాసేందుకు ససేమిరా అన్నారు. ఇదే సమయంలో పోలీసులు కాలేజీకి చేరుకుని విద్యార్థికి సర్దిచెప్పే ప్రయత్నం చేశారు. ఈ దశలోనే ఒంటిపై పెట్రోల్ పోసుకుని నిప్పం టించుకున్నాడు. అప్రమత్తమైన పోలీసులు హుటాహుటిన బాధిత విద్యార్థిని ఆస్పత్రికి తరలించగా, వైద్యచికిత్స పొందుతూ ప్రాణాలు విడిచాడు. పోలీసులు కాలేజీ యాజమా న్యం, ప్రిన్సిపాల్, ముగ్గురు లెక్చరర్లపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. విధుల్లో నిర్లక్ష్యం వహించినందుకు ఎస్ఐ, ఇద్దరు కానిస్టేబుళ్లను పోలీస్ ఉన్నతాధికారులు విధుల నుంచి తప్పించారు. డిఎస్పీ నేతృత్వంలో సమగ్ర విచారణకు ఆదేశించారు.

# రోడ్డు ప్రమాదాల నివారణకు స్వీడన్ తరహా జీరో విజన్

## ఆదేశంలో 70 శాతం తగ్గిన ప్రమాదాలు

**హైదరాబాద్, నవంబరు 10, ప్రభాతవార్త:** యూరోపియన్ దేశం స్వీడన్‌లో రోడ్డు ప్రమాదాల నివారణ కు కొంతకాలంగా అమలు చేస్తున్న జీరో విజన్ చక్కటి ఫలితాలను ఇస్తుండడంతో దీనిని దేశంలో అమలు చేసేందుకు కేంద్ర రవాణా శాఖ కసరత్తులు చేయసాగింది. విజన్ పథకం అమలు వల్ల స్వీడన్‌లో రోడ్డు ప్రమాదాలు 70 శాతం తగ్గడంతో దీనిని తెలుగు రాష్ట్రాల సహా ఎంపిక చేసిన మరికొన్ని రాష్ట్రాలలో అమలు చేసేందుకు కేంద్రం ని ర్ణయించినట్లుగా తెలుస్తోంది. ఈ విషయంలో జాతీయ నేర గణాంక సంస్థ (ఎన్‌సిఆర్‌బి) సహకారం తీసుకోవాలని కేంద్రం నిర్ణయించింది. ప్రపంచ దేశాలలో రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్న మొదటి పది దేశాల్లో భారత్ వుండడం తెలిసిందే. భారత్ వరకు వస్తే తెలుగు రా ష్ట్రాలతో పాటు కొన్ని ఉత్తరాది, పశ్చిమాది రాష్ట్రాలలో ప్రమాదాల సంఖ్య ఎక్కువగా వుంటోంది. రోడ్డు ప్రమాదాలకు ప్రధాన కారణం అతివేగం, మద్యం సేవించి వాహనాలు నడపడం, సెల్‌ఫోన్ డ్రైవింగ్, చెవుల్లో ఈయర్ ఫోన్లు పెట్టుకుని సంగీతం వింటూ డ్రైవింగ్ విషయంలో ఏమర పాటు గా వుండడం వంటి కారణాలుగా ఎన్‌సిఆర్‌బి నివేదిక వెల్లడించింది. మొత్తం ప్రమాదాలలో 80 శాతం ప్రమాదాలు వీటివల్లే జరుగుతున్నట్లు ఎన్‌సి ఆర్‌బి తేల్చింది. యూరోపియన్ దేశంలో కూడా గతంలో రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరిగేవి. వీటి నివారణకు ఆ దేశం జీరో విజన్ పేరిట వినూ త్న పథకాన్ని అమలు చేసింది. 1997 నుంచి జీరో విజన్‌ను స్వీడన్ అమలు చేస్తుండగా దీని ద్వారా 70 శాతం ప్రమాదాలు తగ్గాయని ఒక అధ్య యనంలో తేలింది. జీరో విజన్ ప్రకారం ప్రతీ వాహనం తాను ప్రయాణించే ప్రాంతానికి అను గుణంగా వేగ పరిమితిని కచ్చితంగా పాటించాలి. పాఠశాల జోన్‌లలో 30 కిలోమీటర్లు, నివాస ప్రాంతాలలో 40 కిలోమీటర్లు, జాతీయ రహదారులపై 90 నుంచి 110 కిలోమీటర్ల వేగంతో ప్రయా ణించే వీలుంది. వీటిని ఆయా ప్రాంతాలలో ప్రయాణించే వాహనదారులు కచ్చితంగా పాటించాల్సి వుంటుంది. ఒకవేళ ఎవరైనా ఉల్లంఘిం చినట్లు తేలితే భారీ జరిమానాలతో పాటు డ్రై వింగ్ లైసెన్స్‌లను శాశ్వతంగా రద్దు చేయడం, ప్రమాదాలకు కారణమైతే జైలు శిక్షలు విధించడం వంటివి చే స్తారు. వాహనదారులు నిబంధనలు ఉల్లంఘించకుండా అన్నిచోట్ల సిసి కెమెరాలు అందు బాటులో తెచ్చారు. ఇక రహదారులపై అనేకచోట్ల సిగ్నళ్లకు బదులు వాహనాలు సాఫీగా వెళ్లేందుకు ఎబౌట్ కూడళ్ల అందుబాటులోకి తెచ్చారు. దీంతో పాటు ప్రత్యేక సైకిల్ లేన్‌లు, పాదచారుల మార్గాలు ని ర్మించారు. కీలకమైనచోట్ల వాహనాల వేగాన్ని ఆటోమెటిక్‌గా నియంత్రించేలా స్పీడ్ బంప్స్, నారో లేన్స్ ఏర్పాటు చేశారు. జాతీయ రహదారుల్లో 2 ప్లస్ 1 రోడ్లు నిర్మించి ఒక లేన్‌ను ఓవర్ టేకింగ్ కోసం మిగతా వాటిని సేఫ్టీ బారియర్‌లతో విభజించారు. దీంతో పాటు దివ్యాంగులు, పిల్లలు సు లభంగా ఎక్కేలా లోఫ్లోర్ బస్సులు అందుబాటులో తెచ్చారు. ఇక వాహనాలు దేనినైనా ఢీకొనే సమయంలో ఆటోమెటిక్‌గా గుర్తించి ఆగిపోయేలా అ టానమస్ ఎమ్మ ర్జెన్సీ బ్రేకింగ్ సిస్టంను ప్రవేశపెట్టారు. డ్రైవర్లు మద్యం తాగి వాహనాలు నడిపితే వాహనాలు స్టార్ట్ కాకుండా ఇంటర్ లాక్, నిద్రమ త్తులో జారుకుంటే అప్రమత్తం చేసేలా ఫెటీగ్ మానిటరింగ్ సిస్టం అమలు చేశారు. ఇలా చేయ డం వల్ల స్వీడన్‌లో గతంలో ప్రతీ మిలియన్ జనా భాకు రోడ్డు ప్రమాదాలలో 60 మరణాలు వుండ గా ఇప్పుడు 16కు తగ్గింది. జీరో విజన్ పథకం అమల్లో తెస్తే దేశంలో రోడ్డు ప్రమాదాలు తగ్గే వీ లుందని కేంద్రం భావిస్తోంది. తెలుగు రాష్ట్రాల్లో ఏటా 16 వేల మంది వరకు రోడ్డు ప్రమాదాల్లో మరణిస్తుండగా దేశ వ్యాప్తంగా ఈ సంఖ్య లక్షా 20 వేల వరకు వుంటోంది.

తెలంగాణ ప్రభుత్వం
అటవీ శాఖ
ఇ-టెండరు ప్రకటన
సంగారెడ్డి జిల్లా, సంగారెడ్డి రేంజ్, గుమ్మడిదల బీట్ మరియు సెక్షన్, మంబాపూర్ అర్బన్ ఫారెస్ట్ పార్క్ Compt.No. 335 & 336 వద్ద యోగాషెడ్ నిర్మాణం అనగా (1) పని కొరకు టెండర్ ఐడి: 642577 ప్రకారం ఇ-ప్రొక్యూర్‌మెంట్ ప్లాట్ ఫారం పై 2025-26 కాలానికి File No. 2179/S6/2025, తేదీ: 08.11.2025న ప్రచురితమైనది. పని యొక్క వివరాలను www.tender.telangana.gov.in కు లాగింగ్‌చే చూడవచ్చును. క్ర.సం.1. పని పేరు: సంగారెడ్డి జిల్లా, సంగారెడ్డి రేంజ్, గుమ్మడిదల బీట్ మరియు సెక్షన్, మంబాపూర్ అర్బన్ ఫారెస్ట్ పార్క్, Compt No. 335 & 336 వద్ద యోగాషెడ్ నిర్మాణం. అంచనా మొత్తం రూ. 9,24,500/-. 2) బిడ్ డాక్యుమెంట్ దాఖలు మరియు టెండర్ షెడ్యూల్ డౌన్‌లోడ్: 10.11.2025 ఉ.10.30గం. నుండి 27.11.2025 మ.3.00గం. 3) టెక్నికల్ బిడ్ తెరచు తేది: 27.11.2025 సా.4.00గం. 4) ప్రైస్ బిడ్ తెరచు తేది: 27.11.2025 సా.4.50గం. ఆఫీసు చిరునామా: జిల్లా అటవీ అధికారి, మల్కాపూర్ 'X' రోడ్ దగ్గర సంగారెడ్డి, రామచంద్రారెడ్డి కాలనీ, సంగారెడ్డి - 502001 (సంప్రదించు నం. 9440810118).
సం/-. జిల్లా అటవీ అధికారి, సంగారెడ్డి.
DIPR.NO. 10418-PP/CL/ADVT/1/2025-26 తేదీ: 10.11.2025


వార్త

శ్రమతో సంపాదించిన సంపదను అనుభవించడమంత మాధుర్యం మరొకటి లేదు. శ్రమించే వారున్నచోటే సంపద ఉంటుంది.

-గోథే

# వీధి కుక్కల బెడద తప్పేనా?

నడిరోడ్డు మీద స్వైరవిహారం చేసే కుక్కల భారినపడకుండా తప్పించుకోగలిగిన మానవ మాత్రుడెవరూ ఉండరు. వీధి కుక్కల నియంత్రణపై పదేపదే తర్జన భర్జన పడటం తప్పడం లేదు. వీధి కుక్కలపై సుప్రీంకోర్టు మరోసారి జోక్యం చేసుకోవాల్సి వచ్చింది. వీధి కుక్కల బారినపడి రేబిస్ వ్యాధితో మృతిచెందిన కొన్ని కేసులగురించి ఇప్పటికే న్యాయస్థానం ముందుకు రావడంతో గతంలో ఒకసారి సుప్రీంకోర్టు తీవ్రంగా ఆలోచించి కొన్ని కీలకనిర్ణయాలు ప్రకటించింది. అయినప్పటికీ ప్రభుత్వ సంస్థలు కలిసి రాకపోవడం, నిష్క్రియాపర్వాతం కారణంగా తమ తొలి ఆదేశాలు పట్టించుకోకపోవడంతో ధర్మాసనం కాస్త ఆగ్రహించినా కొత్తగా మార్గదర్శకాలు జారీ చేసింది. పౌరుల భద్రత, చిన్నారులు, వృద్ధులు, అనారోగ్యంతో ఉన్నవారి రక్షణ రీత్యా ఈ కొత్త మార్గదర్శకాలు వీధికుక్కల బెడదను కాస్తయినా తగ్గించే వీలుంది. విద్యాసంస్థలు, బస్ స్టేషన్లు, రైల్వే ప్రాంగణాలు, క్రీడా సముదాయాల్లో ఎక్కడపడితే అక్కడ వీధి శునకాలు ప్రత్యక్షమవుతుంటాయి. వాటిని ఏమాత్రం అదిలించినా వాటి పక్కనే వెళ్తున్నప్పుడు 'తమ మీదకే వస్తున్నారేమోనన్న' భీతి కలిగినా అవి మానుషుల మీద దాడి చేస్తున్నాయి. ఈ కారణంతో రోజూ వీధి కుక్కల కాట్లకు ఆస్పత్రులపాలైన ఘటనలు ఎన్నో నమోదవుతున్నాయి. అరుదుగా కాదు తరచుగా అత్యంత కీలకంగా ఉన్న ప్రాంతాల నుండి అత్యవసరంగా వీధికుక్కలను షెల్టర్లకు తరలించాలి. వాటిని సంతానోత్పత్తి నియంత్రణ శస్త్ర చికిత్స చేసిన తర్వాత తిరిగి అవి నివసిస్తున్న పాత ప్రాంతంలో వదిలిపెట్టరాదు. వీధి కుక్కల స్వైర విహారాల గురించి చెప్పుకోవాలంటే శనివారం ఒక్కరోజే హైదరాబాద్ నగరంలోని బాలానగర్‌లో కనీసం 25 మందిని వీధికుక్కలు కరిచాయి. ఆయా ప్రాంతాలన్నీ జనసమ్మర్థంగా ఉంటాయి. అలాంటి చోట చిన్న సంఘటనలేమీ నమోదవవు. భీతిల్లి ఎక్కువ మందినే కరచుకుంటూ వెళ్తాయి. రాష్ట్ర ప్రభుత్వాలతోపాటు జాతీయ రహదారుల శాఖ, స్థానికసంస్థలు, హైవే గస్తీ బృందాలు తమ ఆదేశాలను తక్షణమే అమల్లోకి తేవాలని సుప్రీం ధర్మాసనం జస్టిస్ విక్రమనాథ్, జస్టిస్ సందీప్‌మెహతా, జస్టిస్ ఎన్.వి అంజారియాలతో కూడిన త్రిసభ్య ధర్మాసనం కీలక ఉత్తర్వులు జారీ చేసింది. ప్రజల భద్రతే తమకు ముఖ్యమని తేల్చి చెప్పిన ధర్మాసనం ప్రభుత్వ సంస్థలను కూడా హెచ్చరించింది. రెండు వారాల్లోగా ఈ చర్యలను చేపట్టాలని కోరింది. ఆయా ప్రధాన సంస్థలకు ఫెన్సింగ్ కూడా ఏర్పాటు చేయాలని ప్రభుత్వాలను ఆదేశించింది. సాధారణంగా రాష్ట్రప్రభుత్వాలు ఆర్థిక భారం పేరిట వీధి కుక్కల నియంత్రణకు నిధుల్లేవనే సాకుతో మిన్నకుంటాయి. ఈసారలా కాదు. సుప్రీం కోర్టు పర్యవేక్షణలోనే ఈ కార్యక్రమాలను చేపట్టాల్సి ఉంటుంది. కనుక నిధుల్లేవనే సమస్య ఎదురు కాబోదు. అందుచే ఈ సంస్యకు ఒక పరిష్కారం దొరుకుతున్నట్లే. యానిమల్ బర్త్ కంట్రోల్ నిబంధనల ప్రకారం వాటికి వ్యాక్సినేషన్, స్టెరిలైజేషన్ చేయించడం ప్రథమ కర్తవ్యంగా భావిస్తున్నట్లు ఆయా సంస్థల అధికార్లు ప్రతి మూడు నెలలకోసారి నిర్దేశిత జనసమర్థ ప్రాంతాలను తనిఖీచేయాల్సి ఉంటుంది. ఆ ప్రాంతంలో కుక్కలు లేవని నిర్ధారించుకోవాల్సి ఉంటుంది. ఈ ప్రాంతంలో కుక్కలను దూరప్రాంతానికి తీసుకుపోయినా మరో ప్రాంతం నుంచి కొత్తకుక్కలు అక్కడకు చేరతాయని, అది నిబంధనలకు విరుద్ధమని కొందరు అభ్యంతరం వ్యక్తం చేసినా కోర్టు తోసిపుచ్చింది. ఇదే సందర్భంలో రోడ్లపై స్వైర విహారం చేసే పశువుల్ని కూడా ఎనిమిది వారాల్లోగా నియంత్రించాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. రానురాను వీధికుక్కల సమస్య పెరిగిపోవడంతో సుప్రీం ఆదేశాలు అమలు చేయకతప్పని పరిస్థితిఏర్పడింది. కేంద్రప్రభుత్వ గణాంకాల ప్రకారం గత సంవత్సరంలో సగటున రోజుకి 10వేల మందిని కరిచాయి. దేశవ్యాప్తంగా 2024లో 37,15,713 కుక్క కాటు కేసులు నమోదైనాయి. 2025 జనవరిలోనే 4.29 లక్షల మంది వీధికుక్కల బారినపడ్డారు. 2022-24ల మధ్య అత్యధిక కుక్కకాటు కేసులు నమోదైన పది రాష్ట్రాలలో మహారాష్ట్ర (13.5లక్షలతో) ప్రథమ స్థానంలోఉంది. తెలంగాణ3.33 లక్షల కేసులతో ఎనిమిదో స్థానంలో ఉంది. ప్రపంచవ్యాప్తంగా జరిగే రేబిస్ మరణాల్లో 36శాతం భారతదేశానివే. ఇంకా విశేషంగా చెప్పాలంటే మన దేశ జనాభా కన్నా వీధిశునకాలు ఎక్కువగా ఉన్నాయి. దేశంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటుఆస్పత్రులు యాంటీ రేబిస్ వ్యాక్సిన్లను నిల్వ ఉంచుకోవాలి. తమ ప్రాంగణాలు శుభ్రంగా ఉంచుకుని, వీధికుక్కలు ప్రవేశించకుండా చూసేందుకు ఆయా సంస్థలు నోడల్ అధికారిని నియమించుకోవాలని సర్వోన్నత న్యాయస్థానం ఇచ్చినమార్గదర్శకాల జాబితాలో ఉంది. ప్రాంగణాల చుట్టూ ప్రహరీలు, కంచెలు, గేట్లనిర్మాణంవంటి పనులను 8వారాల్లోగా నిర్మాణాలను చేపట్టాలని ఆదేశించింది. కుక్కల నియంత్రణలో స్థానికసంస్థలు కొన్ని జాగ్రత్తలు తీసుకున్నా అనేక కారణాల రీత్యా అవేమీ అమలు జరగడం లేదు. ఒకవేళ ఔత్సాహిక యాజమానికార్యనిర్వాహంగా చురుకుగాఉన్న చోట్లవీటిని పాటించినా ప్రజల్నుంచి ప్రభుత్వంనుంచి తగు ఒత్తిడిఉంటే తప్ప ఇలాంటివి ముందుకుసాగే కార్యక్రమాలు కాబోవు. గతంలోనే ధర్మాసనం ప్రభుత్వఉద్యోగుల కాలనీల్లో కుక్కకాటుకు గురవుతున్న ప్రజల ఆక్రందనలు వినిపించుకుని కఠిన నిర్ణయాలు తీసుకుంది. ప్రజలు, ప్రభుత్వాలు, ప్రభుత్వసంస్థలుమూకుమ్మడిగా కుక్కల నియంత్రణకు నడుం కడితేతప్ప కుక్కల భారినుంచి జనాన్ని కాపాడుకోవడం సాధ్యంకాదు.



విజ్ఞానం సాధించువారు ధన్యులు. బంగారాన్ని సంపాదించడం కంటే విజ్ఞానం సంపాదించడం మంచిది.

రవీంద్రనాథ్ ఠాగూర్



ప్రమాణము అంటే వెనుకంజ వేయని నిశ్చయబుద్ధి, దృఢమగు నిశ్చయం లేకపోతే అభివృద్ధికి అవకాశమే ఉండదు.

మహాత్మా గాంధీ

# ప్రజావాక్కు



## రసాయన పరిశ్రమలే ఆధారం

రసాయన పరిశ్రమలు దేశఅభివృద్ధికి వెన్నెముక. వ్యవసాయం నుంచి ఔషధాలు, ప్లాస్టిక్‌లు, విద్యుత్ పరికరాల వరకు మన దైనందిన జీవితంలో ఉపయోగించే అనేక వస్తువులకు ఇవేఆధారం. అయితే, ఈరసాయన పదార్థాల స్వభావం సున్నితమైనది. ఇవి అగ్ని, ఉష్ణోగ్రత, ఒత్తిడి, లేదా ఇతరరసాయనాలతో కలిసినప్పుడు అసాధారణంగా ప్రతిస్పందిస్తాయి. అందుకే ఈ పరిశ్రమల్లో భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలి. ఇటీవల గుజరాత్‌లో అగ్ని ప్రమాదం, ఆంధ్రప్రదేశ్‌లో గ్యాస్‌లీక్, తమిళనాడులో నిల్వ లోపాలవల్ల పేలుడు వంటిఘటనలు భద్రతా నియమాలు కేవలం పుస్తకాల్లో కాకుండా, ప్రతిరోజు ఆచరణలో ఉండాలని స్పష్టం చేశాయి. మార్పు, అవగాహన, అప్రమత్తతే ఇందుకు పరిష్కారం. ప్రతి రసాయన పరిశ్రమలో మొదటగా ప్రమాద విశ్లేషణ చేయాలి.

- సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

## ఉచిత ప్రయాణం పేద విద్యార్థి వాక్కు

ప్రభుత్వం మహిళల పేరిట ఉచిత ప్రయాణ పథకాన్ని అమలు పరిచింది. వెంటనే ఈ ఉచిత ప్రయాణ వసతిని తొలగించాలి. ఉచిత బస్సు ప్రయాణం పేద విద్యార్థులకు చెందవలసిన హక్కుమాత్రమే కానీరాజకీయ వ్యూహాలతో అనవసర పథకాలు పెట్టాల్సిన పనిలేదు. పథకాలు పేదవాడికి భరోసానివ్వాలి కానీ భారాన్ని మిగల్చొద్దు. కాబట్టి ఈ పథకాన్ని రద్దుపరిచి దీని స్థానంలో పేద విద్యార్థులకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించాలి.

- కాల్వ నిఖిత, సిద్దిపేట

## ఇతర దేశాలపై ఆధారపడడం తగ్గించాలి

భారత ఐటీరంగం ఎంతోవేగంగా అభివృద్ధి చెందుతున్నా, హెచ్1బి వీసాలపై అధిక ఆధారపడటం భవిష్యత్తుకు ప్రమాదకరంగా మారుతోంది. ప్రపంచ వలస విధానాలు క్రమంగా కఠినతరమవుతున్న ఈ పరిస్థితుల్లో, స్థిరమైన వ్యూహాలను అవలంబించడం అనివార్యం. స్థానిక నియామకాలనుపెంచడం, రిమోట్ డెలివరీ విధానాలను అభివృద్ధి చేయడం, అంతర్జాతీయ భాగస్వామ్యాలను బలోపేతం చేయడం ద్వారా సంస్థలు తమస్వావలంబనను నిర్ధారించుకోవాలి. అదే సమయంలో స్వదేశీ ప్రతిభను పెంపొందించడం అత్యంత ప్రాధాన్యం కలిగిన అంశం.

- ఎన్.రామకృష్ణ, నెల్లూరు జిల్లా

## చారిత్రక నిర్మాణాలను సంరక్షించాలి

తెలంగాణ చరిత్రలో కాకతీయుల యుగం ఒక సువర్ణయుగం. ఆ కాలంలో నిర్మించిన దేవాలయాలు, గోపురాలు, కోటలు, బావులు ఆ కాలపు శిల్పకళా ప్రతిభకు నిదర్శనాలు. ఇటీవల కాకతీయుల కాలానికి చెందిన ఒకపురాతన బావి పునరుద్ధరించబడింది. ఈబావి శతాబ్దాలుగా నిర్లక్ష్యానికిగురై మట్టిలో కూరుకుపోయి, కాలగర్భంలో కనుమరుగైపోయింది. ఇప్పుడుఅది తిరిగి తన పూర్వ వైభవాన్ని సంతరించుకుంది. పురావస్తుశాఖ, స్థానిక ప్రజల సహకారంతో ఈ బావిని శుభ్రపరచి, శిల్పాలను పునరుద్ధరించారు. రాతిబండలపై చెక్కిన కళాత్మక నమూనాలు, నీటి నిల్వకు చేసిన సాంకేతిక ఏర్పాట్లు కాకతీయుల కాలపు ఇంజినీరింగ్ నైపుణ్యాన్ని స్పష్టంగా తెలియజేస్తున్నాయి. ఈ బావి కేవలం నీటి వనరుగా కాకుండా, ఆ కాలపు ప్రజల సాంస్కృతిక, సామాజిక జీవన విధానాలకు అద్దం పడుతుంది.

- తిప్పర్తి శ్రీనివాస్, చొప్పదండి

## కార్మికులకు ఉపాధి కల్పించాలి

ఉపాధి హామీలో ప్రస్తుతం తెలంగాణ పరిస్థితి పైకి బాగానే కనిపిస్తున్న లోపల పురుగులున్నవి. పనులను తగ్గించడం, అనుమతించే పనులను తగ్గించడం ఇక్కడ చూడొచ్చు. గత ఉద్యమం ఫలితంగా సాధించుకున్న తెలంగాణలో కొంత నీటి వసతి పెరిగింది కదా. మరి పల్లెర్లు మొలిసిన నెలలో పంటలు సాగు చేస్తాం అని రైతన్నలు అంటుంటే రాష్ట్రం వద్దు అంటున్నది. బీడుభూమిని సాగులోకితెద్దాం అనుకున్నరైతన్నకు నిరాశే మిగులుతుంది. ప్రభుత్వం వెంటనే భూమి చదును కార్యక్రమాలకు అనుమతి ఇవ్వాలి. కనీసం రాష్ట్రప్రభుత్వానికి కొంత చారిత్రక భౌగోళిక స్పృహ అయిన ఉండాలి కదా. సాంకేతికత పేరుతో కార్మికులను పనికి దూరం చేసే పని జరుగుతుంది.

- భారత అవినాష్, జనగామ

## బస్‌స్టాప్‌లను ఏర్పాటు చేయాలి

తెలంగాణ రాష్ట్రంలో ఉన్న ఎస్సీఎస్టీ బీసీ మైనారిటీ ప్రతి గురుకులం దగ్గర తప్పకుండా బస్‌స్టాప్‌ను ఏర్పాటు చేయాలి. తెలంగాణ రాష్ట్ర ఆర్టీసీ ఉన్నత అధికారులు బస్‌స్టాప్ ఏర్పాటు చేసినట్లయితే విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు, గురుకుల సిబ్బందికి, చుట్టుపక్కల పరిసర గ్రామాల ప్రజలకు సౌకర్యార్థంగా ఉంటుంది. బస్‌స్టాప్ షెడ్ నిర్మాణం కోసం ప్రభుత్వం నిధులను విడుదల చేయాలి. వెంటనే నిర్మాణం చేపట్టి విద్యార్థులకు ప్రయాణం సౌకర్యం కల్పించాలి.

- ఈదునూరి వెంకటేశ్వర్లు, నెక్కొండ, వరంగల్ జిల్లా

మనవి | ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# పత్తి కొనుగోళ్ల నిబంధనలు తొలగించాలి!

***గతంలో ఆంధ్రా, తెలంగాణలో ఇలాంటి కుంభకోణాలు వందలాది కోట్ల రూపాయల్లో జరిగాయి. తెలంగాణ రాష్ట్రంలో 2017-18, 2018-19 మధ్యలో పత్తి కొనుగోళ్లలో రూ.400 కోట్లు అవినీతి జరిగినట్లు సిబిఐ అధికారులు గుర్తించారు. ఇలాంటి అవినీతే ఆంధ్రప్రదేశ్లో కూడా జరిగింది. కేంద్ర, రాష్ట్రప్రభుత్వాల రైతాంగ వ్యతిరేక విధానాలను వ్యతిరేకిస్తూ, ఎటువంటి వంకలు లేకుండా రైతుల వద్ద ఉన్న మొత్తం పత్తిని మద్దతు ధరకు కొనుగోలు చేయాలని, నష్టపోయిన పత్తిధర రైతులకు ఎకరాకు 25వేలు నష్టపరిహారం ఇవ్వాలని, ఏడు క్వింటాళ్ల కొనుగోలు నిబంధన విరమించాలని, క్వింటాల్ ఉత్పత్తికి 10 వేల మద్దతుధర ప్రకటించాలని, దిగుమతి పత్తిపై 30శాతం సుంకం విధించాలని, పత్తి దిగుమతిని పరిమితం చేయాలని, పత్తిరైతులకు బ్యాంకులు ఇచ్చిన పంటరుణాలు రద్దుచేయాలని రెండు రాష్ట్రాల రైతాంగం ఉద్యమించాలి.***

బొల్లిముంతసాంబశివరావు

రెండు తెలుగు రాష్ట్రాల్లో పత్తిరైతులు తీవ్రసంక్షోభంలో ఉన్నారు. ఒకప్పుడు తెల్లబంగారంగా, రైతాంగానికి సిరులపంటగా పేరుపొందిన పత్తిసేద్యం, నేడు రైతాంగానికి ఉరితాడుగా మారుతూ ఉంది. సేద్యపు ఖర్చులు పెరగడం, ప్రకృతి వైపరీత్యాల వల్ల పంట నష్టపోవటం, గిట్టుబాటు ధర లభించకపోవటం, కేంద్ర, రాష్ట్రప్రభుత్వాల చేయూత లేకపోవటం అందుకు కారణంగా ఉంది. నేడు భారీవర్షాల వల్ల రెండు రాష్ట్రాల్లో మిగిలిన పంట అమ్ముకోవటానికి రైతాంగం తీవ్ర అవస్థలు పడుతున్నారు. భారతదేశంలో పత్తిసాగు విస్తీర్ణం 120.55 లక్షల హెక్టార్లు. ప్రపంచంలో మొత్తంసాగు విస్తీర్ణంలో ఇది సుమారు 36 శాతంగాఉంది. పత్తిసాగులో దేశం మొదటి స్థానంలో ఉంది. ప్రపంచంలోనే అతిపెద్ద ఉత్పత్తిదారుగా ఉంది. అయినా భారతదేశ అవసరాలకు సరిపోక దిగుమతులు తప్పనిసరి అయ్యాయి. అమెరికా, బ్రెజిల్, ఆస్ట్రేలియా చైనా దేశాల నుండి దిగుమతులు చేసుకుంటున్నాం. పత్తి దిగుబడుల్లోనూ భారతదేశం బాగా వెనకబడి ఉండటమే అందుకు కారణం. ప్రపంచ విత్తన పత్తి సగటు దిగుబడి హెక్టార్కు 1,670 కిలోలు. భారతదేశంలో సగటు దిగుబడి హెక్టార్కు 500 కిలోలు. చైనాలోప్రపంచ సగటు దిగుబడికన్నా రెట్టింపు ఎక్కువ. పత్తికి కేంద్రప్రభుత్వం ప్రకటించే మద్దతు ధర ఎప్పుడూ రైతుల ప్రయోజనాలకు అనుగుణంగా లేదు. అది రైతు ప్రయోజనాలను కాకుండా బడాపారిశ్రామికవేత్తల ప్రయోజనాలకు అనుకూలంగా ఉంటుందన్నది వాస్తవం. ప్రస్తుతం పత్తిమద్దతు ధర క్వింటాలుకు 8,110గా ఉంది. స్వామినాథన్ సిఫార్సుల ప్రకారం10,075 రూపాయలు ఉండాలి. స్వామినాథన్ సిఫార్సులకు అనుగుణంగా మద్దతు ధరలు ప్రకటిస్తున్నామని కేంద్రప్రభుత్వం చెప్పటంలో ఉన్న మోసం పత్తి మద్దతు ధర ప్రకటన బట్టబయలు చేస్తున్నది. భారతదేశం ప్రతిసంవత్సరం లక్షల బేళ్ల పత్తిని దిగుమతి చేసుకుంటున్నది. ఈ సంవత్సరం మూడు లక్షలబేళ్ల పత్తి దిగుమతి అయ్యింది. ట్రంప్, పశ్చిమదేశాల వత్తిడికిలొంగిన కేంద్ర ప్రభుత్వం పత్తిదిగుమతులపై పూర్తిగా సుంకాన్ని ఎత్తివేసింది. ఫలితంగా విదేశాల నుండి పెద్దఎత్తున పత్తి దిగుమతులు పెరిగాయి. దిగుమతుల వల్ల దేశంలో పత్తి రేట్లు తగ్గుతాయి. ప్రపంచ మార్కెట్లో ప్రస్తుతం క్వింటాల్ గింజ పత్తి ధర 5,720 రూపాయలు. భారతదేశం దిగుమతి సుంకం విధిస్తే దేశంలో దిగుమతి పత్తి ధర ఇంకా ఎక్కువ ఉండేది. అలా చేయకపోవడంతో దిగుమతి పత్తి ధర తక్కువగా ఉండటంతో టెక్స్‌టైల్ మిల్లుల యజమానులు విదేశాల పత్తినే కొనుగోలు చేస్తున్నారు. దీన్ని గమనిస్తే కేంద్ర ప్రభుత్వానికి దేశ రైతుల ప్రయోజనాల కన్నా విదేశీ పత్తికంపెనీల ప్రయోజనమే ముఖ్యమని చెప్పకనే చెబుతున్నది. పత్తి దిగుమతుల వల్ల భారతపత్తి రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. తెలంగాణ రాష్ట్రంలో 45.32 లక్షల ఎకరాల్లో 24.12 లక్షల మంది రైతులు పత్తిసాగు చేస్తున్నారు. వీరిలో 70శాతం మంది చిన్న,సన్నకారు రైతులే. పత్తి మద్దతు ధరను క్వింటాల్‌కు 7720 నుంచి 8110 రూపాయలుగా కేంద్రం ప్రకటించింది. ప్రతి సంవత్సరం కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా మద్దతు ధర ఇచ్చి కొనుగోళ్లు చేస్తానని ప్రకటిస్తూ ఉంది. ఈ సంవత్సరం తెలంగాణ రాష్ట్రంలో మూడువారాలు ఆలస్యంగా కొనుగోలు కేంద్రాలను సీసీఐ ఏర్పాటు చేసింది. ఎకరాకు 11.74 క్వింటాళ్ల పత్తిదిగుబడి వస్తుందనే వ్యవసాయశాఖ ఇచ్చిన నివేదిక ప్రకారం, ఎకరాకు 12క్వింటాళ్ల పత్తి కొను



గోళ్లు ప్రారంభించింది. అకస్మాత్తుగా ఎకరాకు 7 క్వింటాళ్లు మాత్రమే కొనుగోళ్లు చేయాలని రాష్ట్ర అధికారులకు సీసీఐ సమాచారం ఇచ్చింది. సీసీఐ నిర్ణయంవల్ల రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. ఆంధ్రప్రదేశ్లో 4.56 లక్షల ఎకరాల్లో పత్తిసాగు జరిగినట్లు వ్యవసాయశాఖ అధికారులు అంచనా వేశారు. సుమారు 8 లక్షల టన్నుల దిగుబడి వస్తుందని భావించారు. భారీవర్షాల వల్ల దిగుబడి భారీగా తగ్గింది. రాష్ట్రంలో పత్తి కొనుగోళ్లకు 30కేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్లు సీసీఐ తెలిపింది. పత్తివిక్రయానికి ముందుగా రైతుసేవా కేంద్రాల్లో పేరు నమోదు చేసుకోవాలి. సిఎంయాప్ ద్వారా రైతు వివరాలు నమోదు చేయాలి. ఆ తర్వాత కపాస్ కిసాన్‌లో స్లాట్ బుక్ చేసుకోవాలి. ఈ రాష్ట్రంలో కూడా ఎకరాకు7 క్వింటాళ్లకే కొనుగోలు పరిమితం చేసింది. కొంతమంది రైతులకు ఎకరాకు12 క్వింటాళ్లకు పైగా పత్తి దిగుబడి వస్తున్నది. సీసీఐ నిర్ణయం రైతులను వ్యాపారుల దోపిడీకి గురిచేస్తుంది. భారీవర్షాలు, తుఫాన్ల వల్ల దిగుబడి ఏడు క్వింటాళ్లకు తగ్గిందని, అందుకు అనుగుణంగానే కొనుగోలు ఎకరాకు ఏడు క్వింటాళ్లకు తగ్గించడం జరిగిందని తన నిర్ణయాన్ని సీసీఐ సమర్థించుకుంది. ఈ సమర్థనలో వాస్తవం లేదు. ఎందుకంటే విదేశాల నుంచి పెద్ద ఎత్తున పత్తి దిగుమతి కావడం అందుకు కారణం కాబట్టి. పత్తి కొనుగోళ్లకు కూడా సీసీఐ అనేక నిబంధనలు పెట్టింది. తేమ శాతం 12 మించగూడదని, రంగుమారిన పత్తిని కొనుగోలు చేయమని, 12శాతం తేమకంటే ఎక్కువ తేమ ఉంటే ఆ మేరకు ధర తగ్గిస్తామని పేర్కొంది. భారీ వర్షాలకు తెలంగాణలో పత్తి తడిచిపోయి తేమశాతం ఎక్కువగా ఉంది. రైతుల ప్రయోజనం కోరే ఏ ప్రభుత్వమైనా తుఫాన్ సందర్భంగా తడిచిన పంటలను మద్దతు ధర ఇచ్చి కొనుగోలు చేయాలి. కేంద్ర ప్రభుత్వం అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తుంది అనటానికి సీసీఐ పత్తికొనుగోలుకు విధించిన నిబంధనలే చాలు. అసలే సంక్షోభంలో ఉన్న పత్తి రైతులు సీసీఐ నిబంధనలతో మరింత నష్టపోయి వారి సంక్షోభం తీవ్రమోతుంది. రైతు సీసీఐ కేంద్రాల్లో పత్తి అమ్ముకోవాలంటే కేంద్రప్రభుత్వం కొత్తగా ప్రవేశపెట్టిన కపాస్ కిసాన్ యాప్‌లో ముందుగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. ఆయా యాప్‌లో సాల్ట్ బుక్‌చేసుకుంటేనే సీసీఐ అధికారులు రైతులనుండి పత్తికొనుగోలు చేస్తారు. అలా చేసుకోవాలని చాలా మంది రైతులకు తెలియదు. అలా చేసుకోలేని రైతులు సీసీఐ కేంద్రాల్లో అమ్ముకోలేక ప్రైవేట్ వ్యాపారులకే అమ్ముతున్నారు. కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా నామమాత్రపు పత్తికొనుగోళ్లకే పరిమితం చేస్తూ వస్తున్నది. ఇప్పుడు కూడా ఆ బాటలోనే నడుస్తున్నది. మద్దతుధర ఇవ్వటానికి అనేక వంకలు పెట్టి నిరాకరిస్తున్నది. నేడు రెండు రాష్ట్రాల్లో తేమ, రంగు మార్పు పేరుతో మద్దతు ధరలో తగ్గించి ఇస్తున్నది. ఫలితంగా క్వింటాల్‌కు6,500లోపే రైతుకు దక్కుతున్నది. సీసీఐ పెట్టిన నిబంధనలు, మద్దతుధరలో తగ్గింపువల్ల విసిగిపోయిన రైతాంగం ప్రైవేట్ వ్యాపారులకు విక్రయిస్తున్నారు. పత్తి కొనుగోలులో సీసీఐ విఫలమైనప్పుడు మద్దతు ధరకు రైతుల నుండి పత్తి కొనుగోళ్లు రాష్ట్రప్రభుత్వాలు చేపట్టాలి. రెండు తెలుగురాష్ట్ర ప్రభుత్వాలు అలాంటి బాధ్యత తీసుకోలేదు. వ్యాపారులు, సీసీఐ అధికారులు కుమ్మక్కై పత్తి కొనుగోళ్లలో అక్రమాలకు దారితీసింది. రైతుల నుంచి సీసీఐ కొనటానికి నిరాకరించిన పత్తిని వ్యాపారులు రైతుల నుండి చౌకగా కొనుగోలుచేశారు. అలాకొన్న పత్తిని అధికారులు, వ్యాపారులు కుమ్మక్కై రైతుల పేరుతో పత్తి పండించినట్లు నకిలీపత్రాలు సృష్టించి తిరిగి సీసీఐకే మద్దతుధరకు అమ్ముతున్నారు. గతంలో ఆంధ్రా, తెలంగాణలో ఇలాంటి కుంభకోణాలు వందలాది కోట్ల రూపాయల్లో జరిగాయి. తెలంగాణ రాష్ట్రంలో 2017-18, 2018-19 మధ్యలో పత్తి కొనుగోళ్లలో రూ.400 కోట్లు అవినీతి జరిగినట్లు సిబిఐ అధికారులు గుర్తించారు. ఇలాంటి అవినీతే ఆంధ్రప్రదేశ్లో కూడా జరిగింది. కేంద్ర, రాష్ట్రప్రభుత్వాల రైతాంగ వ్యతిరేక విధానాలను వ్యతిరేకిస్తూ, ఎటువంటి వంకలు లేకుండా రైతుల వద్ద ఉన్న మొత్తం పత్తిని మద్దతు ధరకు కొనుగోలు చేయాలని, నష్టపోయిన పత్తిధర రైతులకు ఎకరాకు 25వేలు నష్టపరిహారం ఇవ్వాలని, ఏడుక్వింటాళ్ల కొనుగోలు నిబంధన విరమించాలని, క్వింటాల్ ఉత్పత్తికి 10 వేల మద్దతుధర ప్రకటించాలని, దిగుమతి పత్తిపై 30శాతం సుంకం విధించాలని, పత్తి దిగుమతిని పరిమితం చేయాలని, పత్తిరైతులకు బ్యాంకులు ఇచ్చిన పంటరుణాలు రద్దుచేయాలని రెండు రాష్ట్రాల రైతాంగం ఉద్యమించాలి. ●

# సామాజిక మాధ్యమాలకు బానిసలవుతున్న యువత


కామిడి సతీష్ రెడ్డి

నేడు యువత సామాజిక మాధ్యమాల బారిన పడి విలువైన భవిష్యత్‌ని సర్వనాశనం చేసుకుంటూ వున్నారు. కొంత మందికి క్రికెట్ అంటే పిచ్చి. స్నేహితులతోకలిసి ఐపీఎల్‌లో ప్రతి క్రికెట్ మ్యాచ్ తిలకించిన తర్వాతసెల్‌ఫోన్లో ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్‌లోకి ప్రవేశించి పందేలు కట్టడం వంటి ఆరోపణలు వినవస్తూ వున్నాయి. ఆరంభంలో నగదు రావడంతో మరింత ఉత్సాహం చూపిస్తారు. తరువాత పందేల్లో రూ.వేల నగదు పోగొట్టుకున్న సందర్భాలున్నాయి. తొలుత బంధువులు, తెలిసినవారి వద్ద అప్పులు చేయడం, నగదుకోసం ప్రైవేటు వ్యాపారుల వద్ద అధిక వడ్డీకి రుణాలు తీసుకున్న తర్వాత బకాయిలు పెరిగిపోవడంతో చోరీలకు దిగి పోలీసులకు చిక్కిపోతూ వున్నారు. అరచేతిలో ఇమిడే సెల్‌ఫోన్‌తో సమస్త ప్రపంచాన్ని వీక్షించే అవకాశంవచ్చింది. తాము చదివే కోర్సులకు సంబంధించి సమాచారాన్ని సేకరించి, జ్ఞానాన్ని విస్తృతం చేసుకుంటున్నారు. కొందరు మాత్రం సామాజిక మాధ్యమాలు, క్రికెట్ బెట్టింగ్‌లు, ఓటీటీల్లో సినిమాల వీక్షణతో కాలక్షేపంచేస్తూ జీవితాన్ని బలిచేసుకుంటున్నారు. డిగ్రీ, ఇంజినీరింగ్ విద్యార్థులు సెల్‌ఫోన్‌లను ఎక్కువగా వాడతారు. తల్లిదండ్రులు కొనిస్తే అప్పటి నుంచి వానిని రోజూ రాత్రి ఫోన్లో ఓటీటీ ప్లాట్‌ఫాం, యాప్‌లలో వీడియోలు చూడటం, నిద్రపోకుండా తెల్లవారుజామున రెండు, మూడు గంటల వరకు సెల్‌ఫోన్ చూస్తూ గడిపేస్తున్నారు. రాత్రి నిద్రపోకపోవడం వల్ల ఉదయం తరగతి గదిలో మత్తుగా ఉండి అధ్యాపకులు చెప్పే పాఠాలు వారికి అర్థం కావడం లేదు. ఏకాగ్రత దెబ్బతిని చదువుపై దృష్టి కేంద్రీకరించలేకపోతున్నారు. అనారోగ్య సమస్యలు తలెత్తుతాయి. కరోనా లాక్‌డౌన్ కారణంగా ఇంట్లోనే ఉండాల్సి రావడం, ఖాళీసమయం ఎక్కువగా లభించడంతో యువత ఓటీటీలు, యాప్‌లు చూడటానికి అలవాటుపడ్డారు. ఓటీటీలో కొత్త సినిమాలు, వెబ్ సిరీస్‌ల్లో అశ్లీల సన్నివేశాలు, సంభాషణలు నేరుగా ప్రసారమవుతున్నాయి. ప్రస్తుతం ఎలాంటి సెన్సార్‌షిఫ్ లేకపోవడంతో వీటిని చూసి పిల్లలు, యువత పాడైపోతున్నారని సామాజికవేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. హింసాత్మక, లైంగిక కార్యకలాపాల దృశ్యాలు నేరుగా ప్రసారం అవుతుండటంతో యువత తీవ్రంగా ప్రభావితమై చెడిపోతున్నారు. విద్యార్థులు ఏకాగ్రత దెబ్బతిని సరిగా చదువుపై దృష్టిసారించలేకపోతున్నారు. తలనొప్పి, కంటిచూపు ఇతర అనారోగ్య సమస్యలు చుట్టుముడుతున్నాయి. యాంత్రిక జీవనంలో సంస్కృతి, సంప్రదాయాలు మరిచిపోతున్నారు. నైతికవిలువలు, ప్రమాణాలు దిగజారిపోయి అడ్డదారులు తొక్కుతున్నారు. గంజాయి, మత్తు పదార్థాలు, మద్యం అక్రమ రవాణా చేస్తూ పోలీసులకు చిక్కుతున్నారు. జల్సాలకు అలవాటు పడి ఈ దందాలోకి దిగినట్లు పోలీసుల విచారణలో తేలుతుంది. ఎనిమిది నుంచి పది గంటలు స్మార్ట్‌ఫోన్లు, ల్యాప్‌టాప్‌లు, ట్యాబ్‌లలో సినిమాలు, వీడియోలు చూడటం వల్ల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం పడుతోంది. పిల్లలు, యువతలో అనారోగ్య సమస్యలు తలెత్తుతున్నాయి. తలనొప్పి, కంటిచూపు సమస్యలు వస్తున్నాయి. మానసిక కుంగుబాటుకు లోనవుతున్నారు. మత్తుపదార్థాల సేవనానికి అలవాటుపడి బానిసలై నగదు కోసం నేరాలకు దిగడంచాలా ఆందోళనకరం. ఆన్‌లైన్ బెట్టింగ్‌లు వచ్చిన తర్వాత పోలీసులు నిఘాపెట్టి పట్టుకోవడం కష్టసాధ్యంగా మారింది. ఐపీఎల్ సమయంలో పెద్దఎత్తున బెట్టింగ్‌లలో యువత భారీఎత్తున నగదు పోగొట్టుకున్నారు. రూ.లక్షల అప్పు చేసి తీర్చలేక బలవన్మరణాలకు పాల్పడుతూ తల్లిదండ్రులకు పుత్రశోకాన్ని మిగుల్చుతున్నారు. సెల్‌ఫోన్‌ను సద్వినియోగం చేసుకుంటే ఎన్నో కొత్త విషయాలు తెలుసుకోవచ్చు. విద్యార్థులు, యువత పలురకాల ఆటలు ఆడేలా తల్లిదండ్రులు ప్రోత్సహించాలని నిపుణులు సూచిస్తున్నారు. వారికి ఇష్టమైన కళలో శిక్షణ ఇప్పిస్తే రాణిస్తారు. యోగ, ధ్యానం సాధన చేయించడం ద్వారా ఏకాగ్రత సాధిస్తారు. పిల్లల నడవడికపై ప్రత్యేక దృష్టి పెట్టి దారితప్పక ముందే వారు సన్మార్గంలో నడిచేలా చూడాలి. తల్లిదండ్రులు ఎంత తీరిక లేకుండా ఉన్నా పిల్లలకు మాత్రం తగిన సమయం కేటాయించాలి. వారితో ప్రేమగా మాట్లాడి ఇష్టాయిష్టాలు తెలుసుకోవాలి. మంచి, చెడు గురించి వివరంగా చెప్పాలి. సానుకూల దృక్పథంలో ఆలోచించేలా వుండాలి. ●

# విద్యా హక్కు పరిరక్షణ అందరి బాధ్యత

రామ కిష్టయ్య సంగన భట్ల

ప్రతి సంవత్సరం నవంబర్ 11న దేశవ్యాప్తంగాజాతీయ విద్యా దినోత్సవాన్ని జరుపుకుంటున్నాం. దీన్నే రాష్ట్రీయ శిక్షా దివస్ అని కూడా పిలుస్తారు. దేశంలో విద్యాభివృద్ధికి విశేష కృషి చేసిన మోలానా అబుల్ కలాం ఆజాద్ పుట్టినరోజును జాతీయ విద్యా దినోత్సవంగా పాటిస్తున్నారు. స్వాతంత్ర్యం వచ్చాక మన దేశానికి మొదటి విద్యాశాఖ మంత్రిగా ఆజాద్ పనిచేశారు. 1947 నుంచి 1958 వరకు తన బాధ్యతల్ని సమర్థంగా నిర్వహించారు. భారతదేశానికి మొదటి ఉప రాష్ట్రపతిగా కూడా ఆయన సేవలందించారు. జాతీయ విద్యా దినోత్సవాన్ని2008నుంచి కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తోంది. మోలానా అబుల్ కలాం ఆజాద్ పుట్టినరోజు సందర్భంగా విద్యా హక్కు పరిరక్షణ గురించి ఆలోచించాల్సిన అవసరం అనివార్యంగా ఉంది. విద్యను ప్రాథమిక హక్కుగా చేశారు. విద్యాహక్కు చట్టం హామీ ఇచ్చిన విధంగా వీరందరికీ వాళ్ల వయసుకు తగిన తరగతిలో చేర్పించి విద్యనందించడమూ ఒక సవాలే. యునిసెఫ్ ప్రకారం దాదాపు సగం మంది ప్రణాళికా సంఘం అంచనా ప్రకారం సుమారు 43 శాతం మంది బాలబాలికలు ఎనిమిదో తరగతిలోపే బడిమాని వేస్తున్నారు. షెడ్యూల్డ్ కులాల్లో ఇది 55 శాతం షెడ్యూల్డ్ తెగల్లో 63శాతం దాకా ఉందని అంచనా. విద్యను పొందడం మాత్రమే హక్కు కాదు, సరైన ఉపాధ్యాయుడి వద్ద విద్యను అభ్యసించడం కూడా హక్కే. కాలం ఎంతగా మారినా మన సమాజం ఉత్తమ ఉపాధ్యాయులను అధికంగా తయారు చేయలేకపోతుందనేది సత్యం. సాధారణ ఉపాధ్యాయుడు పాఠాల్ని బోధిస్తాడు. మంచి ఉపాధ్యాయుడు వాటిని వివరిస్తాడు. ఉత్తమ ఉపాధ్యాయుడు విశదీకరిస్తాడు. గొప్ప ఉపాధ్యాయుడు స్ఫూర్తిని అందిస్తాడు. గురువుల బోధనతోనే విద్యార్థులు ప్రపంచాన్ని తెలుసుకుంటారు. ఉన్నత వ్యక్తులుగా ఎదుగుతారు. ప్రపంచంలో సుమారు 80 కోట్ల మంది నిరక్షరాస్యులు ఉండగా అందులో 23.8 కోట్ల మంది మనదేశంలోనే ఉన్నట్లు వెల్లడైంది. నాణ్యమైన విద్యనందించడం ద్వారా ప్రతి ఒక్కరూ అవసరమైన స్థాయిలో చదువు నేర్చుకుని, తర్వాతి తరగతిలోకి ప్రవేశించగలిగేలా చేయాల్సిన బాధ్యత పాఠశాలపై ఉంటుందనీ చట్టం పేర్కొంటోంది. న్యూటన్, పైథాగరస్, సర్వేపల్లి రాధాకృష్ణన్ మొదలైన వారు ఆదర్శంగా నిలిచారు. విశ్వామిత్రుడు, సాందీపుడు, పరశురాముడు, ఆదిశంకరా చార్యులు, ద్రోణాచార్యులు, పరమహంస మొదలైన వారంతా పేరొందిన గురువులు. విద్య అనే ఆస్తిని సమానంగా పంచగల శక్తి ఒక ఉపాధ్యాయుడికే ఉంది. ప్రజాదరణ, అపారమైన గౌరవం ఉన్న కారణంగానే ఎంతోమంది ఉపాధ్యాయులు




నాయకులయ్యారు. వీరిలో ముఖ్యంగా చెప్పుకోవాల్సిన వారు డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్. ఒక అధ్యాపకుడు భారత దేశానికి రాష్ట్రపతిగా పనిచేసిన ఘనత ఆయనకే చెల్లింది. ఆయన పుట్టిన రోజును మనదేశంలో ఉపాధ్యాయ దినోత్సవంగా జరుపుకుంటాము. ప్రఖ్యాత శాస్త్రవేత్త అబ్దుల్ కలాం రాష్టపతిగా పదవీకాలం ముగియగానే చెన్నైలోని అన్నా విశ్వ విద్యాలయంలో అధ్యాపకుడిగా చేరారు. బోధన చేస్తూనే ఆయన తుదిశ్వాస విడిచారు. యావత్ ప్రపంచానికి ఆయన గొప్ప సందేశాన్ని అందించారు. నీతివంతమైన జీవనానికి అలవాటుపడే విద్యార్థులను ఉపాధ్యాయులుతీర్చిదిద్దగలగాలి. సమాజాలు మారొచ్చు, సిద్ధాంతాలుమారొచ్చు. కానీ విద్యార్థి, ఉపాధ్యాయుల మధ్య సంబంధం శాశ్వతమైనది. ఈ విషయాన్ని యువ ఉపాధ్యాయులు గుర్తుంచుకోవాలి. విద్యార్థుల భవిష్యత్‌పైనే దేశ భవిష్యత్తు ఆధారపడి ఉంటుంది. సమాచారం అందివ్వడంతోనే ఉపాధ్యాయుడి పాత్ర ముగియదని నిజానికి ఉపాధ్యాయుడు రకరకాల నైపుణ్యాల్ని విద్యార్థులకు అందించవలసి ఉంటుందని కొఠారి కమిషన్ పేర్కొంది. జాతి నిర్మాణంలో తల్లిదండ్రుల తర్వాత కీలకపాత్ర పోషించేది గురువే అవుతాడు. అనేక మంది గురువులు విద్యార్థుల మదిలో ప్రముఖ స్థానాన్ని ఏర్పరుచుకున్నారు. మాతృదేవోభవ పితృదేవోభవ ఆచార్య దేవోభవ అన్నారు పెద్దలు. తల్లిదండ్రుల తరువాతి స్థానం గురువుదే అని స్పష్టం చేశారు. ఉపాధ్యాయ వృత్తిలో అడుగు పెట్టేవారు తమ వృత్తిని ప్రేమించే లక్షణం కలిగి ఉండాలి. తాము భావిపౌరులను తీర్చిదిద్దుతున్నామనే భావనఉండాలి. విద్యార్థి ఎగిరే గాలిపటం అయితే దానికి ఆధారమైన దారంగురువు. ఉపాధ్యాయులు తమ మేధోసంపత్తిని పెంపొందించుకోవాలి. తమ జీవిత కాలంలో కనీసం నాలుగు తరాల భవిష్యత్తు ఆధారపడి ఉంటుందనే విషయాన్ని గమనించాలి. వృత్తి నైపుణ్యాల పెంపు, కంప్యూటర్ వినియోగం, డిజిటల్ లిటరసీ కార్యక్రమాలను నిర్వహించాలి. బాలబాలికల్లో విద్యా ప్రమాణాలు మెరుగుపరిచేందుకు కృషిచేయాలి. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ మార్చలేని గతాన్ని గురించి ఆలోచించవద్దు.. చేతిలోఉన్న భవిష్యత్తు కోసం శ్రమించు అనేవారు. ఉపాధ్యాయ లోకం కానీ రిమోట్ లెర్నింగ్ అందించడానికి, వెనకబడుతున్న విద్యార్థులకు మద్దతు ఇవ్వడానికి, అభ్యాస అంతరాలను తగ్గించేలా ఉపాధ్యాయుల కృషి పరంగా ఇది చాలా కీలక సమయం. విద్య భవిష్యత్తును, బోధనావృత్తిని రూపొందించడంలో ఉపాధ్యాయుల పాత్ర చాలా ముఖ్యం. ఉపాధ్యాయుడు తన బోధనా పద్ధతుల్ని పునః సమీక్షించుకొని తదనుగుణంగా విద్యార్థులను నవ సమాజానికి అందించాలి. ఒకప్పుడు గుమాస్తాలను తయారుచేసే విధంగా విద్యా లక్ష్యం వుండేది. నేడు సామాజిక ప్రాధాన్యతలు మారిపోయాయి. దేశానికి పరిశోధకులు కావాలి. వ్యక్తుల స్వభావాన్ని, సామర్థ్యాన్ని, వారి భవిష్యత్తును తీర్చిదిద్దే పవిత్రమైన వృత్తి ఉపాధ్యాయ వృత్తి అని ప్రవచించిన అబ్దుల్ కలాం పలుకులకు సార్థకత చేకూర్చాలి. నేటి యువ ఉపాధ్యాయులు అందుకు కంకణ బద్ధులై వృత్తిని నిబద్ధతతో నిర్వర్తించాలి. ●

## భారత్ సరిహద్దుల చుట్టూ
# పాక్ ఉగ్ర కేంద్రాలు!



**న్యూఢిల్లీ, నవంబరు 10:** భారత్ చుట్టూ ఉగ్రవాదాన్ని విస్తరించేందుకు పాకిస్థాన్ కుట్రలు పన్నుతుందని భారత నిఘా వర్గాలు గుర్తించాయి. భారత సరిహద్దు దేశాలైన నేపాల్, బంగ్లాదేశ్‌లోని కొన్ని ప్రాంతాల్లో ఉగ్ర నివాసాలు, శిక్షణ కేంద్రాలను సిద్ధం చేస్తున్నట్లు సమాచారం. బంగ్లాదేశ్, నేపాల్ సరిహద్దులకు కొన్ని కిలోమీటర్ల దూరంలో ఉగ్ర స్థావరాల ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్నట్లు భారత ఇంటెలిజెన్స్‌ను ఉటంకిస్తూ ఆంగ్ల మాధ్యమ వార్తా సంస్థలు పేర్కొన్నాయి. ఆపరేషన్ సిందూర్ తర్వాత ఈ కార్యకలాపాలు మరింత వేగవంతమైనట్లు తెలుస్తోంది. ఉగ్రవాద శిక్షణ పొందే వారి కోసం బంగ్లాదేశ్, నేపాల్‌లోని పలు ప్రాంతాల్లో కొత్త శిక్షణ శిబిరాలు, నివాస సముదాయాలు ఏర్పాటు చేస్తున్నట్లు నిఘా వర్గాలు పేర్కొన్నాయి. సరిహద్దులోని రాష్ట్రాల్లో ఇటీవల ఉగ్రవాద సంస్థలకు చెందిన వారిని అరెస్టు చేయగా, వారి విచారణలో సంచలన విషయాలు వెలుగులోకి వచ్చాయి. సరిహద్దు ప్రాంతాల్లో భద్రతను పెంచినట్లు నిఘా వర్గాలు తెలిపాయి. పొరుగు దేశాల్లో విదేశీ నిధులతో ఏర్పాటవుతున్న పలు ప్రాజెక్టులపై కూడా నిఘా ఉంచినట్లు పేర్కొన్నాయి. లష్కరే తోయిబా, జైష్ ఏ మహమ్మద్ వంటి ఉగ్రవాద సంస్థలు నేపాల్‌లో తమ సంస్థలను విస్తరించడానికి చర్యలు తీసుకుంటున్నట్లు నిఘా వర్గాలు వెల్లడించాయి. ఆల్‌ఖైదా, ఐసిస్ గత ఐదు నెలలుగా బంగ్లాదేశ్‌లో తమ కార్యకలాపాలను విస్తరించడానికి ప్రయత్నాలు ముమ్మరం చేశాయని తెలిపాయి. ఇందులో భాగంగా పాక్‌లోని పలు ప్రాంతాల నుంచి బంగ్లాదేశ్‌కు, నేపాల్‌కు నిరంతర వలసలు కొనసాగుతున్నట్లు పేర్కొన్నాయి. ఆయా దేశాల్లో ఉగ్రవాద శిబిరాల నిర్మాణాలకు, నిర్వహణకు అవసరమైన నిధులను తుర్కియే సమకూరుస్తున్నట్లు సమాచారం. ఢాకాలోని జమాత్‌ఈఇస్లామీ కార్యాలయం పునరుద్ధరణకు టర్కీ నిఘా సంస్థ నిధులు సమకూర్చినట్లు కూడా ఈ నిఘా వర్గాలు వెల్లడించాయి.

## కోల్‌కతాలో స్పైస్‌జెట్ అత్యవసర ల్యాండింగ్

**కోల్‌కత్తా, నవంబరు 10:** ముంబై నుంచి కోల్‌కతా వెళ్తున్న స్పైస్‌జెట్ విమానానికి త్రుటిలో ప్రమాదంతప్పింది. విమానం గాల్లో ఉండగా ఇంజిన్‌లో సాంకేతిక సమస్య తలెత్తడంతో కోల్‌కతా విమానాశ్రయంలో అత్యవసరంగా ల్యాండింగ్ చేశారు. ఈ ఘటనలో ప్రయాణికులు, సిబ్బంది అంతా సురక్షితంగా బయటపడటంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. స్పైస్‌జెట్‌కు చెందిన ఎస్‌జీ 670 విమానం ఆదివారం రాత్రి ముంబై నుంచి కోల్‌కతాకు బయలుదేరింది. కోల్‌కతాలోని నేతాజీ సుభాష్ చంద్రబోస్ అంతర్జాతీయ విమానాశ్రయంలో ల్యాండింగ్ కోసం కిందకు దిగుతున్న సమయంలో, విమానంలోని ఒక ఇంజిన్ విఫలమైనట్లు పైలట్లు గుర్తించారు. వెంటనే వారు అప్రమత్తమై ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్ (ఏటీసీ)కు సమాచారం అందించారు. పైలట్ల నుంచి సమాచారం అందగానే విమానాశ్రయ అధికారులు వెంటనే ఫుల్ ఎమర్జెన్సీ ప్రకటించారు. అగ్నిమాపక, సహాయక బృందాలను రన్‌వే వద్ద సిద్ధంగా ఉంచారు. రాత్రి 11:38 గంటలకు విమానం సురక్షితంగా ల్యాండ్ అయిన తర్వాత ఫుల్ ఎమర్జెన్సీని ఉపసంహరించుకున్నట్లు ఓ అధికారి తెలిపారు. ప్రయాణికులందరినీ సురక్షితంగా విమానం నుంచి కిందకు దించారు. ఈ ఘటనపై స్పైస్‌జెట్ సంస్థ ఈ ఉదయం ఒక ప్రకటన విడుదల చేసింది. కోల్‌కతాలో ల్యాండింగ్ సమయంలో తమ విమానంలో సాంకేతిక సమస్య తలెత్తిన మాట వాస్తవమేనని, అయితే విమానం సురక్షితంగా ల్యాండ్ అయిందని తెలిపింది. "ప్రయాణికులు, సిబ్బంది అందరూ సాధారణంగానే విమానం నుంచి కిందకు దిగారు" అని స్పైస్‌జెట్ ప్రతినిధి వివరించారు. ప్రస్తుతం విమానాన్ని ఇంజినీరింగ్ బృందాలు క్షుణ్ణంగా పరీక్షిస్తున్నాయని సంస్థ పేర్కొంది.



## కెంపెగౌడ ఎయిర్‌పోర్టులో
# ముస్లింల నమాజ్
### తీవ్ర అభ్యంతరం వ్యక్తంచేసిన బిజెపి

**బెంగళూరు, నవంబరు 10:** కర్ణాటకలో మరో కొత్త వివాదం రాజుకుంది. బెంగళూరులోని కెంపెగౌడ అంతర్జాతీయ విమానాశ్రయ ప్రాంగణంలో కొందరు నమాజ్ చేయడంపై భారతీయ జనతా పార్టీ (బీజేపీ) తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. అత్యంత కట్టుదిట్టమైన భద్రత ఉండే హై సెక్యూరిటీ జోన్‌లో ఇలాంటి వాటికి ఎలా అనుమతి ఇచ్చారని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిలదీసింది. ఈ ఘటనపై ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, ఐటీ శాఖ మంత్రి ప్రియాంక్ ఖర్గే స్పష్టతనివ్వాలని డిమాండ్ చేసింది. ఈ ఘటన కెంపెగౌడ విమానాశ్రయంలోని టెర్మినల్ 2లో జరిగినట్లు బీజేపీ అధికార ప్రతినిధి విజయ్ ప్రసాద్ తెలిపారు. దీనికి సంబంధించిన ఫోటో, వీడియోను ఆదివారం రాత్రి ఆయన సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. "హై సెక్యూరిటీ జోన్‌లో నమాజ్ చేయడానికి వీరు ముందస్తు అనుమతి పొందారా ఇది అత్యంత సున్నితమైన ప్రాంతంలో తీవ్రమైన భద్రతా సమస్య కాదా అని ఆయన ప్రశ్నించారు. ఆర్ఎస్ఎస్ నిబంధనల ప్రకారం అనుమతి తీసుకుని పథ సంచలన్ నిర్వహిస్తే అభ్యంతరం చెప్పే ప్రభుత్వం, ఇలాంటి కార్యకలాపాలను ఎందుకు చూసీచూడనట్లు వదిలేస్తోందని ఆయన విమర్శించారు. టెర్మినల్ 2లో భారీ భద్రత ఉంటుంది. కానీ పోలీసులు గానీ, ఇతర సిబ్బంది గానీ వారిని ఆపడానికి ప్రయత్నించలేదు. ఇది ఒక వర్గాన్ని సంతృప్తిపరిచే కాంగ్రెస్ ప్రభుత్వ తీరును స్పష్టం చేస్తోంది. ఈ చర్యను సీఎం, ఐటీ మంత్రి సమర్థిస్తారా అని విజయ్ ప్రసాద్ ప్రశ్నించారు. ఇదిలా ఉండగా, బహిరంగ ప్రదేశాల్లో కార్యక్రమాలు నిర్వహించడానికి ప్రైవేటు సంస్థలు అనుమతి తీసుకోవాలన్న ప్రభుత్వ ఆదేశం కేవలం ఆర్ఎస్ఎస్‌ను లక్ష్యంగా చేసుకున్నది కాదని ముఖ్యమంత్రి సిద్ధరామయ్య ఇటీవల స్పష్టం చేశారు. ఆ ఉత్తర్వుల్లో మేము ఎక్కడా ఆర్ఎస్ఎస్ పేరును ప్రత్యేకంగా ప్రస్తావించలేదు. ఏ సంస్థ అయినా కార్యక్రమం నిర్వహించాలంటే జిల్లా అధికారుల నుంచి అనుమతి తీసుకోవాలి. దాన్ని వారు ఆర్ఎస్ఎస్ గురించి అనుకుంటే మేమేం చేయగలమనివ్యాఖ్యానించారు.

## సుంకాల రాబడుల్లో ప్రతి అమెరికన్‌కు 2 వేల డాలర్లు
### అమెరికన్లకు ట్రంప్ తీపి కబురు

**వాషింగ్టన్, నవంబరు 10:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తన దూకుడైన టారిఫ్ విధానాన్ని సమర్థించుకుంటూ సంచలన ప్రకటన చేశారు. తన ప్రభుత్వం టారిఫ్ పన్నుల ద్వారా వసూలు చేస్తున్న ఆదాయం నుంచి త్వరలోనే ప్రతి అమెరికన్‌కు కనీసం 2వేల డాలర్ల చొప్పున పంపిణీ చేస్తామని హామీ ఇచ్చారు. అయితే, అధిక ఆదాయం ఉన్న సంపన్నులకు ఈ పథకం వర్తించదని ఆయన స్పష్టం చేశారు. తన సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ ట్రూత్ సోషల్ వేదికగా ఈ ప్రకటన చేశారు. తన టారిఫ్ విధానాన్ని విమర్శిస్తున్న వారిపై ఆయన తీవ్రస్థాయిలో మండిపడ్డారు. టారిఫ్‌లను వ్యతిరేకించేవాళ్లు మూర్ఖులని ఘాటుగా వ్యాఖ్యానించారు. తన హయాంలోనే అమెరికా ప్రపంచంలోనే అత్యంత సంపన్న, గౌరవనీయమైన దేశంగా మారిందని, ద్రవ్యోల్బణం దాదాపు లేదని, స్టాక్ మార్కెట్ రికార్డు స్థాయిలో ఉందని ఆయన చెప్పుకొచ్చారు. టారిఫ్ పన్నుల ద్వారా దేశానికి ట్రిలియన్ల కొద్దీ డాలర్ల ఆదాయం వస్తోందన్నారు.



# బీహార్‌లో మలి విడత పోలింగ్ నేడే

**- 122 అసెంబ్లీ నియోజకవర్గాలు.. 1,302 మంది అభ్యర్థులు - 3.70 కోట్ల మంది ఓటర్లు.. 45,399 పోలింగ్ కేంద్రాలు - 4 లక్షల మంది పోలీసులు, పారామిలటరీ బలగాలతో భద్రత - బరిలో పలువురు మంత్రులు, లెజిస్లేటివ్ లీడర్లు, పిసిసి చీఫ్ - 7 రాష్ట్రాల్లో 8 అసెంబ్లీ స్థానాలకూ పోలింగ్..**

**న్యూఢిల్లీ, నవంబరు 10:** బీహార్ ఎన్నికల రెండవ మరియు చివరి దశ విడత పోలింగ్‌కు సర్వం సిద్ధమైంది. 122 అసెంబ్లీ నియోజకవర్గాల్లో మంగళవారం పోలింగ్ జరుగనుంది. నితీష్ కుమార్ ప్రభుత్వంలోని అరడజనుకు పైగా మంత్రులు సహా 1,302 మంది అభ్యర్థుల భవితవ్యం తేలనుంది. 3.70 కోట్లకు పైగా ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. పోలింగ్‌కు సంబంధించిన ఎన్నికల సంఘం అన్ని ఏర్పాట్లు చేసింది. తూర్పు, పశ్చిమ చంపారన్, సీతామర్హి, మధుబాని, సుపాల్, అరారియా, కిషన్‌గంజ్ తదితర జిల్లాలు నేపాల్ సరిహద్దులో ఉన్నందున కట్టుదిట్టమైన భద్రతను ఏర్పాటు చేశారు. 4 లక్షలకు పైగా పోలీసులు, పారామిలటరీ బలగాలను మోహరించారు. ఇక సీమాంచల్ ప్రాంతంలో ముస్లిముల ప్రాబల్యం అధికం. ఇక్కడ వారిదే నిర్ణయాత్మక ఓటు. మైనారిటీ ఓట్లపై ఆధారపడిన ఇండియా కూటమి, చొరబాటుదారులను రక్షిస్తోందంటూ ఆరోపిస్తున్న ఎన్‌డిఏ ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. ప్రముఖ అభ్యర్థులలో జెడియు సీనియర్ నాయకుడు, రాష్ట్ర మంత్రివర్గంలో అత్యంత సీనియర్ సభ్యుడు బిజేంద్రప్రసాద్ యాదవ్ ఉన్నారు. ఆయన రికార్డు స్థాయిలో 8వ సారి తన సుపాల్ స్థానాన్ని నిలుపుకోవాలని చూస్తున్నారు. మరో మంత్రి, బిజెపి అభ్యర్థి ప్రేమ్‌కుమార్ పరిస్థితి కూడా అదేవిధంగా ఉంది. 1990 నుండి గయా నుండి ఏడుసార్లు గెలుపొందారు. ఈసారి మరోమారు తన అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు. వీరితోపాటు బిజెపికి చెందిన రేణు దేవి (బెట్టయ్య), నీరజ్‌కుమార్ సింగ్ 'బబ్లూ' (ఛాతాపూర్), జెడియుకు చెందిన లేషి సింగ్ (ధమ్దహా), షీలా మండల్ (ఫుల్పరాస్), జామా ఖాన్ (చెయిన్‌పూర్) ఉన్నారు. మాజీ ఉపముఖ్యమంత్రి తార్కిషోర్ ప్రసాద్, వరుసగా ఐదోసారి కతిహార్ స్థానాన్ని నిలుపుకోవాలని చూస్తున్నారు. కతిహార్ జిల్లాలో బలరాంపూర్, కద్వా అసెంబ్లీ స్థానాలు కూడా ఉన్నాయి. ఇక్కడి సిపిఐ(ఎంఎల్) లిబరేషన్, కాంగ్రెస్ శాసనసభా పక్ష నేతలు మెహబూబ్ ఆలం, షకీల్ అహ్మద్ ఖాన్ హ్యాట్రిక్ విజయం సాధించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఎన్‌డిఏ భాగస్వామి పక్షాలు కేంద్ర మంత్రి జితిన రామ్ మాంఝీ నేతృత్వంలోని హిందూస్థానీ అవామ్ మోర్చా (హెచ్ఎఎం), రాజ్యసభ ఎంపీ ఉపేంద్ర కుష్వాహా రాష్ట్రీయ లోక్ మోర్చాకు బలపరీక్షగా కూడా చూస్తున్నారు. ఈ రెండు పార్టీలు చెరో ఆరు స్థానాల్లో పోటీ చేస్తున్నాయి. హెచ్ఎఎం పోటీ చేసిన ఆరుస్థానాలకూ రెండో దశలో ఎన్నికలు జరుగనున్నాయి. వీటిలో నాలుగు ఇమామ్‌గంజ్, బారాచట్టి, టికారి, సికంద్రాలు ప్రస్తుతం పార్టీ ఆధీనంలో ఉన్నాయి. సిట్టింగ్ ఎమ్మెల్యేలకు మళ్లీ తమ అదృష్టాన్ని పరీక్షించుకునే అవకాశమిచ్చింది. గత ఏడాది గయా నుండి లోక్‌సభకు ఎన్నికయ్యే వరకు మాంఝీ ఇమామ్‌గంజ్ స్థానాన్ని కలిగి ఉన్నారు. తరువాత జరిగిన ఉప ఎన్నికలో దానిని అతని కోడలు దీప విజయం సాధించారు. దీపా తల్లి జ్యోతి దేవి బారాచట్టి నుంచి ప్రాతినిధ్యం వహిస్తోంది. ఇక ఆర్ఎల్ఎం అభ్యర్థులలో కుష్వాహా భార్య స్నేహలత ససారాం నుంచి, అతని విశ్వాసపాత్రుడు మాధవ్ ఆనంద్ మధుబని నుంచి తమ భవితవ్యం తేల్చుకోనున్నారు. మరో ముఖ్యమైన అభ్యర్థి రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షుడు రాజేష్ కుమార్, ఆయన వరుసగా రెండోసారి 'కుటుంబ' నుంచి గెలుపొందాలని ఉవ్విళ్లూరుతున్నారు. ఓటర్లు ఎవరు వైపు మొగ్గు చూపుతారో నవంబరు 14 కౌంటింగ్ రోజున తేలనుంది. బీహార్‌తోపాటు ఏడు రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లోని 8 అసెంబ్లీ నియోజకవర్గాలలో ఉప ఎన్నిక జరుగనుంది. ఇందుకు సంబంధించి ఎన్నికల సంఘం అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. జమ్మూకాశ్మీర్‌లోని బుద్గామ్, నగ్రోటా, అంటా (రాజస్థాన్), ఘట్ శిలా (జార్ఖండ్), జూబ్లీహిల్స్ (తెలంగాణ), టర్న్ టరన్ (పంజాబ్), డంపా (మిజోరం), నువపడ (ఒడిశా) నియోజకవర్గా ల్లోనూ మంగళవారం పోలింగ్ జరుగనుంది. అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ఏర్పాట్లు చేశారు.

## విద్యాసంస్థల్లో వందేమాతరం పాడాల్సిందే
**- ఉత్తర్‌ప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్**



**గోరఖ్‌పూర్, నవంబరు 10:** ఉత్తర్‌ప్రదేశ్‌లోని అన్ని విద్యాసంస్థల్లో వందేమాతరం గీతం ఆలపించాల్సిందేనని ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ స్పష్టం చేశారు. ప్రతి పాఠశాల, విద్యా సంస్థలో 'వందేమాతరం' పాడటం తప్పనిసరి చేస్తామన్నారు. గోరఖ్‌పూర్‌లో సోమవారం ఏక్తా యాత్ర కార్యక్రమంలో సిఎం యోగి మాట్లాడుతూ, ఈ చర్య భారత మాత, మాతృభూమి పట్ల పౌరులలో భక్తి భావాలను ప్రేరేపిస్తుందన్నారు. జాతీయ గీతం వందేమాతరం పట్ల ప్రతి పౌరుడిలో గౌరవ భావం ఉండేలా తమ ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని సిఎం ఆదిత్యనాథ్ వివరించారు. ఇలా ప్రతీ పాఠశాలలో జాతీయ గేయాన్ని పాడటం ద్వారా.. పిల్లలకు చిన్ననాటి నుంచే దేశభక్తితో పాటు జాతీయ గేయంపై గౌరవభావం వంటివి అలవడతాయన్నారు. వందేమాతరంను వ్యతిరేకించే వారు దేశ ఐక్యత, సమగ్రతను అవమానించినట్టేనని ఈ సందర్భంగా యోగి అన్నారు. దేశంలో నివసించే ప్రతి పౌరుడూ విధేయతగా, ఐక్యత కోసం పనిచేయాలని కాంక్షిస్తున్నట్టు ఆయన చెప్పారు. కులం, ప్రాంతం, భాషల పేరుతో సమాజాన్ని విభజించే వంటి అంశాలను గుర్తించి ఎప్పటికప్పుడు వాటిని వ్యతిరేకించాలని యోగి సూచించారు. ఇలాంటి విభజనలు కొత్త జిన్నాలను సృష్టించే కుట్రలో భాగమని అని ఆయన చెప్పుకొచ్చారు. దేశంలో నూతన జిన్నాలకు తెరలేపకుండా అప్రమత్తంగా ఉండాలని పిలుపునిచ్చారు.



## జడ్జిలపై ఆరోపణలు చేయడం ఫ్యాషనైపోయింది
**- సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ బిఆర్ గవాయ్**

**న్యూఢిల్లీ, నవంబరు 10:** జడ్జిలపై ఆరోపణలు చేయడం ఇటీవల ట్రెండ్‌గా మారిపోయిందని, ఇది న్యాయ వ్యవస్థకు మంచిది కాదని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బిఆర్ గవాయ్ అభిప్రాయపడ్డారు. తమకు అనుకూలంగా తీర్పులు రానప్పుడు న్యాయవాదులు ఆరోపణలు చేస్తున్నారని, దీనిపై సిజె తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. ఇలాంటి పద్ధతులను తీవ్రంగా ఖండించాల్సిన అవసరం ఉందని ఆయన స్పష్టం చేశారు. తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తిపై అనుచిత వ్యాఖ్యలు చేసినందుకు ఎన్. పెద్దిరాజు అనే వ్యక్తిపై నమోదైన కోర్టు ధిక్కరణ కేసు విచారణ సందర్భంగా సీజేఐ సోమవారం ఈ కీలక వ్యాఖ్యలు చేశారు. తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ మోషుమి భట్టాచార్యపై పెద్దిరాజు తీవ్రమైన ఆరోపణలు చేశారు. దీనిపై సుప్రీంకోర్టు సుమోటోగా కోర్టు ధిక్కరణ కేసు నమోదు చేసింది. అయితే, పిటిషనర్ పెద్దిరాజు చెప్పిన క్షమాపణను సదరు న్యాయమూర్తి అంగీకరించారని సీనియర్ న్యాయవాది సంజయ్ హెగ్డే కోర్టుకు తెలిపారు. దీంతో ధర్మాసనం ఈ కేసును మూసివేసింది. అయినప్పటికీ, ఈ ధోరణిపై చీఫ్ జస్టిస్ బిఆర్ గవాయ్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. "న్యాయస్థానానికి సేవకులుగా ఉండే న్యాయవాదులకు కోర్టు పట్ల ఒక బాధ్యత ఉంటుంది. శిక్షించడంలో కాదు, క్షమాపణ చెప్పినప్పుడు క్షమించడంలోనే చట్టం గొప్పతనం ఉంటుంది. ఆరోపణలు ఎదుర్కొన్న హైకోర్టు న్యాయమూర్తే క్షమాపణను అంగీకరించారు. కాబట్టి తాము ఈ కేసును ముందుకు తీసుకెళ్లడం లేదు. అయితే, న్యాయమూర్తులపై ఆరోపణలు చేసే పిటిషన్లపై సంతకాలు చేసే ముందు న్యాయవాదులు చాలా జాగ్రత్తగా ఉండాలి" అని సిజెఐ నేతృత్వంలోని ధర్మాసనం స్పష్టం చేసింది. ఈ నెల 23న పదవీ విరమణ చేయనున్న సిజెఐ బిఆర్ గవాయ్, న్యాయవ్యవస్థ ప్రతిష్ఠను దెబ్బతీసే ఇలాంటి చర్యల పట్ల కఠినంగా వ్యవహరించాల్సిన అవసరాన్ని నొక్కి చెప్పారు.

## ఆధార్ కస్టమర్ల కోసం కొత్త మొబైల్ అప్లికేషన్!

**న్యూఢిల్లీ, నవంబరు 10:** భారత విశిష్ట గుర్తింపు ప్రాధికార సంస్థ (యుఐడిఎఐ) ఆధార్ వినియోగదారుల కోసం మరో కొత్త మొబైల్ అప్లికేషన్‌ను అందుబాటులోకి తెచ్చింది. స్మార్ట్‌ఫోన్‌లోనే ఆధార్ వివరాలను సురక్షితంగా భద్రపరచుకోవడంతో పాటు, అవసరమైన సమాచారాన్ని సులభంగా పంచుకునేందుకు ఈ యాప్‌ను ప్రత్యేకంగా రూపొందించినట్లు యూఐడీఏఐ తెలిపింది. ఈ కొత్త యాప్‌తో ఇకపై భౌతికంగా ఆధార్ కార్డును వెంట తీసుకెళ్లాల్సిన అవసరం ఉండదని, ఇది పూర్తిస్థాయి పేపర్‌లెస్ అనుభవాన్ని అందిస్తుందని పేర్కొంది. ఈ యాప్‌లో పలు ఆకర్షణీయమైన ఫీచర్లను పొందుపరిచారు. ముఖ్యంగా, ఒకే డివైజ్‌లో కుటుంబ సభ్యులందరి ఆధార్ వివరాలను కూడా భద్రపరచుకునే వెసులుబాటు కల్పించారు. వినియోగదారుల భద్రతను దృష్టిలో ఉంచుకుని ఫేస్ అథెంటికేషన్ ద్వారా లాగిన్ అయ్యే సౌకర్యం కల్పించారు. మన ఆధార్ వివరాలను ఇతరులతో పంచుకోవాల్సి వచ్చినప్పుడు, కేవలం అవసరమైన సమాచారాన్ని మాత్రమే పంపే అవకాశం కూడా ఉంది. బయోమెట్రిక్ వివరాలను లాక్ లేదా అన్‌లాక్ చేసుకునే ఆప్షన్, ఆధార్ కార్డు చివరిసారిగా ఎక్కడ ఉపయోగించారో తెలుసుకునే హిస్టరీని చెక్ చేసుకునే సౌకర్యం కూడా ఇందులో ఉన్నాయి. ప్రస్తుతం వాడుకలో ఉన్న ఎంఆధార్ యాప్‌కు ఇది ప్రత్యామ్నాయం కాదని యూఐడీఏఐ స్పష్టం చేసింది. ఎంఆధార్‌లో లభించే డిజిటల్ కార్డు డౌన్‌లోడ్, పీవీసీ కార్డు ఆర్డర్, మొబైల్/ఈ మెయిల్ వెరిఫికేషన్ వంటి సేవలు ఈ కొత్త యాప్‌లో ఉండవు. కేవలం ఆధార్ డేటాను సురక్షితంగా నిల్వ చేయడం, షేర్ చేయడం కోసమే దీనిని తీసుకొచ్చారు. ఆండ్రాయిడ్ యూజర్లు గూగుల్ ప్లే స్టోర్ నుంచి, ఐఫోన్ యూజర్లు యాపిల్ యాప్ స్టోర్ నుంచి ఈ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. యాప్‌ను ఇన్‌స్టాల్ చేశాక, ఆధార్‌తో అనుసంధానమైన మొబైల్ నంబర్‌తో లాగిన్ అయి, ఓటీపీ, ఫేస్ అథెంటికేషన్ పూర్తి చేయాలి. అనంతరం, భద్రత కోసం ఒక పిన్ నంబర్‌ను సెట్ చేసుకుని యాప్‌ను ఉపయోగించడం ప్రారంభించవచ్చు. ఈ కొత్త యాప్‌తో ఆధార్ సేవలు మరింత సులభంగా, సురక్షితంగా మారతాయని అధికారులు భావిస్తున్నారు.



# ఉగ్రవాదుల ఏరివేతలో తొమ్మిది మంది అరెస్ట్
### భారీ ఎత్తున ఆయుధాలు, సామగ్రి స్వాధీనం

**శ్రీనగర్, నవంబరు 10:** జమ్మూకశ్మీర్‌లో భద్రతా బలగాలు భారీ ఉగ్రవాద వ్యతిరేక ఆపరేషన్‌ను చేపట్టాయి. లోయ వ్యాప్తంగా పలు జిల్లాల్లో విస్తృతంగా నిర్వహిస్తున్న సోదాల్లో భాగంగా నిన్న ఒక మహిళ సహా తొమ్మిది మందిని అదుపులోకి తీసుకున్నారు. ఈ ఆపరేషన్ నేడు కూడా కొనసాగుతోంది. ఉగ్రవాదుల కదలికలపై అందిన పక్కా సమాచారంతో ఈ తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఇంటెలిజెన్స్ వర్గాల నివేదికల ప్రకారం ఎత్తైన పర్వత ప్రాంతాల్లో క్రియాశీలంగా ఉన్న ఉగ్రవాదులు శీతాకాలం సమీపిస్తుండటంతో మైదాన ప్రాంతాల్లో సురక్షితమైన ఆశ్రయం కోసం ప్రయత్నిస్తున్నారు. ఈ సమాచారం ఆధారంగా భద్రతా దళాలు అప్రమత్తమయ్యాయి. రాంబన్, కిష్త్వార్, దోడా, కథువా, రియాసి, పూంచ్, రాజౌరి జిల్లాల్లోని డజన్ల కొద్దీ ప్రదేశాలలో కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ చేపట్టారు. ఈ దాడులు, సోదాలు సోమవారం కూడా నిరంతరాయంగా కొనసాగాయి. అనుమానిత స్థావరాలపై భద్రతా బలగాలు జల్లెడ పడుతున్నాయి. ఉగ్రవాదుల ప్రణాళికలను భగ్నం చేసి, వారిని ఏరివేయడమే లక్ష్యంగా ఈ ఆపరేషన్ జరుగుతోంది. అదుపులోకి తీసుకున్న నిందితులపై చట్టవ్యతిరేక కార్యకలాపాల నివారణ చట్టం (ఉపా) సెక్షన్లు 13, 28, 38, 39 కింద, అలాగే ఆయుధాల చట్టంలోని సెక్షన్ 7/25 కింద కేసులు నమోదు చేశారు. లోయలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే ఎలాంటి ప్రయత్నాన్నైనా అడ్డుకునేందుకు భద్రతా బలగాలు కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నాయి. నిషేధిత ఉగ్రవాద సంస్థలు జైష్ ఏ మొహ్మద్, అన్సార్ ఘజ్వత్ ఉల్ హింద్‌తో సంబంధం ఉన్న ఓ అంతర్రాష్ట్ర, అంతర్జాతీయ ఉగ్రవాద నెట్‌వర్క్‌ను జమ్మూ కశ్మీర్ పోలీసులు ఛేదించారు. ఈ కేసులో పలువురు కీలక అనుమానిత ఉగ్రవాదులను అరెస్టు చేయడంతో పాటు భారీగా ఆయుధాలు, మందుగుండు, పేలుడు పదార్థాలను స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం అక్టోబర్ 19న శ్రీనగర్‌లోని బున్‌పోరా, నౌగామ్‌లో పోలీసులు, భద్రతా దళాలను హెచ్చరిస్తూ జైష్ ఏ మహ్మద్ పోస్టర్లు వెలిశాయి. ఆ తర్వాత పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ నెట్‌వర్క్‌లో పలువురు విద్యావంతులతో పాటు, ప్రొఫెనల్స్ ఉన్నారని.. విదేశీయ పరిచయాల ద్వారా పని చేస్తున్నట్లుగా తేలింది.

## సంక్షిప్తంగా..

### దగ్గుమందు తయారీకి మార్గదర్శకాలు



**న్యూఢిల్లీ, నవంబర్ 10:** కోల్డ్‌రిఫ్ దగ్గుమందు వల్ల ఆయా రాష్ట్రాల్లో చిన్నారులు మృతి చెందిన ఘటన కలకలం సృష్టించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో సోమవారం ఔషధ తయారీదారులకు కేంద్ర ప్రభుత్వం అల్టిమేటం ఇచ్చింది. జనవరి ఒకటి నాటికి అంతర్జాతీయ ప్రమాణాలు పాటించాలని ఆదేశించింది. లేకపోతే కంపెనీలు మూసుకోవాల్సిందేనని హెచ్చరించింది. ఈ మేరకు సెంట్రల్ డ్రగ్స్ స్టాండర్డ్ కంట్రోల్ ఆర్గనైజేషన్ ఆదేశాలు జారీ చేసింది. జనవరి ఒకటి నాటికి ఔషధ తయారీ సంస్థలు గ్లోబల్ గుడ్ మాన్యుఫాక్చరింగ్ ప్రాక్టీసెస్‌కు అనుగుణంగా ఉండాలని స్పష్టం చేసింది. ఈ తేదీలో ఎలాంటి పొడిగింపులు ఉండవని తేల్చి చెప్పింది. భారత్‌లో తయారైన కొన్ని దగ్గుమందుల వల్ల స్వదేశంతో పాటు విదేశాల్లో పిల్లల మరణాలు సంభవించిన సంగతి తెలిసిందే. భారత్ నుంచి ఎగుమతి అయిన ఈ మందుల వల్ల గాంబియా, ఉజ్బెకిస్థాన్ దేశాల్లో చిన్నారులు మృతి చెందారు.

### భారత్‌లో అమెరికా రాయబారిగా సెర్గియోగోర్



**వాషింగ్టన్, నవంబరు 10:** భారత్‌లో అమెరికా కొత్త రాయబారిగా నియమితులైన సెర్గియో గోర్ ప్రమాణ స్వీకార కార్యక్రమంలో అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ స్వయంగా పాల్గొననున్నారు. సోమవారం జరగనున్న ఈ కార్యక్రమానికి ట్రంప్ హాజరవుతారని వైట్‌హౌస్ ఆదివారం ఒక ఈమెయిల్‌లో అధికారికంగా ధ్రువీకరించింది. ట్రంప్‌కు అత్యంత సన్నిహితులలో ఒకరిగా పేరున్న సెర్గియో, ఈ కార్యక్రమం ముగిసిన వెంటనే న్యూఢిల్లీలో బాధ్యతలు స్వీకరించే అవకాశం ఉంది. కేవలం 38 ఏళ్ల వయసున్న సెర్గియో గోర్, భారత్‌లో అమెరికా రాయబారిగా పనిచేయనున్న అత్యంత పిన్న వయస్కుడిగా నిలవనున్నారు. గతంలో వైట్‌హౌస్‌లో ప్రెసిడెన్షియల్ పర్సనల్ ఆఫీస్ డైరెక్టర్‌గా సేవలందించారు.

### ప్రముఖ తమిళనటుడు అభినయ్‌కింగర్ మృతి



**చెన్నై, నవంబరు 10:** తమిళ చిత్ర పరిశ్రమలో తీవ్ర విషాదం చోటు చేసుకుంది. ప్రముఖ నటుడు అభినయ్ కింగర్ ఈ ఉదయం కన్ను మూశారు. గత కొన్నేళ్లుగా కాలేయ సంబంధిత వ్యాధితో బాధపడుతున్న ఆయన, చికిత్స పొందుతూ ఆరోగ్యం విషమించడంతో తుదిశ్వాస విడిచారు. ఆయన మరణవార్తతో కోలీవుడ్‌లో విషాద ఛాయలు అలుముకున్నాయి. అరుముగ్, ఆరోహణం, సక్సెస్ వంటి పలు చిత్రాల్లో నటించి అభినయ్ తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు. ఆయన చివరిసారిగా వల్లవనుక్కు పుల్లుం ఆయుధం అనే చిత్రంలో కనిపించారు. అనారోగ్య సమస్యలు తీవ్రం కావడంతో నటనకు పూర్తిగా దూరమై చికిత్స తీసుకుంటున్నారు. మరణాన్ని ముందే ఊహించినట్లుగా మూడు నెలల క్రితం అభినయ్ ఒక వీడియోను విడుదల చేశారు. అందులో తాను కేవలం ఏడాదిన్నర మాత్రమే జీవిస్తానని చెప్పినట్లు పేర్కొన్నారు.

### ఆస్ట్రేలియాలో మైనర్లకు సోషల్ మీడియా

**కాన్‌బెర్రా, నవంబరు 10:** పిల్లల ఆన్‌లైన్ భద్రతను పరిగణనలోనికి తీసుకుని ఆస్ట్రేలియా ప్రభుత్వం ప్రధాననిర్ణయాన్ని ప్రకటించింది. దేశవ్యాప్తంగా 16 సంవత్సరాలలోపు వయసున్న పిల్లలు సోషల్ మీడియాను వినియోగించడంపై నిషేధం విధిస్తున్నట్లు ప్రధాని ఆంథోనీ అల్బనీస్ ప్రకటించారు. ఈ కొత్త నిబంధన ఈ ఏడాది డిసెంబర్ 10వ తేదీ నుంచి అమల్లోకి రానుంది. ఈ మేరకు 'ఆన్‌లైన్ సేఫ్టీ అమెండ్‌మెంట్ (సోషల్ మీడియా మినిమమ్ ఏజ్) బిల్ 2024' పేరుతో ప్రభుత్వం ఒక కొత్త చట్టాన్ని తీసుకువచ్చింది. ఈ చట్టం ప్రకారం 16 ఏళ్లలోపు మైనర్లు ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, టిక్‌టాక్, స్నాప్‌చాట్, ఎక్స్ (గతంలో ట్విట్టర్), యూట్యూబ్, రెడ్డిట్, కిక్ వంటి ప్రముఖ సోషల్ మీడియా ప్లాట్‌ఫారమ్‌లలో అకౌంట్లు తెరవడం లేదా వాటిని వినియోగించడం చట్టవిరుద్ధం అవుతుంది.

### అనుమానాస్పద స్థితిలో మోడల్ మృతి

**భోపాల్, నవంబరు 10:** అనుమానాస్పదస్థితిలో మృతిచెందిన ఒక మోడల్‌ను ఆమె ప్రియుడు ఆసుపత్రిలోనే వదిలేసి వెళ్లిపోయాడు. మధ్యప్రదేశ్ రాజధాని భోపాల్‌లో ఈ సంఘటన జరిగింది. 27 ఏళ్ల ఖుష్బూ అహిర్వార్ అలియాస్ ఖుషీ వర్మ కాలేజీ చదువును మధ్యలో మానేసింది. మోడల్‌గా ఆమె చేస్తున్నది. పలు పార్ట్‌టైమ్ ఉద్యోగాలు కూడా చేసింది. 'డైమండ్ గర్ల్' పేరుతో ఇన్‌స్టాగ్రామ్ పోస్టులతో ఆమె పాపులర్ అయ్యింది. కాగా, మోడల్ గత మూడేళ్లుగా భోపాల్‌లో నివసిస్తున్నది.



సోమవారం సమీక్ష నిర్వహిస్తున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

## పంటల సేకరణలో అప్రమత్తంగా ఉండాలి

### వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

**హైదరాబాద్, నవంబరు 10, ప్రభాతవార్త:** రాష్ట్ర వ్యాప్తంగా వానాకాలం పంటలకు సంబంధించి మార్కెట్లలో కొనుగోళ్ల ప్రారంభమైన నేపథ్యంలో ఈ నెలలో పంటల సేకరణకు కీలకమని వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరావు తెలిపారు. ఈ నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. హైదరాబాద్‌లో సోమవారం మరో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామక్రిష్ణారావుతో కలిసి సమీక్ష చేశారు. ఈ సందర్భంగా వ్యవసాయ మంత్రి తుమ్మల మాట్లాడుతూ ధాన్యం కొనుగోళ్లలో సమస్యలను పరిష్కరించే దిశగా కృషి చేయాలన్నారు. పత్తి మొక్కజొన్న సోయాచిక్కుడు కొనుగోళ్లకు సంబంధించి రైతులకు ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకోవాలని చెప్పారు. సీసీఐ కొత్త నిబంధనలపై పత్తి రైతుల ఇబ్బందులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను పరిష్కరించేలా చూడాలన్నారు. అలాగే రాష్ట్రంలో మొక్కజొన్న కొనుగోలులో ఎకరాకు 18.5 క్వింటాలు నుంచి 25 క్వింటాళ్ల వరకు పరిమితి పెంచినట్లు తెలిపారు. ఎకరాకు ప్రస్తుతం కొనుగోలు చేస్తున్న 7 క్వింటాళ్ల నిబంధనను 12 క్వింటాలకు పెంచేలా కేంద్రంపై ఒత్తిడి తెస్తామని చెప్పారు. వర్షాలవల్ల రంగుమారిన సోయాచిక్కుడు కొనుగోలు చేయాలని కేంద్రానికి ప్రతిపాదన పంపినట్లు పేర్కొన్నారు.

## సూర్యాపేట జిల్లాలో సాఫీగా సాగుతున్న ధాన్యంసేకరణ: కలెక్టర్

**ప్రభాతవార్త, నడిగూడెం,(సూర్యాపేట):** సూర్యాపేట జిల్లాలో ఖరీఫ్ ధాన్యం సేకరణ సాఫీగా కొనసాగుతున్నదని జిల్లా అదనపు కలెక్టర్ కే. సీతారామారావు రాష్ట్ర పౌరసరఫరాలు ,నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు లకు తెలిపారు.సోమవారం హైదరాబాద్ నుండి మంత్రులు ధాన్యం పత్తి , మొక్క జొన్న ,సోయా తదితర పంటల సేకరణ పై జిల్లా కలెక్టర్లు, సంబంధిత అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. రైతులకు సౌకర్యంగా ఉండేలా జిన్నింగ్ మిల్లులను ట్యాగ్ చేసేలా ప్రణాళిక రూపొందించాలని, ధాన్యం పత్తి అమ్మిన రైతులకు వెంటనే చెల్లింపులు చేయాలని, నవంబర్ ,డిసెంబర్ మొదటి మాసం వరకు ముమ్మరంగా ధాన్యం,పత్తి వచ్చే అవకాశం ఉన్నందున కలెక్టర్లు,అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆదేశించారు .రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో డిఆర్డిఓ వివి అప్పారావు , పౌరసరఫరాల జిల్లా మేనేజర్ రాము, డిఎస్ఓ మోహన్ బాబు,డి సి ఓ పి. ప్రవీణ్ కుమార్, జిల్లా ఇంచార్జ్ వ్యవసాయ అధికారి నివేదిత, జిల్లా మార్కెటింగ్ అధికారి నాగేశ్వర్ శర్మ, ట్రాన్స్పోర్ట్ అధికారులు తదితరులు వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్నారు.

## పిఎం కిసాన్‌లో 35,44,213 మంది అనర్హుల తొలగింపు

### ఫిజికల్ వెరిఫికేషన్ తర్వాతే చేర్పులు, మార్పులు

**హైదరాబాద్, నవంబరు 10, ప్రభాతవార్త:** రైతుల కోసం కేంద్రం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి యోజన పథకంలో అనర్హుల ఏరివేత కార్యక్రమాన్ని చేపట్టింది. ఇందులో భాగంగా కేంద్రం దేశవ్యాప్తంగా 35,44,213 మంది అనర్హులను తొలగిస్తూ కీలక నిర్ణయం తీసుకుంది. అయితే వీటని క్షేత్రస్థాయిలో ఫిజికల్ వెరిఫికేషన్ తర్వాత వాస్తవ అర్హులను తిరిగి పథకంలో చేర్చుతామని కేంద్ర వ్యవసాయ మంత్రిత్వ శాఖ తాజాగా వివరణ ఇచ్చింది. పీఎం కిసాన్ లబ్దిదారుల నుంచి తొలగించిన పేర్లకు సంబంధించి ఇది తాత్కాలిక తొలగింపే కానీ, శాశ్వత తొలగింపు కాదని తేల్చిచెప్పింది. ఇలా తొలగించిన పేర్లకు సంబంధించి ఫిజికల్ వెరిఫికేషన్ జరుగుతుందనీ అది పూర్తైన తర్వాత తగిన నిర్ణయం తీసుకుంటామని వెల్లడించింది. అర్హులైన వారి పేర్లను తిరిగి జాబితాలో చేర్చుతామనీ, అర్హులు కాని వారిని మాత్రం మళ్లీ జాబితాలో చేర్చే పరిస్థితి ఉండదని స్పష్టం చెప్పింది. ఈ సందర్భంగా రైతులకు కేంద్రం ఒక సూచన చేసింది. ఇలా తొలగించిన వారిలో తెలుగు రాష్ట్రాలకు చెందిన వారు దాదాపు 2 లక్షల మంది ఉంటారని అంచనా. ఇదే సమయంలో ఈ పథకం నుండి తొలగించిన అనర్హుల్లో అర్హులైన రైతులు ఉన్నట్లయితే దాన్ని నిర్ధారించేందుకు మరోసారి దరఖాస్తు పెట్టుకోవాలని సూచించింది. అర్హులైన జాబితాలో తమ పేరును ఉంచారో, తొలగించారో తెలుసుకునేందుకు పిఎం కిసాన్ వెబ్‌సైట్‌లో నౌ యువర్ స్టేటస్ అని చెక్ చేసి చూసుకోవాలని కేంద్రం చెప్పింది. మొబైల్ యాప్ లేదా కిసాన్ మిత్ర చాట్‌బాట్ ద్వారా కూడా ఈ వివరాలు తెలుసుకోవచ్చని పేర్కొంది. ఈ జాబితో పేరు లేకపోయి, అర్హులైన రైతులు దరఖాస్తు చేసుకుని, అందుకు అవసరమైన రుజువు పత్రాలను అప్‌లోడ్ చెయ్యాలని స్పష్టం చేసింది. ఈ పనిని మొబైల్ ద్వారా చెయ్యవచ్చు లేదా మీసేవా కేంద్రాల్లో కూడా చేస్తాని వెల్లడించింది.



## టెక్నో-కల్చరల్ ఫెస్టివల్‌కు తెలంగాణప్రభుత్వం గ్రీన్ సిగ్నల్

### హైదరాబాద్ వేదికగా 'కల్చరల్ సావర్నిటీ త్రూ సినిమా' ఉత్సవం

### 55 లక్షల రూ. నిధులు మంజూరు

### మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి

**హైదరాబాద్,నవంబరు 10, ప్రభాతవార్త:** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ-నార్త్ ఈస్ట్ ఇండియా కనెక్ట్, టెక్నో-కల్చరల్ ఫెస్టివల్ - కల్చరల్ సావరినిటీ త్రూ సినిమా" అనే విభిన్న సాంస్కృతిక-సినిమాటోగ్రఫీ ఉత్సవం నిర్వహణకు రూ. 55 లక్షల నిధులను మంజూరు చేసిందనీ రాష్ట్ర రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి తెలిపారు.జి.ఓ.ఆర్.టి.నెం.1551 ప్రకారం, ఈ కార్యక్రమాన్ని తెలంగాణ ఫిల్మ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఈ నెలలో హైదరాబాద్‌లోని ప్రసాద్ మల్టీప్లెక్స్, హైటెక్స్ కన్వెన్షన్ సెంటర్ వేదికగా నిర్వహించనున్నట్లు వెల్లడించారు.ఈ కార్యక్రమానికి రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి నాయకత్వం వహిస్తున్నారు. ఆయన సారథ్యంలో తెలంగాణ ప్రభుత్వం, రాష్ట్ర సినీ-సాంస్కృతిక రంగాన్ని దేశవ్యాప్తంగా విస్తరించాలనే దిశగా ముందడుగు వేస్తోంది.మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి మాట్లాడుతూ తెలంగాణను దేశంలోని కళ, సంస్కృతి, సినిమాటోగ్రఫీ రంగాల కేంద్రంగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు.ఈ ఫెస్టివల్ ద్వారా ఈశాన్య రాష్ట్రాలతో సాంస్కృతిక, సృజనాత్మక బంధాలు మరింత బలపడతాయి," అన్నారు.ఈ ఫెస్టివల్ లో జాతీయ అవార్డు గెలుచుకున్న చిత్రాల ప్రదర్శనలు, ప్యానెల్ చర్చలు, సాంస్కృతిక ప్రదర్శనలు జరుగుతాయనీ వివరించారు. తెలంగాణ రాష్ట్రం కల్చరల్ ఎక్స్ఛేంజ్‌కి కేంద్ర బిందువుగా ఎదుగుతున్నదని మంత్రి తెలిపారు.

# సుస్థిర భవిష్యత్‌కు కార్మికులు భాగస్వాములు కావాలి

## 10 రాష్ట్రాల్లో విస్తరణ ప్రణాళికలు: సింగరేణి సిఎండి బలరామ్



సోమవారం హైదరాబాద్‌లో కార్మిక సంఘాలనుద్దేశించి మాట్లాడుతున్న సిఎండి బలరామ్

**హైదరాబాద్, నవంబరు 10, ప్రభాతవార్త:** సింగరేణి సుస్థితర భవిష్యత్‌కు కార్మికులందరూ భాగస్వాములు కావాలని సంస్థ సిఎండి ఎన్ బలరామ్ సూచించారు. కంపెనీ మనుగడ కోసం పని సంస్కృతి మెరుగుపరచడంలో సహకరించాలని పిలుపునిచ్చారు. రానున్న రోజుల్లో దేశంలోని 10 రాష్ట్రాల్లో సింగరేణి విస్తరణ ప్రణాళికలు రూపొందించుకుని ముందుకు సాగుతున్నట్లు తెలిపారు. హైదరాబాద్‌లో సోమవారం కార్మిక సంఘాల నుద్దేశించి మాట్లాడుతూ బొగ్గు రంగానికే పరిమితమైన సంస్థను 5 వేల మెగావాట్ల పునరుత్పాదక ఇంధన ఉత్పత్తి చేసేలా తీర్చిదిద్దేందుకు వీలుగా సింగరేణి గ్రీన్ ఎనర్జీని ప్రోత్సహిస్తున్నట్లు పేర్కొన్నారు, అలాగే విశ్వవ్యాప్తంగా కీలక ఖనిజ అన్వేషణ, మైనింగ్కు సింగరేణి గ్లోబల్ లిమిటెడ్ కంపెనీలను ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. మార్కెట్లో పోటీని తట్టుకునేందుకు బొగ్గు ధరలను తగ్గించామన్నారు. ఈ నేపథ్యంలో ఉత్పత్తి వ్యయాన్ని తగ్గించడం అనివార్యమని స్పష్టం చేశారు. అప్పుడే సంక్షేమ కార్యక్రమాలను కూడా కొనసాగించడానికి, ఉపాధి కల్పనకు అవకాశం ఉంటుందని తేల్చిచెప్పారు. ఉత్పత్తి ఖర్చు తగ్గించాలంటే ఉద్యోగులు పూర్తి పని గంటలు సద్వినియోగం చేస్తూ యంత్రాలను పూర్తిగా వినియోగించాలన్నారు. విధులకు గైర్హాజరు అవుతున్న కార్మికులు విధులకు హాజరయ్యేలా అవగాహన కల్పించాలని, తద్వారా క్రమశిక్షణను పెంచడం సాధ్యమవుతుందని చెప్పారు. రక్షణ, నాణ్యత పెంపుదలకు మరింత కృషి జరగాల్సి ఉందని తెలిపారు. సింగరేణి ఉద్యోగులు, సంస్థపై ఆధారపడిన కార్మికుల భవిష్యత్ దృష్ట్యా కొత్త బొగ్గు గనులను వేలంలో దక్కించుకోవడానికి కృషి చేస్తున్నామ వివరించారు. తద్వారా సింగరేణికి మరో వందేళ్ల భవిష్యత్ ఉంటుందని పేర్కొన్నారు. ఇదే సమయంలో సింగరేణి ఉద్యోగులకు రూ.300 కోట్ల వ్యయంతో వెయ్యి క్వార్టర్ల నిర్మాణం చేపట్టామన్నారు. దేశంలోనే ఏ కంపెనీలో లేని విధంగా సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నామని తెలిపారు. అలాగే అత్యాధునిక వైద్య సేవలు అందించడానికి గోదావరిఖనిలో వచ్చే రెండు నెలల్లో క్యాథ్ ల్యాబ్, హైదరాబాద్‌లో సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి ఏర్పాటు కోసం చర్యలు తీసుకున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు గౌతమ్, ఎల్వీ సూర్యనారాయణ, కె.వెంకటేశ్వర్లు, ఎం.తిరుమల రావు తదితరులు పాల్గొన్నారు.

## నేటి నుంచి బిసి గురుకులాల్లో జిల్లా స్థాయి క్రీడా పోటీలు

> పాల్గొననున్న 12,570 మంది విద్యార్థులు
>
> జిల్లా స్థాయి విజేతలతో రాష్ట్ర స్థాయిలో పోటీలు
>
> సొసైటీ కార్యదర్శి బడుగు సైదులు

**హైదరాబాద్, ప్రభాతవార్త, నవంబరు 10:** తెలంగాణలోని బిసి గురుకులాల్లో ఈనెల 11నుంచి 20 వరకు జిల్లా స్థాయి క్రీడా పోటీలను నిర్వహించనున్నారు. జిల్లా స్థాయి విజేతలతో త్వరలో రాష్ట్ర స్థాయి పోటీలను నిర్వహించనున్నట్టు బిసి గురుకుల సొసైటీ కార్యదర్శి బడుగు సైదులు తెలిపారు. తరగతి గదిలో పుస్తకాలతో కుస్తీ పట్టే విద్యార్థులకు ఆటవిడుపుగా ఉండటం కోసం విద్యార్థులకు క్రీడల్లో పోటీలు నిర్వహిస్తున్నామని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉమ్మడి పది జిల్లాల్లోని 20 ప్రాంగణాల్లో ఈనెల 11వ తేదీ నుంచి 13 వ తేదీ వరకు నిర్వహించే జిల్లా స్థాయి స్పోర్ట్స్ మీట్‌లో 294 గురుకులాల నుంచి 12570 మంది విద్యార్థులు పాల్గొంటారని సోమవారం విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు. 19 సంవత్సరాల లోపు విభాగంలో ప్రతి స్కూల్ నుంచి 20 మంది విద్యార్థులు, 14 సంవత్సరాల లోపు విభాగంలో ప్రతి స్కూల్ నుంచి 25 మంది విద్యార్థులు పాల్గొంటారని తెలిపారు. 19 సంవత్సరాల లోపు విభాగంలో 5220 మంది విద్యార్థులు, 14 సంవత్సరాల లోపు విభాగంలో 7350 మంది విద్యార్థులు పాల్గొంటారని తెలిపారు. మూడు రోజులపాటు జరిగే జిల్లా స్థాయి స్పోర్ట్స్ మీట్‌లో పాల్గొన్నే విద్యార్థులకు రన్నింగ్, లాంగ్ జంప్, హైజంప్, షార్ట్ పుట్, డిస్క్ త్రో, కబడ్డీ, ఖోఖో, వాలీ బాల్, టెన్నికాయిట్, చెస్ పోటీలను నిర్వహిస్తామన్నారు. ఈ పోటీలలో పాల్గొని విజేతలుగా నిలిచిన విద్యార్థులకు రాష్ట్రస్థాయిలో త్వరలో స్పోర్ట్స్ మీట్ నిర్వహిస్తామన్నారు. విద్యార్థుల్లోని ప్రతిభను గుర్తించి వారికి అవసరమైన శిక్షణ ఇచ్చి రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో జరిగే క్రీడా పోటీల్లో పాల్గొనే అవకాశం కల్పిస్తామన్నారు. ఈనెల 6వ తేదీ నుంచి 8వ తేదీ వరకు 17 సంవత్సరాల లోపు విభాగంలో నిర్వహించిన పోటీల్లో 294 గురుకులాల నుంచి 10290 విద్యార్థులు పాల్గొన్నారని పేర్కొన్నారు. ఈనెల 15 వ తేదీ నుంచి 25 వ తేదీ వరకు జిల్లా స్థాయిలో సాంస్కృతిక, సాహిత్య, వక్తృత్వ, వ్యాసరచన, చిత్రలేఖనంలో పోటీలను నిర్వహిస్తామన్నారు. ఈ పోటీలలో ఉత్తమ ప్రతిభ కనబరిచి ఎంపికైన విద్యార్థులు వచ్చేనెల రాష్ట్ర స్థాయిలో నిర్వహించే కల్చరల్ కార్నివాల్‌లో పాల్గొంటారని పేర్కొన్నారు.

# ఎయిర్‌పోర్టులా సికింద్రాబాద్ రైల్వేస్టేషన్

### కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి




సోమవారం సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో మీడియాతో మాట్లాడుతున్న కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

**కంటోన్మెంట్, నవంబరు 10 ప్రభాతవార్త:** సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌ను అంతర్జాతీయ స్థాయిలో నిర్మించుకుంటున్నామని, ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, అన్ని రకాలా సౌకర్యాలు ఉండేలా డిజైన్ చేశామని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి తెలిపారు. రూ.715 కోట్లు ఖర్చు పెడుతున్నామని,ప్రతి రోజు 1.97 లక్షల మంది, ప్రతి గంటకు 22 వేల మంది ప్రయాణికులు సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌కు వస్తున్నారని చెప్పారు. సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ పనులను పరిశీలించిన అనంతరం జరిగిన ప్రెస్ మీట్‌లో కేంద్ర మంత్రి జి.కిషన్ రెడ్డి గారు ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాలుగు నెలల్లో సౌత్ బ్లాక్, డిసెంబర్ నాటికి రైల్వే స్టేషన్ పూర్తి కానుందని తెలిపారు.3 వేల మంది ప్రయాణికులు కూర్చునేలా 3 ఎకరాల్లో వెయిటింగ్ హాల్, క్యాంటిన్ వంటి సదుపాయాలు నిర్మిస్తున్నారన్నారు. శంషాబాద్ ఎయిర్ పోర్టు మాదిరిగానే సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ నిర్మాణం చేపడుతున్నాం. ఈ స్టేషన్‌కు నేరుగా మెట్రో అనుసంధానం చేపడుతున్నాం. బస్ స్టేషన్ కు కూడా నేరుగా చేరుకునేలా ఏర్పాట్లు చేస్తున్నామని వివరించారు. 26 లిఫ్టులు, 32 ఎస్కలేటర్లు, రెండు సబ్ స్టేషన్లు, అడ్వాన్స్ డ్ సెక్యూరిటీ సిస్టమ్ స్టేషన్ లో ఉంటాయని, రోజుకు 5 లక్షల లీటర్ల మురుగు నీటి శుద్ధి కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ పూర్తయితే ప్రతి రోజు 2.7 లక్షల మంది, గంటకు 32 వేల మంది ప్రయాణికులు వచ్చినా ఇబ్బందులు కలగకుండా తీర్చి దిద్దుతున్నామని, 1.65 లక్షల చదరపు మీటర్ల విస్తీర్ణంలో ఈ నిర్మాణం జరుగుతోంది. భవిష్యత్తులో మరింతగా అభివృద్ధి చేసేందుకు మద్దతు ఇస్తామన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ గారి చేతుల మీదుగా స్టేషన్ ను ప్రారంభించుకోవాలనేది నా ఆకాంక్ష. డిసెంబర్ 25 నాటికి మల్టి లెవల్ పార్కింగ్ నిర్మాణం పూర్తి చేయాలని అధికారులకు ఆదేశించానన్నారు.తెలంగాణకు రైల్వే బడ్జెట్ లో కేంద్ర ప్రభుత్వం 2014,15లో రూ.258 కోట్లు కాగా, 2025,26 నాటికి రూ.5,337 కోట్లకు పెరిగాయని. మోదీ గారి హయాంలో దాదాపు 21 రెట్లు పెరిగిందన్నారు. 2014,15 నుంచి 2025, 26 వరకు 11 సంవత్సరాల కాలంలో తెలంగాణకు జరిగిన రైల్వే బడ్జెట్ కేటాయింపుల మొత్తం రూ. 30,832 కోట్లు. 200414 మధ్య 10 సంవత్సరాలలో తెలంగాణలో 136 కి.మీ.ల కొత్త లైన్ల నిర్మాణం జరిగితే, 2014, 25 మధ్య 11 సంవత్సరాల కాలంలో 346 కి.మీ.ల కొత్తలైన్ల నిర్మాణం జరిగిందన్నారు.

# మేడిపల్లిలో సిటీ ట్రైనింగ్ సెంటర్‌కు శంకుస్థాపన

### ముఖ్య అతిథులుగా తెలంగాణ డిజిపి శివధర్ రెడ్డి, రాచకొండ సి పి సుధీర్ బాబు




మేడిపల్లిలో సిటీ ట్రైనింగ్ సెంటర్ శంకుస్థాపనలో పాల్గొన్న డిజిపి శ్రీవధర్ రెడ్డి , రాచకొండ సి పి సుధీర్ బాబు , దివిస్ చైర్మన్ మురళీకృష్ణ తదితరులు

**మేడిపల్లి, నవంబరు 10, ప్రభాతవార్త :** పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ మేడిపల్లిలో నూతనంగా నిర్మితమవుతున్న రాచకొండ కమిషనరేట్ కార్యాలయం ఆవరణంలో సిటీ ట్రైనింగ్ సెంటర్ నిర్మాణానికి భూమి పూజ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథులుగా తెలంగాణ డిజిపి శివధర్ రెడ్డి,రాచకొండ సిపి సుధీర్ బాబు, దివిస్ లేబరేటరీస్ లిమిటెడ్ చైర్మన్ మురళీకృష్ణ తదితరులు పాల్గొని భూమిపూజ చేశారు. కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ ఫండ్స్ సుమారు 4 కోట్ల రూపాయలతో దివిస్ లేబరేటరీస్ లిమిటెడ్ సంస్థ సిటీ ట్రైనింగ్ సెంటర్ ను ఆధ్యాత్మిక హంగులతో నిర్మిస్తున్నారు. ఈ సందర్భంగా డిజిపి శివధర్ రెడ్డి మాట్లాడుతూ మారుతున్న కాలంతో పాటు దొంగతనాలు, నేరాలుచేసే పద్ధతులు మారుతున్నాయని, టెక్నాల జీని ఆసరాగా చేసుకుని రోజురోజుకు సైబర్ క్రైమ్ మోసాలు పెరుగుతున్న నేపథ్యంలో పోలీసులకు ఆధునిక సౌకర్యాలతో అత్యాధునిక పరిజ్ఞానంతో శిక్షణ ఇచ్చేందుకు సిటీ ట్రైనింగ్ సెంటర్ ఉపయోగపడుతుందన్నారు.అనంతరం దివిస్ లేబరేటరీ ప్రతినిధులు మాట్లాడుతూ తమ వంతు సామాజిక బాధ్యతగా అనేక సేవాకార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, ప్రజల సంక్షేమమే పరమావధిగా, శాంతిభద్రతల పరిరక్షణలో నిరంతరం శ్రమిస్తున్న పోలీసులకు అన్ని సౌకర్యాలతో ట్రైనింగ్ సెంటర్ ఏర్పాటు చేయడం తమ యొక్క అదృష్టంగా భావిస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో రాచకొండ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని పోలీసు ఉన్నతాధికారులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# పిఆర్‌సిపై వెంటనే సానుకూల నిర్ణయం తీసుకోవాలి

### ఎస్‌టియు టిఎస్ రాష్ట్ర కౌన్సిల్ తీర్మానం

**హైదరాబాద్, ప్రభాతవార్త, నవంబరు 10:** రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీకి కట్టుబడి పిఆర్‌సిపై సానుకూల నిర్ణయం తీసుకోవాలని ఎస్‌టియు టియస్ రాష్ట్ర కౌన్సిల్ తీర్మానం చేసింది. పిఆర్‌సి గడువు ముగిసి రెండేళ్లయిందని.. వెంటనే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చొరవ తీసుకుని 50 శాతం ఫిట్‌మెంట్‌తో అమలు చేయాలని తీర్మానించారు. రెండు రోజులుగా కాచిగూడలోని ఎస్టీయూ భవన్‌లో సంఘం వార్షిక కౌన్సిల్ సమావేశం జరిగింది. సమావేశంలో రెండో రోజు 2026, 27 సంవత్సరాలకు నూతన రాష్ట్ర కౌన్సిల్‌ను ఎన్నుకున్నారు. నూతన రాష్ట్ర అధ్యక్షులుగా జి సదానందం గౌడ్, ప్రధాన కార్యదర్శిగా జట్టు గజేందర్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో ఇప్పటికే సిపిఎస్‌ను రద్దు చేశాయని, మేనిఫెస్టో హామీకి కట్టుబడి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు డీఎస్సీ 2003 ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలన్నారు. ఉద్యోగుల హక్కులకు భంగం కలగకుండా చూసే బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. టెట్ నుండి మినహాయింపు విద్యా హక్కు చట్టం సవరణ ద్వారా మాత్రమే సాధ్యమవుతుందన్నారు. పెండింగ్ బిల్లుల క్లియరెన్స్‌లో ఆర్థిక శాఖ అలసత్వం సరికాదన్నారు. ప్రభుత్వ, పంచాయతీరాజ్ ఉపాధ్యాయులకు సర్వీస్ రూల్స్ రూల్స్ రూపొందించి, ఎంఈవో, డిప్యూటీ ఈవో, డైట్ లెక్చరర్ పోస్టులకు పదోన్నతులివ్వాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి నేపథ్యంలో ఉద్యోగులంతా ప్రభుత్వానికి సహకరిస్తున్నారని, ప్రభుత్వం కూడా అదే రీతిలో ఉద్యోగుల సమస్యలను సానుకూలంగా పరిష్కరించాలన్నారు. ఉద్యోగ విరమణ పొందిన వారికి రావాల్సిన ప్రయోజనాలు ఇంకా అందకపోవడంతో పెన్షనర్లు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కెజిబివి, ఆశ్రమ, గురుకుల పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. 2026, 2027 సంవత్సరాలకు గానూ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకోవడం జరిగింది. రాష్ట్ర అధ్యక్షులుగా జి.సదానందం గౌడ్, ప్రధాన కార్యదర్శిగా జట్టు గజేందర్ (నిర్మల్), ఆర్థిక కార్యదర్శిగా సయ్యద్ సాబెర్ అలీ (సంగారెడ్డి) జిల్లాల నుండి 8 మంది రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు, 16 మంది ఉపాధ్యక్షులు, 8 మంది అదనపు ప్రధాన కార్యదర్శులు, 16 మంది కార్యదర్శులు, 8 మంది ఆర్థిక కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు.




సోమవారం సోనాటైప్ జిసిసి ప్రారంభ కార్యక్రమ దృశ్యం

## సోనాటైప్ జిసిసి ప్రారంభం

### అమెరికా వెలుపల తొలి గ్లోబల్ సెంటర్

### 200కు పైగా ఇంజనీర్లు, ఎఐ నిపుణులు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,నవంబరు10:** ప్రపంచ ప్రఖ్యాత సాఫ్ట్‌వేర్ సప్లై చైన్ సెక్యూరిటీ కంపెనీ సోనాటైప్ హైదరాబాద్‌లో తన గ్లోబల్ కెపబిలిటీ సెంటర్ (జిసిసి)ను ప్రారంభించింది. సోమవారం జరిగిన ఈ కార్యక్రమానికి ఐటీ ఇండస్ట్రీస్ స్పెషల్ చీఫ్ సెక్రటరీ సంజయ్ కుమార్ హాజరయ్యారు.అమెరికా వెలుపల సోనాటైప్ సంస్థ స్థాపించిన ఇది మొదటి రిసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ సెంటర్ కూడా. హైటెక్ సిటీలో ఏర్పాటు చేసిన ఈ కేంద్రంలో 200కుపైగా దీప్‌టెక్ ఇంజనీర్లు, ప్రోడక్ట్ లీడర్లు, కృత్రిమ మేధస్సు నిపుణులు పనిచేస్తారు.వీరు సురక్షిత సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్, ఓపెన్‌సోర్స్ ఇంటెలిజెన్స్, ఎఐ ఆధారిత సైబర్ సెక్యూరిటీ రంగాల్లో సాంకేతిక ఆవిష్కరణలకు తోడ్పడనున్నారు.సోనాటైప్ ప్రపంచవ్యాప్తంగా ఉన్న ఫార్చ్యూన్ కంపెనీలలో 70 సంస్థలకు సేవలు అందిస్తోంది. 15 మిలియన్లకు పైగా సాఫ్ట్‌వేర్ డెవలపర్ కమ్యూనిటీకి ఇది మద్దతు ఇస్తోంది.ఈ సందర్భంగా కంపెనీ గ్లోబల్ లీడర్‌షిప్ హైదరాబాద్‌లో తమ జిసిసి ప్రారంభించడం పట్ల ఆనందం వ్యక్తం చేసింది.సంజయ్ కుమార్ మాట్లాడుతూ హైదరాబాద్ టెక్నాలజీ ఎకోసిస్టమ్‌లో సోనాటైప్ చేరడం మాకు ఆనందంగా ఉంది. సైబర్ సెక్యూరిటీ రంగంలో ఆవిష్కరణలకు హైదరాబాద్ నుంచి వారు చేస్తున్న కృషి విలువైనదిగా నిలుస్తుంది" అన్నారు. 2024లో హైదరాబాద్ 70 జిసిసిలను ఆకర్షించింది. ఈ క్రమంలో ఈ ఏడాది చివరి నాటికి మరిన్ని 50 జిసిసిలు నగరంలో స్థాపించబడతాయని, దేశవ్యాప్తంగా ఏర్పడుతున్న కొత్త బిదిదిలలో 30–35శాతం హైదరాబాద్‌లోనే వస్తాయని అంచనా. ఏఐ,ఐఓటి,సైబర్ సెక్యూరిటీ వంటి రంగాల్లో నైపుణ్యమైన మానవ వనరులు, సదుపాయాలు, రియల్ ఎస్టేట్, ఆవిష్కరణ వాతావరణంఇవన్నీ హైదరాబాద్‌ను గ్లోబల్ ఇన్నోవేషన్ హబ్‌గా తీర్చిదిద్దుతున్న కీలక అంశాలుగా మారాయి.ఇటీవలి కాలంలో హైదరాబాద్ కేంద్రంగా పలు ప్రధాన జిసిసిలు స్థాపించారు.



సోమవారం అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న కలక్టర్ కుమార్ దీపక్

## అటవీ భూములను ఆక్రమిస్తే కఠిన చర్యలు

### మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

**నస్పూర్, నవంబరు10, ప్రభాతవార్త:** అటవీ భూముల అక్రమ ఆక్రమణలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. సోమవారం జిల్లాలోని నస్పూర్‌లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని కలెక్టర్ ఛాంబర్‌లో డిసిపి ఎ.భాస్కర్, జిల్లా అటవీ అధికారి శివ్ ఆశిష్ సింగ్, బెల్లంపల్లి సబ్ కలెక్టర్ మనోజ్‌లతో కలిసి పోలీస్, రెవెన్యూ, అటవీ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ అటవీ భూముల అక్రమ ఆక్రమణలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. సరైన అనుమతులు లేకుండా అటవీ భూములను ఆక్రమించిన, వృక్షాలను నరికిన క్రిమినల్ కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి అటవీ భూముల రక్షణకు చర్యలు తీసుకోవాలని, నిరంతరం పర్యవేక్షించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో అధికారులు పాల్గొన్నారు.

## వ్యవసాయ సంస్థల మెగా విలీనం

### సహకార వ్యవస్థలూ పునర్వ్యవస్థీకరణ

### ఏకీకృత వ్యవస్థలుగా మార్పు

### సామర్థ్యం పెంపు, ఖర్చుల తగ్గింపే లక్ష్యం

### రాష్ట్ర సర్కార్ కీలక నిర్ణయం

### చివరి దశకు వ్యవసాయ శాఖ వివరణాత్మక నవేదిక

**హైదరాబాద్, నవంబరు 10, ప్రభాతవార్త:** ప్రధాన నిర్మాణాత్మక సవరణలో భాగంగా వ్యవసాయ సంస్థల సామర్థ్యాన్ని మెరుగుపరచడం, పరిపాలనా పరమైన ఖర్చులను తగ్గించడం లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఇందుకు అన్ని రాష్ట్ర స్థాయి వ్యవసాయ సంస్థలను ఒకే ఏకీకృత సంస్థగా విలీనం చేయడాన్ని చురుకుగా పరిశీలిస్తోందని వ్యవసాయ శాఖ అధికారవర్గాలు చెబుతున్నాయి. ఇది రైతులకు ప్రయోజనకారిగా ఉండేలా కార్యకలాపాలను క్రమబద్ధీకరిస్తుందని, ప్రస్తుతం ఈ సంస్థలు ఎదుర్కొంటున్న ఆర్థిక ఒత్తిడిని కూడా పరిష్కరిస్తుందని భావిస్తున్నాయి. ఈ ప్రతిపాదిత ఏకీకరణపై వివరణాత్మక నివేదికను సిద్ధం చేయడంలో వ్యవసాయ శాఖ చివరి దశకు చేరుకుంది. రైతులకు సేవలను అందించడంలో సంస్థాగత ప్రభావాన్ని పెంపొందించడానికి విస్తృత వ్యూహంలో భాగంగా ఈ చర్య తీసుకున్నట్లు వ్యవసాయ అధికారులు చెబుతున్నారు.ప్రభుత్వ నిర్ణయాన్ని మార్గనిర్దేశం చేయడానికి సీనియర్ అధికారులు కార్యాచరణ నమూనా, ఆర్థిక, లాభనష్టాల స్థితిని అంచనా వేస్తూ సమగ్ర నివేదికను రూపొందిస్తున్నారు. తుది నివేదికను సమీక్షి ంచిన తర్వాత, ప్రతిపాదిత విలీనంపై ప్రభుత్వం ఆమోదం తీసుకుంటుందని అధికారవర్గాలు పేర్కొంటున్నాయి. కాగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ నుండి, 22 వేర్వేరు వ్యవసాయ సంబంధిత కార్పొరేషన్లు పనిచేస్తున్నాయి. వీటిలో చాలా సంస్థలు ఇప్పుడు వ్యవసాయ, అనుబంధ కార్యకలాపాల్లో పరిమితి పాత్ర పోషిస్తుండగా, మరోవైపు ఉద్యోగ విరమణ, ఆర్థిక అస్థిరతతో ఇబ్బంది పడుతున్నాయి. ఇటువంటి ముఖ్యమైన సంస్థలలో ఆగ్రో ఇండస్ట్రీస్ కార్పొరేషన్, హైదరాబాద్ అగ్రికల్చరల్ కోఆపరేటివ్ అసోసియేషన్, హార్టికల్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్,వేర్‌హౌసింగ్ కార్పొరేషన్ తదితర సంస్థలు ఉన్నాయి. ఆయా సంస్థలను ఈ ఏకీకరణ చేయడం వెనుక వనరులను ఆప్టిమైజ్ చేయడమే కాకుండా రైతులకు మద్దతు వ్యవస్థలను బలోపేతం చేయడం దిశగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు సీనియర్ అధికారి ఒకరు తెలిపారు. ఈ ఏకీకృత విధానంతో నిర్వహణ, పంట సేకరణ, ఎరువుల పంపిణీ, వేర్‌హౌసింగ్ వంటి విభాగాల్లో మెరుగైన సమన్వయాన్ని సాధ్యం చేస్తుందని భావిస్తున్నారు. ఇదే సమయంలో ప్రతిపాదిత మార్పులు సహకార సంస్థలకు కూడా విస్తరింప చేసేందుకు కార్యాచరణ జరుగుతోంది. ప్రస్తుతం సహకార శాఖ పరిధిలో ఉన్న ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలు (పిఎసిఎస్), మార్కెటింగ్ ఫెడరేషన్ (డిసిఎంఎస్)లను విలీనం చేయడం గురించి చర్చలు కొనసాగుతున్నాయని సహకార శాఖ వర్గాలు తెలిపాయి. ప్రధానంగా వ్యవసాయ ఉత్పత్తులను సేకరించడం మరియు కీలకమైన ఇన్‌పుట్‌లను పంపిణీ చేయడం ద్వారా వ్యవసాయ ఆర్థిక వ్యవస్థకు మద్దతు ఇవ్వడంలో ఈ సంస్థలు కీలక పాత్ర పోషిస్తాయి. ఈ కార్పొరేషన్లలో చాలా వరకు చాలా నిర్దిష్ట చారిత్రక, రాజకీయ సందర్భాలలో స్థాపించబడ్డాయని వీటిని ఆధునిక వ్యవసాయ ప్రాధాన్యతలు, మారుతున్న విధానాలకు అనుగుణంగా అభివృద్ధి చెందాల్సిన అవసరం ఉందని ఆయా వర్గాలు పేర్కొన్నాయి. వీటిపై త్వరలో జరగనున్న తుది నిర్ణయం రాష్ట్రంలో వ్యవసాయ సేవలను అందించే విధానంలో గణనీయమైన మార్పును సూచిస్తుందని వర్గాలు తెలిపాయి. ఇది మరింత సమగ్రమైన, ప్రతిస్పందనాత్మకమైన, స్థిరమైన వ్యవసాయ మౌళిక సదుపాయాలకు మార్గం సుగమం చేస్తుందని వ్యవసాయ, సహకార శాఖ అధికారవర్గాలు వెల్లడిస్తున్నాయి.

# ఢిల్లీ పేలుడుతో దేశ వ్యాప్తంగా హై అలర్ట్

## ట్రై కమిషనరేట్లలో విస్తృతంగా సోదాలు, అనుమానిత వస్తువులను తాకవద్దంటున్న పోలీసులు

**హైదరాబాద్, నవంబరు 10, ప్రభాతవార్త:** ఢిల్లీలోని ఎర్రకోట వద్ద సోమవారం సాయంత్రం సంభవించిన భారీ పేలుడు దరిమిలా హైదరాబాద్ సహా దేశ వ్యాప్తంగా అన్ని మెట్రో నగరాలలో హైఅలర్ట్ ప్రకటించారు. ఈ పేలుడులో 13 మంది మరణించగా 25 మంది గాయపడ్డారు. గాయపడ్డ వారి లో ఐదుగురి పరిస్థితి విషమంగా వుందని అధికారులు చెబుతున్నారు. ఢిల్లీ పేలుడు దరిమిలా హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ కమిషనరేట్లలో పోలీసులు విస్తృతంగా సోదాలు చేబట్టారు. ఢిల్లీ పేలుడు ఘటన వెనుక ఉగ్ర కోణం వుందని అనుమానాలు వస్తుండడంతో ట్రై కమిషనరేట్లలో కీల కమైన ప్రాంతాలలో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. జనవాస ప్రాంతాలతో పాటు అన్ని బస్ స్టేషన్లు, రైల్వే స్టేషన్లు, విమానాశ్రాయల వద్దసా యుధ బలగాలను మొహరించి తనిఖీలు చేస్తున్నారు. ఎక్కడైనా అనుమానిత వస్తువులు వుంటే తాకవద్దని పోలీసులు ఆయా ప్రాంతాల ప్రజలను కోరుతున్నారు. ఉగ్రవాదుల హిట్ లిస్టులో హైదరాబాద్ వుండడంతో జంట నగరాలలో పోలీసుల నిఘాను పెంచారు.

దేశ రాజధాని ఢిల్లీలో సోమవారం సాయంత్రం సంభవించిన భారీ పేలుడు యావత్ దేశాన్ని ఉలిక్కిపడేలా చేసింది. ఢిల్లీ మెట్రో స్టేషన్ సమీపంలో సాయంత్రం ఆరు గంటల 50 నిమిషాలకు ఓ సిగ్నల్ వద్ద రెడ్‌లైట్ వేసి వుండడంతో అక్కడికి వస్తున్న కారు ఆగుతుండగా



ఒక్కసారిగా పేలుడు సంభవించిందని పోలీసు అధికారులు తెలిపారు. ఈ పేలుడు జరిగిన సమయంలో కారులో ఎంత మంది వున్నారనేది తెలియడం లేదు. ఇద్దరికం టే ఎక్కువగానే కారులో వుండివుంటారని పోలీసులు భావిస్తున్నారు. ఈ పేలుడు ధాటికి ఆరు కార్లు రెండు ఆటోలు, ఇంకొన్ని వాహనాలు ధ్వంసం కాగా ఎనిమిది మంది అక్కడికక్కడే మరణించగా మరో ఐదుగురు ఆసుపత్రిలో చనిపోయారు. మరణించిన వారి మృతదేహాలు ఛిద్రమయ్యాయి. ఇదే ఘటనలో మరో 25 మంది గాయపడగా వీరిలో ఐదుగురి పరిస్థితి విషమంగా వుంది. మొదట మెట్రో స్టేషన్ పార్కింగ్ కేంద్రం వద్ద ఆగివున్న కా రులో పేలుడు జరిగిందని భావించినా రెడ్ లైట్ వద్ద ఆగేందుకు వస్తున్న కారులో పేలుడు జరిగిందని నిర్ధారణ అయ్యింది. ఢిల్లీలో ఐఎస్ఐ ఉగ్రవా దుల భారీ కుట్రను సోమవారం ఉదయం పోలీసులు భగ్నం చేసి భారీగా ఆయుధాలు, మందు గుండు సామాగ్రిని జప్తు చేసిన కొన్ని గంటలకే ఈ పేలుడు సంభవించడం పోలీసులను సైతం షాక్‌కు గురిచేసింది. కాగా ఢిల్లీ పేలుడు వెనుక పాకిస్తాన్ ఉగ్రవాదుల హస్తం వుండివుంటుందని నిఘా వర్గాలు అనుమానిస్తున్నాయి. మరో కథనం ప్రకారం ఈ పేలుడుకు ఆత్మాహుతి దళం కారణమని కూడా వార్తలు వస్తున్నాయి. ఆత్మాహుతి దళాల ద్వారా భారత్‌లో పేలుళ్లకు కుట్ర పన్నాలని పాక్ ఉగ్రవాదులు చాలా ఏళ్లగా ప్రయత్నిస్తున్నారు. 2005 దసరా పండగ రోజునలో హైదరాబాద్‌లో బేగంపేట్ టాస్క్‌ఫోర్స్ కార్యాలయంపై పాక్ ఉగ్రవాది ఆత్మాహుతి దాడికి పాల్పడడం తెలిసిందే. ఈ దాడిలో ఉగ్రవాదితో పాటు హోంగార్డు మరణి ంచారు. ఈ ఘటన తరువాత ఆత్మాహుతి దాడుల నివారణలో పోలీసులు చర్యలు ఫలితాలనిచ్చాయి.

కాగా ఢిల్లీ పేలుడు దరిమిలా ట్రై కమిషనరేట్లలో భారీగా సోదాలు చేబట్టారు. నాంపల్లి, సికింద్రాబాద్, కాచిగూడతో పాటు కొత్తగా ఏర్పాటు చేసి న చర్లపల్లి స్టేషన్‌లలో ముమ్మరంగా సోదాలు చేబట్టారు. దీంతో పాటు ఎంజిబిఎస్, ఐబిఎస్‌లలో తనిఖీలు చేస్తున్నారు. శంషాబాద్ విమానాశ్రయం , బేగంపేట్, హాకీంపేట్ విమానాశ్రయాలలోనూ తనిఖీలు చేస్తున్నారు. శంషాబాద్ విమానాశ్రయాలలో ప్రయాణీకులతో పాటు వారి లగేజిని తనిఖీ చేస్తున్నారు. దీంతో పాటు జనావాసం గల ప్రాంతాలు, పార్కులు, కీలక ప్రాంతాలలోనూ పోలీసులు సోదాలు చేస్తున్నారు. సోదాల సమయంలో ఆయా ప్రాంతాల ప్రజలను అప్రమత్తంగా వుండాలని పోలీసులు కోరుతున్నారు. అనుమానిత వస్తువులను ఎవరూ తాకవద్దని కోరుతున్నారు. దీనిపై పోలీసులకు సమాచారం ఇవ్వాలని వారు కోరుతున్నారు.మరోవైపు ఢిల్లీ పేలుడు నేపథ్యంలో పోలీసు ఉన్నతాధికారులు క్షేత్రస్థాయిలోని అధికారుల తో సమావేశమై భద్రతపై సూచనలు చేశారు. అప్రమత్తంగా వుండాలని ఆదేశించారు.

# ఐఎస్ఐ ఉగ్రవాదుల కుట్ర భగ్నం

### ఢిల్లీలో భారీగా పేలుడు పదార్థాలు, ఆయుధాలు స్వాధీనం

### ఎనిమిది మంది ఉగ్రవాదుల అరెస్టు

**హైదరాబాద్, నవంబరు 10, ప్రభాతవార్త:** భారత్‌లోని పలు నగరాలలో వరుసగా దాడులు చేసేందుకు పాకిస్తాన్ ప్రేరేపిత ఐఎస్ఐ ఉగ్రవాదులు ప న్నిన కుట్రను జమ్మూ కాశ్మీర్, ఢిల్లీ, హరియాణా పోలీసులు సంయుక్తంగా ఆపరేషన్ నిర్వహించి భగ్నం చేశారు. ఈ సందర్భంగా ఎనిమిది మంది ఉగ్రవాదులను అరెస్టు చేయడంతో పాటు 2900 కిలోల పేలుడు పదార్థం, భారీగా ఆయుధాలను, మందు గుండు సామాగ్రిని జప్తు చేశారు. పట్టు బడ్డ ఉగ్రవాదులు జమ్మూ కాశ్మీర్‌లో ఉగ్రవాద కార్యకలాపాలు సాగిస్తున్న నిషిద్ధ జైష్ ఏ మహమ్మద్, అన్సార్ ఘజ్‌వత్ ఉల్ హింద్ ఉగ్ర సంస్థలకు చెందిన వారుగా తేలింది. ఇస్లామిక్ స్టేట్స్ ఉగ్రవాదుల కుట్రను గుజరాత్ పోలీసులు రట్టు చేసిన మరుసటి రోజే ఐఎస్ఐ ఉగ్రవాదుల కుట్ర భగ్నం కావడం గమనార్హం.

గత అక్టోబర్ నెల 19వ తేదీన శ్రీనగర్‌లోని బన్‌పొరా నౌగాం ప్రాంతంలో పోలీసులు, భద్రతా బలగాలను లక్ష్యంగా చేసుకుని జైష్ ఏ మహమ్మ ద్ ఉగ్ర సంస్థ వాల్ పోస్టర్లను అంటించాయి. దీనిపై రంగంలో దిగిన శ్రీనగర్ పోలీసులు ఉపా చట్టంతో పాటు జమ్మూ కాశ్మీర్‌లో ఉగ్రవాద నిరోధ క సంస్థ చట్టాల కింద కేసు నమోదు చేశారు. దీనిపై విచారించగా ఉగ్రవాద భావజాలం కలిగిన విద్యార్థులు, ఉన్నత విద్యావంతులతో కూడిన ఓ ఉగ్ర వ్యవస్థ హస్తం వున్నట్లు వెలుగు చూసింది. ఈ బృందానికి పాకిస్తాన్ సహా పలు గల్ఫ్ దేశాలలో పనిచేస్తున్న హ్యాండ్లర్లతో సంబంధాలున్నట్లు తేలింది. కాగా ఉగ్ర వ్యవస్థ సామాజికచ ధార్మిక కార్యక్రమాల ముసుగులో ఓ సంస్థను ఏర్పాటు చేసి ఇందుకు అవసరమైన నిధులను జమ్మూ కా శ్మీర్‌తో పాటు పాకిస్తాన్, పలు గల్ఫ్ దేశాల నుంచి సేకరిస్తున్నట్లు తేలింది. జమ్మూ కాశ్మీర్‌లో యువతలో ఉగ్రవాద భావజాలాన్ని ప్రేరేపించి వారిని ఉగ్ర సంస్థల్లో చేర్పించడం, వారికి కావాల్సిన లాజిస్టిక్స్ ఏర్పాటు చేయడం. ఆయుధాలు, మందు గుండు సామాగ్రి అందించడం, వీలును బట్టి ఐ ఈడీ బాంబుల తయారు చేయడంపై శిక్షణ ఇవ్వడం, వీటికి కావాల్సిన సామాగ్రిని ఎలా సేకరించాలనే దానిపై తర్ఫీదును ఇవ్వడం వంటివి ఈ స ంస్థ చేస్తున్నట్లు తేలింది. ఇందుకోసం సదరు సంస్థ ఎన్‌క్రిప్టెడ్ ఛానెళ్లను వాడేదని పోలీసులు తేల్చారు.

**వైద్యుల అరెస్టుతో ఉగ్ర సంస్థల గుట్టురట్టు**

ఇదిలావుండగా జమ్మూ కాశ్మీర్ సహా దేశంలోని పలు ప్రాంతాలలో ఉగ్ర కుట్రలకు ఉగ్రవాదులు చేసిన ప్రయత్నాలు ముగ్గురు వైద్యుల అరెస్టుతో రట్టయ్యింది. శ్రీనగర్‌లో ఉగ్రవాదులకు అనుకూలంగా వాల్ పోస్టర్లు వేసిన వారిని గుర్తించే పనిలో విచారణ చేబట్టిన పోలీసులకు ఈ పనిచేసింది కా శ్మీర్‌లోని కుల్గాంకు చెందిన డాక్టర్ ఆదిల్, పుల్వామాకు చెందిన డాక్టర్ ముజమ్మిల్ అహ్మద్, యుపిలోని లక్నోకు చెందిన మహిళా వైద్యురాలు డాక్టర్ షాహిన్‌ల అరెస్టు తరువాత ఉగ్రవాదుల కుట్రలు వెలుగు చూశాయి. పుల్వామాకు చెందిన డాక్టర్ ముజమ్మిల్ అహ్మద్ హరియాణాలోని ఫరీదాబాద్ లో ఓ ఇంటిని అద్దెకు తీసుకుని అందులో భారీగా పేలుడు పదార్థాలు, ఆయుధాలను నిలువ చేశాడు. ఈ ఇంటిని పోలీసులు సోదా చేయగా 290 0 కిలోల అమ్మోనియం నైట్రేట్ రసాయనం (దీనిని ఐఈడీ బాంబుల తయారీకి వాడతారు)తో పాటు బెరెట్టా పిస్టల్స్, 20 టైమర్లు, మరో చైనీ పి స్టల్, ఎకె 56, ఎకె క్రింకోవ్ రైఫిళ్లు, మ్యాగజైన్లు, వాకీ టాకీలు లభ్యమయ్యాయి. వీటిని పోలీసులు జప్తు చేశారు. కాగా డాక్టర్ ముజమ్మిల్ యుపి లోని అల్‌ఫలాహ్ విశ్వవిద్యాలయంలో బోధకుడుగా వున్నాడు. కాగా మహిళా వైద్యురాలు డాక్టర్ షాహిన్ కారులో మనో ఎకె 47 రైఫిల్ లభ్యమయ్యి ంది. వీరితో పాటు మరో ఐదుగురిని ఢిల్లీ, హరియాణాలో అరెస్టు చేశారు. ఈ కేసును కేంద్ర హోం శాఖ జాతీయ దర్యాప్తు సంస్థకు బదిలీ చేసింది.

## గుజరాత్‌లో పట్టుబడ్డ టెర్రరిస్టులు అందించిన సమాచారం ఆధారంగా జమ్మూ కాశ్మీర్, ఢిల్లీ, హార్యానాలో ఉగ్రవాదుల అరెస్టు?

**హైదరాబాద్, నవంబరు 10, ప్రభాతవార్త:** భారత్‌లోని పలు నగరాలలో వరుసగా దాడులు చేసేందుకు పాకిస్తాన్ ప్రేరేపిత ఐఎస్ఐ ఉగ్రవాదులు ప న్నిన కుట్రను జమ్మూ కాశ్మీర్, ఢిల్లీ, హరియాణా పోలీసులు సంయుక్తంగా ఆపరేషన్ నిర్వహించి భగ్నం చేశారు. ఈ సందర్భంగా ఎనిమిది మంది ఉగ్రవాదులను అరెస్టు చేయడంతో పాటు 2900 కిలోల పేలుడు పదార్థం, భారీగా ఆయుధాలను, మందు గుండు సామాగ్రిని జప్తు చేశారు. పట్టు బడ్డ ఉగ్రవాదులు జమ్మూ కాశ్మీర్‌లో ఉగ్రవాద కార్యకలాపాలు సాగిస్తున్న నిషిద్ధ జైష్ ఏ మహమ్మద్, అన్సార్ ఘజ్‌వత్ ఉల్ హింద్ ఉగ్ర సంస్థలకు చెందిన వారుగా తేలింది. కాగా వీరి అరెస్టు వెనుక గుజరాత్‌లో అరెస్టయిన ముగ్గురు ఇస్లామిక్ స్టేట్స్ ఉగ్రవాదులు అందించిన సమాచారం కీలకం గా వుందని తెలిసింది. ఐసిస్ ఉగ్రవాదులు అరెస్టయిన మరుసటి రోజే ఐఎస్ఐ ఉగ్రవాదుల కుట్ర భగ్నం కావడం గమనార్హం.

# అన్నికోణాల్లో సమగ్ర దర్యాప్తు

### వాస్తవాలు ప్రజల ముందుంచుతాం: కేంద్రహోంమంత్రి అమిత్‌షా

**న్యూఢిల్లీ, నవంబరు 10:** నగరంలోని ఎర్రకోట సమీపంలో జరిగిన పేలుడు సంఘటనపై అన్ని కోణాల్లో సమగ్ర దర్యాప్తు జరిపిస్తామని కేంద్ర హోంమంత్రి అమిత్‌షా అన్నారు. సాయంత్రం ఏడు గంటలప్రాంతంలో ఎర్రకోట సమీపంలోని సుభాష్ మార్గ్‌ట్రాఫిక్ సిగ్నల్‌వద్ద ఒక కారులోపేలుడు సంభవించిందని, ప్రాథమిక సమాచారంప్రకారం ఈ ఘటనలో కొందరు ప్రాణాలుకోల్పోగా పలువురు పాదచారులు తీవ్ర గాయాలపాలయ్యారని అన్నారు. మరికొన్ని వాహనాలు కూడా ధ్వంసం అయినట్లు కేంద్ర మంత్రి తెలిపారు. సమాచారం అందిన పదినిమిషాల్లోనే ఢిల్లీ క్రైమ్‌బ్రాంచ్, స్పెషల్‌బ్రాంచ్ బృందాలు ఘటనా స్థలానికి చేరుకున్నాయి. ఎన్‌ఎస్‌జీ, ఎన్ఐఎ, ఫోరెన్సిక్‌బృందాలు సమగ్ర దర్యాప్తు ప్రారంభించాయి. సమీపంలోని అన్ని సిసిటివి కెమేరాలను పరిశీలించాలని ఆదేశించామని అమిత్‌షాచెప్పారు. ఢిల్లీ,సిపి, స్పెషల్‌బ్రాంచ్ ఇన్‌ఛార్జితో మాట్లాడానని ప్రస్తుతం ఘటనా స్థలంలోపరిస్థితులను సమీక్షిస్తున్నట్లు తెలిపారు. అన్నికోణాల్లో దర్యాప్తుజరిపి వాస్తవాలుప్రజలముందుంచుతామని అమిత్‌షా చెప్పారు. సంఘటనా స్థలాన్ని పరిశీలించిన తర్వాత లోక్‌నాయక్ జయప్రకాష్‌నారాయణ్ ఆసుపత్రికివెళ్లి క్షతగాత్రులను కూడా పరామర్శించారు. అమిత్‌షా వెంట ఢిల్లీ సీఎం రేఖాగుప్తా, ఢిల్లీహోంమంత్రి ఢిల్లీ కమిషనర్ ఇతర ఉన్నతాధికారులున్నారు.

# ఢిల్లీ పేలుడు వార్తవిని షాకయ్యా..

### గాయపడినవాళ్లు త్వరగా కోలుకోవాలని ప్రార్థిస్తున్నా: కెటిఆర్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్, నవంబర్10:** దేశమంతా ఉలిక్కిపడేలా చేసిన ఢిల్లీ కారు పేలుడుపై భారత రాష్ట్ర సమితి వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం సాయంత్రం ఎర్రకోట(ఢిల్లీ న్యూస్) సమీపంలో జరిగిన భారీ పేలుడు తనను షాక్‌కు గురి చేసిందని ఆయన అన్నారు. ఈ ఘటనలో పలువరు అమాయకులు ప్రాణాలు కోల్పోవడం తనను తీవ్రంగా కలచివేసిందిని కేటీఆర్ ఎక్స్ పోస్ట్‌లో పేర్కొన్నారు. ఢిల్లీలోని ఎర్రకోట మెట్రో స్టేషన్ సిగ్నల్ సమీపంలో జరిగిన పేలుడు వార్త వినిషాకయ్యాను. ఎంతో ఆవేదనకు గురయ్యాను. ఈ ఘటనలో పలువురు అమాయక ప్రజలు మరణించారనే హృదయ విదారకరం. మృతుల, బాధితుల కుటుంబాలకు నా ప్రగాఢ సాను భూతిని తెలియజేస్తున్నాను. పేలుడులో గాయ పడిన వారు త్వరగా కోలుకోవాలని ప్రార్థిస్తు న్నాను అని కేటీఆర్ తన ట్వీట్‌లో రాసుకొచ్చారు.

# పేలుడు ఘటనపై ప్రధానిమోడీకి హోంమంత్రి అమిత్‌షా నివేదిక

### ఎన్ఐఎ, ఫోరెన్సిక్, ఎన్ఎస్‌జి ఇతర దర్యాప్తులసంస్థలన్నీ రంగంలోకి

### ఢిల్లీపోలీస్ కమిషనర్ సతీష్‌నుంచి సమగ్రనివేదిక తీసుకున్న అమిత్‌షా

**న్యూఢిల్లీ, నవంబరు 10:** రాజధానినగరంలోని ఎర్రకోట వద్దజరిగిన పేలుడు సంఘటనపై ప్రధాని మోడీ ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహిం చారు. ముందు సంఘటన వివరాలనుకేంద్ర హోంమంత్రి అమిత్‌షా ప్రధానమంత్రికి వివరించారు. పేలుడు సరిగ్గా 6.52 గంటలకు జరిగిందని, నెమ్మదిగా కదులుతూ వచ్చిన కారు ఎర్రకోట గేట్‌నంబర్‌వన్ మెట్రోస్టేషన్‌వద్దకు రాగానే కారులో పేలుడు సంభవించిందని వివరించారు. బహుశా ఆ కారు మారుతి స్విఫ్ట్ కారు అని కూడా వివరించారు. పేలుడులో 10 మంది చనిపోగా 24 మంది గాయపడ్డారు. వీరందరిని లోక్‌నాయక్ జయప్రకాష్ ఆసుపత్రికితరలించినట్లు వివరించారు. దర్యాప్తు ఏజెన్సీలన్ని కూడా ఎర్రకోట పేలుడు సంఘటన ప్రాంతానికి చేరి పరిస్థితిని సమీక్షిస్తున్నట్లు హోంమంత్రి ప్రధానికి వివరించారు. అమిత్‌షా కూడా ఢిల్లీ పోలీస్ కమిషనర్‌తో మాట్లాడారు. అలాగే ఇంటెలిజెన్స్ బ్యూరోతో మొత్తం పరిస్థితిపై ఆరాతీసారు. ఎన్ఐఎ, ఎన్ఎస్‌జి, ఫోరెన్సిక్ సైన్సెస్ టీమ్‌లతోపాటు ఆ సంస్థల చీఫ్‌లను కూడా ఆప్రాంతానికి వెళ్లి దర్యాప్తులో సాయంచేయాలని ఆదేశించారు. ఢిల్లీపోలీస్ కమిషనర్ సతీష్ గోల్చా కూడా పేలుడు సంఘటన వివరాలను మొత్తం హోంమంత్రికి వివరించారు.

# కల్తీనెయ్యిలో కీలకం గత టిటిడి బోర్డు పెద్దలే!

### మార్కెటింగ్, కొనుగోళ్లవిభాగం అధికారులనుండి సిట్ కీలక సమాచారం

**తిరుమల,నవంబర్ 10ప్రభాతవార్తప్రతినిధి:** దేవుని లడ్డూల తయారీలో 2020నుండి 2024వ సంవత్సరం వరకు కల్తీనెయ్యి సరఫరా జరిగిన కేసులో కీలకంగా గత టిటిడి బోర్డు పెద్దలే ఉన్నారనేది సిబిఐ సిట్ అధికారులు రాబట్టిన సమాచారం. ఈ కేసులో టిటిడి మార్కెటింగ్ విభాగం, కొనుగోళ్ళకమిటీలో అధికారుల నుండి సిట్ రాబట్టిన సమాచారంతో ఇప్పుడు ఇటీవల సిట్ అరెస్ట్‌చేసిన చిన్నఅప్పన్న, అజయ్‌కుమార్‌లను కస్టడీకి తీసుకునేందుకు ఏసిబి కోర్టులో పిటిషన్‌లు దాఖలు చేశారు. దీనిపై ఏసిబి న్యాయమూర్తి కస్టడీకి అప్పగిస్తే తదుపరి ఎవరి పేర్లు బయటకు రానున్నాయనేది తెలిసినా సిట్ అధికారికంగా స్పష్టతనీయలేదు. ఇప్పటికే కల్తీనెయ్యిలో గత బోర్డు ఛైర్మన్ వైవి సుబ్బారెడ్డికి సంబంధించిన బ్యాంకు లావాదేవీల వివరాలను సమర్పించాలని సిట్ ఆదేశించింది. మరీ న్యాయమూర్తి ఆదేశాలతో తదుపరి సిట్ చర్యలకు సిద్ధమవుతోంది. కల్తీనెయ్యి సరఫరా చేసిన బాగోతంలో రానున్న రోజుల్లో కీలకంగా వ్యవహరించిన కొందరు సూత్రధారులతోబాటు టిటిడి అధికారుల పాత్ర ను తేల్చేయనుంది. గతంలోనే టిటిడికి తిరుమల లడ్డూలకు అవసరమైన నెయ్యి సరఫరాకు టెండర్లు పిలవడం, టెండర్లలో పాల్గోన్న డెయిరీ సంస్థల యాజమాన్యం టిటిడి నిబంధనలు ఉల్లంఘించి నాణ్యతలేని నెయ్యిసరఫరాచేయడం వెనుక కీలక వ్యక్తులు పట్టుకోవడం సిట్‌కు సాహసంతో కూడిన విషయం.


గత టిటిడి బోర్డు పెద్దలు,మాజీ అధికారుల అరెస్ట్ తప్పదనేది తెలుస్తోంది. ఈ వారంలో సిట్ దర్యాప్తు, ఎవరిని పిలిచి అరెస్ట్ చేయనుందనేది టిటిడిలో హాట్‌టాఫిక్‌గా మారింది. కల్తీనెయ్యి సరఫరాచేసిన పాపంలో అసలు సూత్రధారులైన గత టిటిడి పెద్దల అవినీతిగుట్టు రట్టయ్యే అవకాశం కూడా ఉండటంతో సిబిఐ సిట్ అధికారులు అన్ని కోణాల్లో కార్యాచరణ సిద్ధంచేసుకొంటున్నారు.

# దేశ విద్యా రంగానికి పునాదులు వేసిన మౌలానా అబుల్ కలాం ఆజాద్: సిఎం రేవంత్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్, నవంబర్10:** స్వతంత్ర భారత దేశ తొలి విద్యా శాఖ మంత్రిగా పని చేసి దేశ విద్యా రంగానికి పునాదులు వేసిన ఘనత మోలానా అబుల్ కలాం ఆజాద్‌కే దక్కుతుందని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి కొనియాడారు. దేశ తొలి విద్యా శాఖ మంత్రి మోలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి (జాతీయ విద్యా దినోత్సవం మైనారిటీ సంక్షేమ దినోత్సవం) సందర్భంగా విద్యారంగ ప్రగతికి ఆజాద్ చేసిన సేవలను ముఖ్యమంత్రి స్మరించుకున్నారు. సెంట్రల్ అడ్వైజరీ బోర్డ్ ఆఫ్ ఎడ్యుకేషన్ ఛైర్మన్‌గా, వయోజన అక్షరాస్యత, సార్వత్రిక ప్రాథమిక విద్య, 14 సంవత్సరాల్లోపు బాలబాలికలందరికీ నిర్బంధ ఉచిత విద్య, వృత్తి శిక్షణ తో పాటు యూనివర్సిటీ గ్రాంట్ కమిషన్ ఏర్పాటు వంటి విభిన్న విధానాలతో దేశంలో విద్యారంగ ఆభివృద్ధికి ఆజాద్ ఎంతగానో కృషి చేశారని సీఎం రేవంత్ రెడ్డి కొనియాడారు. ఆయన జయంతి రోజును (నవంబరు 11వ తేదీ) జాతీయ విద్యా దినోత్సవంగా జరుపుకుంటు న్నామని తెలిపారు. మోలానా ఆజాద్ స్ఫూర్తితో రాష్ట్ర ప్రభుత్వం విద్యా రంగంలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టిందన్నారు. అందులో భాగంగానే గ్రామీణ, నిరుపేద విద్యార్థులకు అంతర్జాతీయ స్థాయిలో నాణ్యమైన ఉచిత విద్య అందించేందుకు ప్రతి నియోజకవర్గంలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ నిర్మిస్తున్నట్లు ముఖ్యమంత్రి తెలిపారు. ఐటీఐ లను అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ఆధునిక సాంకేతిక కేంద్రాలుగా (ఏటీసి) అప్ గ్రేడ్ చేశామని, యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటుతో పాటు ఉపాధ్యాయులు, లెకర్చర్ల నియామకంతో రాష్ట్రంలో విద్యాభివృద్ధికి పాటుప డుతున్నామని సీఎం తెలిపారు. జాతీయోద్య మంలో పాల్గొనడంతో పాటు అఖిల భారత కాంగ్రెస్ కమిటీకి అధ్యక్షునిగా ఆజాద్ ఎనలేని సేవలు అందించారని సీఎం కొనియాడారు. ఖిలాఫత్ ఉద్యమములో పాల్గొని బ్రిటిష్ సామ్రాజ్యవాదానికి వ్యతిరేకముగా పోరాడారని, జాతీయోద్యమములో హిందూ ముస్లిం ఐక్యతను కోరుకొని దేశ విభజనను వ్యతిరేకించారని సీఎం గుర్తు చేసారు. స్వాతంత్ర అనంతరం మైనారి టీలకు గొంతుక గా నిలిచారని, ఆజాద్ జయం తిని మైనార్టీ సంక్షేమ దినోత్సవంగా జరుపు కుంటున్నామని,ప్రజా ప్రభుత్వంలో మైనార్టీల సంక్షేమానికి పెద్దపీట వేశామని తెలిపారు. మైనా ర్టీల సంక్షేమం కోసం ప్రజా ప్రభుత్వం నూత నంగా ఇందిరమ్మ మైనారిటీ మహిళా యోజన రేవంతన్నా కా సహారా కింద ఫకీర్ పథకాలు ప్రారంభించి నిధులు కేటాయించామన్నారు.

# భారత్‌కు హాని కలిగితేనే పాక్‌కు సంతృప్తి

### దాయాది తీరుపై ఆర్ఎస్ఎస్ చీఫ్ ధ్వజం



**నాగ్‌పూర్, నవంబరు 10:** భారత్ ఎల్లప్పుడూ శాంతినే కోరుకుంటుందని, పొరుగు దేశాలతో సఖ్యతతో మెలగాలని కోరుకుంటుందని ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్ పేర్కొన్నారు. అయితే, పొరుగు దేశమైన పాకిస్థాన్ మాత్రం మనతో శాంతియుతంగా ఉండాలని అనుకోవడం లేదని ఆయన ఆరోపించారు. భారత దేశానికి హాని కలిగించడం ద్వారానే పాక్ సంతృప్తి చెందుతుందని అన్నారు. ఈ పరిస్థితుల్లో మనం ఎల్లప్పుడూ శాంతి కోరుకోవడం మంచిది కాదని, పాక్ కు అర్థమయ్యే భాషలోనే జవాబివ్వడం మంచిదని స్పష్టం చేశారు. పాకిస్థాన్ కు నష్టం కలిగేలా ప్రతిసారీ ఓడిస్తూనే ఉండాలని చెప్పారు. అప్పుడు పాక్ శాశ్వతంగా పశ్చాత్తాపం చెందక తప్పదని అన్నారు. శాంతిని కోరుకోని వారికి అశాంతిని రుచి చూపించడం ద్వారానే బుద్ధి చెప్పాలని అన్నారు. 1971లో భారత సైన్యం ధాటికి పాకిస్థాన్ 90వేల మంది సైనికులను కోల్పోయిందని, అయినా సరే ఆ దేశ పాలకులకు బుద్ధి రాలేదని విమర్శించారు. భారత్ ను తాము చేయగలిగింది ఏమీలేదని పాక్ కు అర్థమయ్యే వరకూ ప్రతి దాడి చేయాలన్నారు. సరిహద్దుల్లో నిరంతరంఅప్రమత్తంగా ఉండాలని, పాక్ కుట్రల ను సమర్థవంతంగా తిప్పికొట్టాలని ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా నిజాయతీగల స్నేహితుడిగా భారత్ కు సహకరిస్తేనే మీకు మేలు కలుగుతుందని పాకిస్థాన్ కు భగవత్ హితవు పలికారు.

# ప్రత్యేక వివాహ చట్టంపరిధిలో పెళ్లిళ్లకు దరఖాస్తుల వెల్లువ

### బెంగాల్‌లో ఆరంభం కానున్న 'సర్' కట్టడికే ఈ కసరత్తులు



**కోల్‌కత్తా, నవంబరు 10:** పశ్చిమ బెంగాల్‌లో ఒక కొత్త, అనూహ్య పరిణామం చోటుచేసు కుంటోంది. రాష్ట్రంలోని ముస్లిం జంటలు, ప్రత్యేకించి బంగ్లాదేశ్, బీహార్ సరిహద్దు జిల్లాల్లో, తమ వివాహాలను 'ప్రత్యేక వివాహ చట్టం1954' (ఎస్ఎంఏ) కింద నమోదు చేసుకునేందుకు పెద్ద సంఖ్యలో ముందుకొస్తున్నారు. సాధారణంగా మతాంతర వివాహాలు చేసుకునేవారు లేదా సివిల్ పద్ధతిలో పెళ్లి చేసుకోవాలనుకునేవారు ఈ చట్టాన్ని ఆశ్రయిస్తారు. అయితే, రాష్ట్రంలో త్వరలో జరగనున్న ఓటర్ల జాబితా ప్రత్యేక పరిశీలనపై ప్రజల్లో పెరుగుతున్న ఆందోళనలే ఈ మార్పుకు కారణమని ప్రభుత్వ అధికారులు భావిస్తున్నారు. ప్రభుత్వ గణాంకాల ప్రకారం, నవంబర్ 2024 నుంచి అక్టోబర్ 2025 మధ్య కాలంలో 1,130 ముస్లిం జంటలు ప్రత్యేక వివాహ చట్టంలోని సెక్షన్ 16 కింద తమ పెళ్లిళ్లకోసం దరఖాస్తు చేసుకున్నారు. ఇందులో సగానికి పైగా, అంటే 609 దరఖాస్తులు, కేవలం జులై నుంచి అక్టోబర్ 2025 మధ్యలోనే రావడం గమనార్హం. పొరుగున ఉన్న బీహార్‌లో కూడా ఇదే సమయంలో ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియ జరగడం, ఇప్పుడు బెంగాల్‌లో ఈ ప్రక్రియ ప్రారంభం కానుండటంతో ఈ ధోరణి పెరిగింది. సాధారణంగా బెంగాల్‌లో ముస్లిం వివాహాలు బెంగాల్ మహమ్మదీయ వివాహాలు, విడాకుల రిజిస్ట్రేషన్ చట్టం1876 ప్రకారం ప్రభుత్వంతో నియమితులైన ఖాజీల ద్వారా జరుగుతాయి. ఈ సర్టిఫికెట్లు చట్టబద్ధమైనవే అయినప్పటికీ, వాటి ఫార్మాట్లలో తేడాలు, చిరునామా ధ్రువీకరణలో స్పష్టత లేకపోవడం వంటి సమస్యలున్నాయి. దీంతో పలు ప్రభుత్వ, ప్రైవేటు సంస్థలు వీటిని బలమైన గుర్తింపు రుజువుగా అంగీకరించడానికి వెనుకాడుతున్నట్లు తెలుస్తోంది. ప్రత్యేక వివాహ చట్టం కింద జారీ చేసే సర్టిఫికెట్ దేశవ్యాప్తంగా ఒకే ఫార్మాట్‌లో ఉండి, సర్వత్ర గుర్తింపు పొం దింది. దీనిని మరింత అధికారికమైన, నమ్మ కమైన పత్రంగా పరిగణిస్తారు. ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణలో భాగంగా, అధికారులు 2002 నాటి జాబితాతో ప్రస్తుత వివరాలను సరిచూస్తున్నారు. వివరాలు సరిపోలకపోతే, అదనపు గుర్తింపు, నివాస ధ్రువీకరణ పత్రాలు సమర్పించాల్సి ఉంటుంది. ఈ నేపథ్యంలో, బీహార్‌లో జరిగిన ప్రక్రియ బెంగాల్ సరిహద్దు ప్రజల్లో ఆందోళనను పెంచిందని, అందుకే తమ రాష్ట్రంలో పరిశీలన ప్రారంభం కాకముందే, ముం దుజాగ్రత్త చర్యగా బలమైన, ప్రామాణికమైన వివాహ ధ్రువపత్రాన్ని పొందేందుకు వారు ప్రయత్నిస్తున్నారని అధికారులు విశ్లేషిస్తున్నారు.

# మాలిలో టిక్‌టాక్‌స్టార్‌ను కాల్చిచంపిన జీహాదీలు

**బమాకో, నవంబరు 10:** పశ్చిమాఫ్రికా దేశమైన మాలిలో జిహాదీ ఉగ్రవాదులు దారుణానికి పాల్ప డ్డారు. సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ టిక్‌టాక్‌లో వీడియోలు పోస్ట్ చేస్తూ పాప్యులర్ అయిన ఒక యువతిని కిడ్నాప్ చేసి, బహిరంగంగా కాల్చి చంపారు. సైన్యానికి గూఢచారిగా పనిచేస్తోందన్న ఆరోపణలతో ఈ దారుణానికి ఒడిగట్టారు. ఈ ఘటనతో దేశవ్యాప్తంగా తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తమవుతోంది. ఉత్తర మాలిలోని టింబక్టు ప్రాంతంలోని టోంకా నగరానికి చెందిన 'మరియమ్ సిస్సే' అనే యువతి టిక్‌టాక్‌లో స్థానిక విశేషాలపై వీడియోలు చేస్తూ మంచి గుర్తింపు తెచ్చుకుంది. ఆమెకు సుమారు 90 వేల మంది ఫాలోవర్లు ఉన్నారు. అయితే, గురువారం కొందరు జిహాదీలు ఆమెను అపహరించారు. మాలి సైన్యంకు తమ కదలికల గురించి ఆమె సమాచారం చేరవేస్తోందని ఆరోపించారు. ఆ మరుసటి రోజే అంటే శుక్రవారం మరియమ్‌ను



ఒక మోటార్‌బైక్‌పై టోంకా నగరంలోని ఇండిపెండెన్స్ స్క్వేర్‌కు తీసుకొచ్చారు. అక్కడి జ న స వ మూ హ ం చూస్తుండగానే ఆమెను తుపాకీతో కాల్చి చంపారు. వారు నా సోదరిని చంపేటప్పుడు నేను ఆ గుంపులోనే ఉన్నానని ఆమె సోదరుడు ఆవేదనతో వెల్లడించారు. ఈ ఘటనను ఓ భద్రతా అధికారి ధ్రువీకరించారు. మాలి సైన్యం కోసం జిహాదీలను వీడియో తీస్తోందని ఆరోపిస్తూ మరియమ్ సిస్సేను బహిరంగంగా హత్య చేశారు. ఇది అత్యంత అనాగరికమైన చర్యఅని ఆయన పేర్కొన్నారు. స్థానిక అధికారులు కూడా ఈ హత్యను "నీచమైన చర్య"గా అభివర్ణిస్తూ తీవ్రంగా ఖండించారు. 2012 నుంచి మాలి దేశం జిహాదీ ఉగ్రవాదంతో పోరాడుతోంది.

# జోగి రమేష్‌పై మరికొన్ని కేసులు: రంగం సిద్ధం చేసిన సిఐడి

విజయవాడ,నవంబరు 10,ప్రభాతవార్తప్రతినిధి: ఆంధ్రప్రదేశ్‌లో నకిలీ మద్యం తయారీ కేసు ఇప్పటికే అరెస్ట్ అయిన వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత,మాజీ మంత్రి జోగి రమేష్ పై మరిన్ని కేసుల నమోదు సీఐడీ సిద్ధమవుతుంది. ప్రస్తుతం నెల్లూరు జిల్లా జైలులో రిమాండులో .జోగి రమేష్ ఉన్నారు..ఆయన మరిన్ని కేసులు నమోదుకు రంగం సిద్ధమైనట్లుగా తెలుస్తోంది. తాజాగా అగ్రి గోల్డ్ భూముల కొనుగోలులో అక్రమాలపై కూడా మాజీ మంత్రి జోగి రమేష్‌పై సిఐడీ కొత్త కేసు నమోదు చేయనుంది ..అగ్రిగోల్డ్ భూముల అమ్మకాల్లో జోగి రమేష్ పాత్ర ఉన్నట్లు ఇప్పటికే గుర్తించినట్లు సిఐడీ అధికారులు ప్రకటించారు.

పెడనలో కూడా భూములు క్రయ విక్రయాల్లో జోగి రమేష్పుఐ పలు ఫిర్యాదులు అందాయని చెబుతున్నారు

వీటిపై కూడా కేసు నమోదు చేసే అవకాశాలు సిఐడీ అధికారులు పరిశీలిస్తున్నట్లుగా తెలుస్తోంది.నకిలీ మద్యం తయారీ కేసులో వైసిపి సీనియర్ నేత,మాజీ మంత్రి జోగి రమేష్‌తో పాటు ఆయన సోదరుడు జోగి రామును కూడా పోలీసులు అరెస్ట్ చేసిన విషయం విదితమే. ఎన్టీఆర్ జిల్లా ఇబ్రహీంపట్నం లోని ఆయన నివాసంలో తెల్లవారుజామున జోగి రమేష్‌ను సిట్,పోలీసు, ఎక్సైజ్ సిబ్బందితో కూడిన ప్రత్యేక బృందాలు అదుపులోకి తీసుకున్నాయి. కాగా, ఉద్దేశ్యపూర్వకంగానే తప్పును వీడియోలతో జోగి రమేష్‌ను ఈ కేసులో ఇరికించారని వైసీపీ నేతలు ఆరోపిస్తున్నారు,

గతంలో...కూడా వైసీపీ నేతలను అరెస్ట్ చేసి...వరుసగా కేసులు నమోదు చేసి జైలు నుంచి బయటకు రాకుండా చాలా రోజులు ఇబ్బంది పెట్టారని ఇప్పుడు జోగి రమేష్ విషయంలో కూటమి సర్కార్ అదే తీరుగా ముందుకు పోతోందని వైసీపీ నేతలు ఫైర్ అవుతున్నారు.

**అందెశ్రీ మృతిపై ఏపీ సీఎం,డిప్యూటీ సిఎం దిగ్భ్రాంతి**

తెలంగాణ చరిత్రలో చిరస్మరణీయంగా నిలిచారు.

# కెటిఆర్ పిటీషన్‌పై హైకోర్టులో విచారణ

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్, నవంబర్10:** సైఫాబాద్ పోలీస్ స్టేషన్లో తనపై నమోదైన కేసును కొట్టివేయాలని కోరుతూ బిఆర్ఎస్ కేటీఆర్ దాఖలు చేసిన పిటిషన్‌పై హైకోర్టు విచారణ చేపట్టింది.

రాజకీయ కక్షల కారణంగానే కేసు నమోదు చేశారని ఆయన తరపు న్యాయవాది కోర్టుకు తెలిపారు. ఎన్నికల కోడ్ ఉల్లంఘించినందుకే కేసు నమోదు చేసినట్లు పోలీసుల తరపు న్యాయవాది వాదించారు. ఎలాంటి అనుమతి లేకుండా అమరవీరుల స్మారకం వద్ద గోరటి వెంకన్నను కేటీఆర్ ఇంటర్వ్యూ చేశారని, అందులో భారత రాష్ట్ర సమితికి లబ్ధి చేకూరేలా అంశాలు ఉన్నాయని వాదించారు.

అనుమతి లేకుండా డ్రోన్ ఎగురవేశారని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. ఎఫ్ఐఆర్‌లో నమోదు చేసిన సెక్షన్లు కేసుకు సరిపోలడం లేదని హైకోర్టు వ్యాఖ్యానించింది.

తదుపరి విచారణను వచ్చే వారానికి వాయిదా వేసింది.

# ముందు అవగాహన.. ఆ తర్వాతే చలానా

**ట్రాఫిక్ నిబంధనల అమల్లో సరికొత్త మోడల్ అమలు**
**రోడ్డు ప్రమాదాలు, తొక్కిసలాటలు, అగ్నిప్రమాదాల నివారణపై ఫోకస్ పెట్టండి**
**ఆర్టీజీఎస్‌పై సమీక్షలో ఎపి సిఎం చంద్రబాబు ఆదేశాలు**

**విజయవాడ నవంబర్ 10, ప్రభాతవార్తప్రతినిధి:** రోడ్డు ప్రమాదాల నివారణపై పూర్తి స్థాయిలో ఫోకస్ పెట్టాలని అధికారులకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సూచించారు. నిబంధనల ఉల్లంఘనలపై అవగాహన కల్పించిన తర్వాతే చలానా విధించే అంశాన్ని పరిశీలించాలని స్పష్టం చేశారు. సచివాలయంలో సోమవారం ఆర్టీజీఎస్‌పై ముఖ్యమంత్రి సమీక్షించారు. హెల్మెట్ లేకుండా వాహనాలు నడిపే వారికి దాని ఆవశ్యకతను వివరించాలని సూచించారు. భారీ ఎత్తున చలానాలు వేయాలన్న అధికారుల ప్రతిపాదనలను సీఎం సున్నితంగా తిరస్కరించారు. చలానాలు వేసి ప్రజలను భయ భ్రాంతులకు గురి చేయడం సరికాదన్నారు. ఈ క్రమంలో హెల్మెట్ లేకుండా వాహనాలు నడపడం వల్ల ఎక్కువ ప్రమాదాలు జరుగుతున్నాయని అధికారులు సీఎం దృష్టికి తెచ్చారు. ముందుగా హెల్మెట్లు, సీట్ బెల్ట్ లేకుండా వాహనాలు నడిపే వారికి అవగాహన కల్పించడంతోపాటు... వారు నిబంధనలను ఉల్లంఘిస్తున్నారనే విషయాన్ని వారి ఫోన్లకు మెసేజీలు పంపాలని సూచించారు. ఆ తర్వాత కూడా వారి నిబంధనలు ఉల్లంఘిస్తుంటే అప్పుడు చలానాలు వేయాలని స్పష్టం చేశారు. దీని వల్ల నిబంధనలు ఉల్లంఘించిన వారికి తాను తప్పు చేసినందు వల్లే చలానాలు వచ్చాయనే భావన కలుగుతుందని చెప్పారు. ఇందులో కేరళ రాష్ట్రాన్ని ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా ఇటీవల కాలంలో జరిగిన వరుస రోడ్డు ప్రమాదాలు, తొక్కిసలాట, అగ్ని ప్రమాదాలు వంటి అంశాలను సీఎం ప్రస్తావించారు. ఇలాంటివి జరగ్గకుండా ఉండేలా పూర్తి స్థాయిలో అధ్యయనం చేసి... నిర్మాణత్మక ప్రణాళికను తయారు చేయాలని నిర్దేశించారు. దీనికి సంబంధించి ఎస్ఓపీలను సిద్ధం చేసి వారం రోజుల్లోగా అందివ్వాలని సీఎం అధికారులను ఆదేశించారు. జన సమూహాల్లో తొక్కిసలాటలు జరగకుండా క్రౌడ్ మేనేజ్మెంట్‌ను పటిష్టంగా అమలు చేయాలన్నారు. సీసీ కెమెరాల ద్వారా రోడ్డు ప్రమాదాలను ఏ మేరకు నియంత్రించగలమనే అంశాన్ని కూడా విశ్లేషించాలని చెప్పారు. రాష్ట్రంలో గుంతలు లేని రహదారులు, డ్రైనేజీలు, నీటి నిర్వహణ, ఉద్యోగ, ఉపాధి కల్పన, పంటలకు మద్దతు ధర... ఇవే తన ప్రాధాన్యతలని స్పష్టంగా చెప్పారు. అధికారులు ఈ అంశాలపై ప్రత్యేక దృష్టి పెట్టి ప్రాధాన్యతలకు అనుగుణంగా పని చేయాలని సూచించారు. ఇప్పటికీ రోడ్లు సరిగా లేవనే ఫీడ్ బ్యాక్ వస్తుందని అలా జరగకుండా చూసుకోవాలని చెప్పారు. గత పాలనలో రహదారుల నిర్వహణ కూడా పట్టించుకోలేదని... ఆ నిధులను వేరే కార్యక్రమాలకు మళ్లించారన్నారు. అందువల్లే రహదారులు దారుణంగా ఉన్నాయన్నారు. కారణలేమైనా.. రోడ్లపై గుంతల్లేకుండా చూడాల్సిన బాధ్యత కూటమి ప్రభుత్వం ఉందన్నారు. తక్షణం ఈ పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. ఇదే విధంగా డ్రైనేజీల నిర్వహణ కూడా సరిగ్గా చేపట్టాలన్నారు. నిర్వహణ సరిగా లేకపోవడం కారణంగా నీళ్ల నిలిచిపోయే పరిస్థితి రాకూడదని సీఎం స్పష్టం చేశారు. అలాగే రాష్ట్ర వ్యాప్తంగా జాబ్ మేళాలు నిర్వ హించాలన్నారు. వాటి గురించి నిరుద్యోగ యువతకు తెలిసేలా విస్తృతంగా ప్రచారం చేపట్టాలని ముఖ్యమంత్రి సూచించారు. ఇక రైతులు పండించిన పంటలకు మద్దతు ధర కల్పించాలని, రైతులకు సమస్య లేకుండా చూడాలని ఆదేశించారు.


ఆర్టీజీఎస్‌పై సమీక్షలో ఎపి ముఖ్యమంత్రి చంద్రబాబు

## వ్యక్తిగత హాజరు మినహాయింపు ఇవ్వాలన్న జగన్ అభ్యర్థనపై కౌంటరు దాఖలు చేయండి

### సిబిఐకి హైకోర్టు ఆదేశాలు

**విజయవాడ,నవంబరు 10,ప్రభాతవార్తప్రతినిధి:** వ్యక్తిగత హాజరు మినహాయింపు ఇవ్వాలన్న వైఎస్ జగన్ అభ్యర్థనపై కౌంటరు దాఖలు చేయాలని సీబీఐని హైదరాబాద్ సీబీఐ కోర్టు ఆదేశించింది. గత నెలలో యూరప్ పర్యటనకు వెళ్లేందుకు జగన్‌కు సీబీఐ కోర్టు అనుమతి ఇచ్చింది. అయితే యూరప్ నుంచి వచ్చిన తర్వాత ఈనెల 14 వరకూ వ్యక్తిగతంగా వచ్చి పర్యటన వివరాలు తెలపాలని జగన్‌కు సీబీఐ కోర్టు షరతు విధించింది. యూరప్ వెళ్లి వచ్చిన జగన్ వ్యక్తిగత హాజరు నుంచి మినహాయింపు ఇవ్వాలని కోరుతూ సీబీఐ కోర్టులో పిటిషన్ వేశారు. తాను కోర్టుకు వస్తే భద్రత కోసం ప్రభుత్వం ఏర్పాట్లు చేయాల్సి వస్తుందని తెలిపారు. అందుకే హాజరు నుంచి మినహాయింపు ఇవ్వాలని లేదా వీడియో కాన్ఫరెన్స్ ద్వారా హాజరుకు అనుమతివ్వాలని కోరారు. జగన్ అభ్యర్థనపై స్పందించాలని సీబీఐని ఆదేశిస్తూ న్యాయస్థానం విచారణను రేపటికి వాయిదా వేసింది. యూరప్ పర్యటనకు వెళ్లి వచ్చాక కోర్టులో హాజరుకావాలన్న ఉత్తర్వును ఉపసంహరించుకోవాలని కోరుతూ అక్రమాస్తుల కేసులో ప్రధాన నిందితుడైన వైఎస్ జగన్ గత గురువారం హైదరాబాద్ సీబీఐ కోర్టులో మెమో దాఖలు చేశారు. అక్టోబరు 1 నుంచి 30లోగా 15 రోజులపాటు జగన్ యూరప్ పర్యటన నిమిత్తం సీబీఐ కోర్టు అనుమతి ఇస్తూ వెళ్లే ముందు పర్యటన వివరాలు, ఫోన్ నంబరు, ఈమెయిల్ వివరాలు సమర్పించాలన్నారు.



## అలిపిరి మెట్లమార్గంలో కార్మికుల మాంసాహార భోజనం

**తిరుమల,నవంబర్ 10ప్రభాతవార్తప్రతినిధి:** పవిత్రతను కాపాడి భక్తుల మనోభావాలు పరిరక్షించాల్సిన కార్మికులు నిబంధనలు ఉల్లంఘించి ఆదివారం రోజు మాంసాహార భోజనాన్ని ఏకంగా అలిపిరి మెట్లమార్గంలో తినడంతో భక్తులు ఆందోళన వ్యక్తం చేశారు. పవిత్రతకూ తూట్లుపొడిచిన ఈ ఘటన కలకలంరేపింది. అలిపిరి మెట్లమార్గంలో కాంట్రాక్టు పారిశుధ్య కార్మికులు మాంసాహార భోజనం తింటుండగా కొందరు భక్తులు సెల్‌ఫోన్‌లలో వీడియోలు తీశారు. ఈ వీడియోలను టిటిడి వెబ్‌సైట్‌లో,వాట్సాప్‌కు పంపడంతో టిటిడి అధికారులు వెంటనే స్పందించారు. ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు నరసమ్మ, రామస్వామిలుగా గుర్తించారు. వెంటనే వారిపై చర్యలు తీసుకుని విధుల్లోంచి తప్పించారు. దీనిపై తిరుమల 2టౌన్ పోలీసులకు ఫిర్యాదు కూడా చేశారు. దీనిపై టిటిడి అధికారులు కూడా అధికారికంగా ప్రకటన వెలువడించారు. జరిగిన తప్పిదంపై వెంటనే వారిని తొలగించామని తెలిపింది.

## కెఎ పాల్‌పై సుప్రీంకోర్టు ఆగ్రహం

**విజయవాడ,నవంబరు 10,పభాతవార్త** ప్రతినిధి: ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కెఎ పాల్‌పై సుప్రీం కోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. ఏపీలో మెడికల్ కాలేజీలను పీపీపీ విధానంలో నిర్వహించాలనే ఏపీ ప్రభుత్వం నిర్ణయాన్ని సవాల్ చేస్తూ ఆయన సుప్రీం కోర్టులో పిటీషన్ దాఖలు చేశారు. మీడియాలో ప్రచారం కోసం పిటీషన్లు దాఖలు చేస్తున్నారని జస్టిస్ సూర ్యకాంత్ ధర్మాసనం ఘాటుగా వ్యాఖ్యానించింది. దీనిపై హైకోర్టును ఆశ్రయించాలని కేఏ పాల్‌కు సూచించింది.

# ఢిల్లీ విమాన సర్వీసుల అంతరాయానికి జిపిఎస్ స్పూఫింగ్ కారణం?

## దర్యాప్తు ప్రారంభించిన అజిత్ దోవల్ కార్యాలయం

**న్యూఢిల్లీ, నవంబర్ 10:** ఢిల్లీ విమానాశ్రయంలో సాంకేతిక సమస్య కారణంగా గతవారం 800 విమాన సర్వీసులకు అంతరాయం ఏర్పడింది. దానికి రెండురోజుల ముందు జిపిఎస్ స్పూఫింగ్ జరిగి ఉండవచ్చన్న అను మానాలు వ్యక్తమయ్యాయి. ఈ క్రమంలోనే జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోబాల్ కార్యాలయం దర్యాప్తు ప్రారంభించింది. ఢిల్లీ ఐజిఐ ఎయిర్‌పోర్టు దేశంలోనే అత్యంత రద్దీ విమానాశ్రయం. ఇక్కడ నుంచి నిత్యం దాదాపు 1500లకు పైగా విమానాలు రాకపోకలు సాగిస్తాయి. ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్ డేటాకు అనుసంధానంగా ఉండే ఆటోమేటిక్ మెసేజ్ స్విచింగ్ సిస్టమ్‌లో సాంకేతిక సమస్య వల్ల విమానాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. దీనికి ముందు తమకు తప్పుడు నావిగేషన్ డేటా అందినట్లు కొందరు పైలట్లు వెల్లడించినట్లు తెలుస్తోంది. అది కూడా దేశ రాజధానికి 60 నాటికల్ మైళ్ల వ్యాసార్థంలో ఇలాంటి పరిస్థితి తలెత్తినట్లు పేర్కొన్నారు. ఇక ఎన్ఎస్ఎ కార్యాలయంలోని నేషనల్ సైబర్ సెక్యూరిటీ కో ఆర్డినేటర్.. జాతీయ స్థాయిలో సైబర్ సెక్యూరిటీ అంశాలను సమన్వయపరుస్తుంది. ప్రస్తుతం ఎన్‌సిఎస్‌సికి నవీన్‌కుమార్‌సింగ్ నాయకత్వం వహిస్తున్నారు. ఈ స్పూఫింగ్ జరిగి ఉంటే ప్రస్తుత దర్యాప్తు ద్వారా దానికి గల కారణం, దానికి ఎంతవరకు అవకాశం ఉందనే అంశాలను పరిశీలించనున్నారు. అలాగే ఇటీవలి విమానాల అంతరాయం వెనుక సాంకేతిక సమస్య, సైబర్ దాడి, అంతర్జాతీయ జోక్యం వంటి కారణాలు ఏమైనా ఉన్నాయా? అని దర్యాప్తు చేయనున్నారు. డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్, ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా ఈ దర్యాప్తులో భాగమయ్యాయి.

# పుట్టపర్తికి ప్రధాని రాక నేపథ్యంలో భారీ భద్రతా ఏర్పాట్లు

## శతజయంతి వేడుకల ఏర్పాట్లపై ఎపి సిఎం చంద్రబాబు సమీక్ష



**విజయవాడ,నవంబర్ 10. ప్రభాతవార్తప్రతినిధి:** శ్రీసత్యసాయిబాబా శత జయంతి ఉత్సవాలను పురస్కరించుకుని ఈ నెల 19న పుట్టపర్తికి ప్రధానమంత్రి నరేంద్రమోదీ, 22వ తేదీన రాష్ట్రపతి ద్రౌపది ముర్ము రానున్న నేపథ్యంలో పటిష్ట ఏర్పాట్లు చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశించారు. రాష్ట్రపతి సహా వివిధ ప్రముఖులు హాజరుకానున్న దృష్ట్యా ఎలాంటి అవాంతరాలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. సత్యసాయిబాబా జయంతి వేడుకల నిర్వహణపై సచివాలయంలో మంత్రులు, సీఎస్ విజయానంద్, అధికారులతో ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు. పుట్టపర్తికి ప్రముఖులు రానున్న నేపథ్యంలో పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేపట్టాలని, పట్టణాన్ని సుందరంగా అలంకరించాలని సీఎం సూచించారు. ఏర్పాట్ల పర్యవేక్షించేందుకు మంత్రుల కమిటీ పుట్టపర్తిలో పర్యటించాలని ఆదేశించారు. శ్రీ సత్యసాయి శత జయంతి ఉత్సవాలను ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తున్నందుకు ఎలాంటి లోటుపాట్లు లేకుండా చూడాలని మంత్రులకు సీఎం దిశానిర్దేశం చేశారు. సత్యసాయిబాబా మహాసమాధి దర్శన నిమిత్తం పుట్టపర్తి నిలయానికి వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకోవాలని సీఎం ఆదేశించారు. వచ్చే వాహనాలకు పార్కింగ్‌తో పాటు పట్టణంలో రాకపోకల ఇబ్బంది లేకుండా చూడాలని సీఎం స్పష్టం చేశారు. బాబా మహాసమాధి దర్శనానికి ఎంత మంది భక్తులు రావచ్చనేదానిపై అంచనా వేసి అందుకు తగ్గట్లుగానే ఏర్పాట్లు చేయాలన్నారు. భక్తుల కోసం అవసరమైన మేరకు ఆర్టీసీ బస్సులను సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు. ముందుస్తు జాగ్రత్తగా మెడికల్ క్యాంపులు సైతం ఏర్పాటు చేసుకోవాలని సీఎం సూచించారు. పుట్టపర్తిలోని వేర్వేరు ప్రాంతాల్లో 10 మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేస్తున్నట్టు అధికారులు సీఎంకు తెలియజేశారు. పారిశుద్ధం విషయంలో ఎలాంటి నిరక్ష ్యం ఉండకూడదని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. పుట్టపర్తికి వచ్చే భక్తులకు చిన్నపాటి ఇబ్బందులూ తలెత్తకుండా చర్యలు చేపట్టినట్లు అధికారులు సీఎంకు వివరించారు. పారిశుద్ధం నిర్వహణకు 250 మంది సిబ్బంది, వచ్చే భక్తులకు తాగునీరు, ఆహారం, మరుగుదొడ్లు

## ఎపిలోని సూక్ష్మ, చిన్న మధ్య తరహా పరిశ్రమలకు సాంకేతిక అత్యాధునిక యంత్రాలు

### కామన్ ఫెసిలిటీ సెంటర్ల ద్వారా సౌకర్యాల కల్పన

**విజయవాడ,నవంబరు 10,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రం లోని సూక్ష్మ,చిన్న మధ్య తరహా(ఎంఎస్ఎంఈ) పరిశ్రమలకు సాంకేతిక అత్యాధునిక యంత్రాలను అందుబాటులోకి తేవాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఒకే తరహా ఉత్పత్తులు చేసే పరిశ్రమలు ఉన్న క్లస్టర్లలో ప్రభుత్వ నిధులతో కామన్ పెసిలిటీ సెంటర్ల(సీఎఫ్‌సీ) ఏర్పాటుకు నిర్ణయించింది. ఒక్కో దానికి రూ.10 కోట్ల వరకు ప్రభుత్వం భరిస్తుంది. రూ.200 కోట్లతో ప్రాజెక్టును సిద్ధం చేసింది. రాష్ట్రంలో కనీసం 100 సీఎఫ్‌సీల ఏర్పాటును లక్ష్యంగా నిర్ధేశించింది. చిన్న పరిశ్రమల నిర్వాహకులపై మూలధన పెట్టుబడి భారాన్ని తగ్గించడంతో పాటు అంతర్జాతీయ మార్కెట్‌లో పోటీపడేలా తీర్చిదిద్దాలనేది ప్రభుత్వ ఆలోచనచేస్తుంది. ఒక్కో సిఎఫ్‌సీకి రూ.10 కోట్ల వరకు ప్రభుత్వం ఇస్తుంది. దీని కోసం 10 మంది సూక్ష్మ చిన్న పరిశ్రమల నిర్వాహకులు ప్రత్యేక వాహన నౌక (ఎస్‌పీవీ)ని ఏర్పాటు చేయాలి. సీఎఫ్‌సీ నిర్వహణను ఎస్‌పీవీ పర్యవేక్షిస్తుంది. యంత్రాల కొనుగోలుకు చేసే ఖర్చులో 80 శాతం రాష్ట్ర ప్రభుత్వం భరిస్తుంది. సిఎఫ్‌సీ లోని యంత్రాలు, సాంకేతికత వినియోగించుకున్న యూనిట్ల నుంచి నామమంత్రంగా సర్వీసు ఛార్జీలు వసూలు చేసి, ఆ మొత్తాన్ని నిర్వహణను ఎస్‌పీవీ వినియోగిస్తుంది. సీఎఫ్‌సీ ఏర్పాటకుకు తక్కువ వ్యవధిలో అవసరైన అనుమతులను ప్రభుత్వం ఇస్తుందని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు. చిన్న పరిశ్రమలు ఏర్పాటైన తర్వాత యంత్రాలు ,సాంకేతికతలో వస్తున్న మార్పులను అందిపుచ్చుకునేందుకు ఆర్థిక పరిస్థితి వారికి సహకించడం లేదు.

వాటిలోనే ఉత్పత్తి చేస్తుండటం పట్ల నిర్వహణ వ్యయం పెరుగుతోంది. నాణ్యమైన ఉత్పత్తులు సాధ్యం కావడం లేదు.

ఇదే సమయంలో అదే ఉత్పత్తులను కార్పొరేట్ సంస్థలు తక్కువ ధరకు మార్కెట్‌లో అందుబాటులోకి తెస్తున్నాయి. అవి ఆధునాతన యంత్రాలను (ఆటోమేషన్)వినియోగించడం వల్ల తక్కువ సమయంలో ఎక్కువ వస్తు ఉత్పత్తి జరుగుతోంది. దీంతో కార్పొరేట్ సంస్థలతో ధరల్లో పోటీ పడే స్థాయి ఎంఎస్ఎంఈలకు ఉండటం లేదు. ఆ సమస్యలను సీఎఫ్‌సీల ద్వారా పరిష్కారం లభించనుంది. డిజైన్లు,పరిశోధన,

అభివృద్ధిఅత్యాధునిక సదుపాయాలు క్వాలిటీ కంట్రోల్ సెంటర్లునైపుణ్య శిక్షణముడిసరకు డిపోలు,ఉత్పత్తుల విక్రయాలు..మార్కెటింగ్ డిస్‌ప్లే సెంటర్లు పరిశ్రమలకు వచ్చే మరికొన్ని ప్రయోజనాలుడిజైన్లలో వచ్చే మార్పులు,టెస్టింగ్, శిక్షణ సహా విస్తృత శ్రేణి సేవలు అందుబాటులో ఉంటాయి.కామన్

నీటి శుద్ధి ప్లాంటు వ్యవస్థ ఉంటుంది. అంతర్జాతీయ మార్కెట్‌తో

పోటీ పడేలా ఉత్పత్తుల తయారీ వంటి సీఎఫ్‌సీల్లో ఉండే సౌకర్యాలుగా అధికారులు చెబుతున్నారు.

# కాంగ్రెస్ ఎన్నికల కోడ్ ఉల్లంఘించి డబ్బులు పంపిణీ చేస్తుంది

## సిఇఒ సుదర్శన్‌రెడ్డిని కలిసి ఫిర్యాదు చేసిన హరీశ్‌రావు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి** హైదరాబాద్,నవంబర్10: జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఇష్టారాజ్యంగా మద్యాన్ని ప్రవహింపజేస్తూ, విచ్చలవిడిగా డబ్బులు పంపిణీ చేస్తుందని మాజీ మంత్రి హరీశ్‌రావు తెలిపారు. లక్షకు పైగా చీరలు, మిక్సీ గ్రైండర్లను పంపిణీ చేస్తుందని పేర్కొన్నారు. వీటన్నింటికీ సంబంధించిన ఫొటోలు, వీడియో ఆధారాలను ఎలక్షన్ కమిషన్‌కు సమర్పించామని తెలిపారు. అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని ఎన్నికల కమిషన్‌ను కోరామని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల కోడ్ ఉల్లంఘించి డబ్బులు పంపిణీ చేస్తుందంటూ సోమవారం బీఆర్కే భవన్‌లో సీఈవో సుదర్శన్‌రెడ్డిను కలిసి ఫిర్యాదు చేశారు. అనంతరం హరీశ్‌రావు మీడియాతో మాట్లాడుతూ.. కొంతమంది పోలీసులు, ఇతర అధికారులు అధికార పార్టీకి తొత్తులుగా మారిపోయారని విమర్శించారు. వారిపై పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని అన్నారు. అధికార పార్టీ ఎన్ని ప్రయత్నాలు చేసినా జూబ్లీహిల్స్ ఓటర్లు తెలివైన వారు అని.. తగిన రీతిలో కాంగ్రెస్‌కు బుద్ధి చెబుతారని అన్నారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో జరుగుతున్న అన్ని విషయాలను ఎలక్షన్ కమిషన్ దృష్టికి తీసుకొచ్చామని తెలిపారు. సున్నితమైన పోలింగ్ కేంద్రాల వివరాలను ఈసీకి అందజేసి, ఆయా బూత్‌ల్లో కేంద్ర బలగాలను పెట్టాలని కోరామన్నారు. ముఖ్యంగా మహిళా పోలీసు అధికారులు, ఆశ, అంగన్‌వాడీ వర్కర్లను నియమించి, లోపలికి వెళ్లే ఓటర్ల ఐడెంటిటీని గుర్తించాలని.. ఆ తర్వాతే వారిని పోలింగ్ బూత్‌లోకి అనుమతించాలని కోరామని తెలిపారు. ఓటర్ ఐడీ గుర్తించకుండా ఓటర్లను పోలింగ్ బూత్‌లకు పంపించకూడదని సూచించారు.

# తిరుమల సమాచారం

## కొండపై ఉన్న సిసికెమెరాలు ఐసిసిసితో అనుసంధానం

- క్యూలైన్ల నిర్వహణ మరింత పటిష్టం - అదనపు ఇఒ వెంకయ్యచౌదరి



**తిరుమల,నవంబర్ 10ప్రభాతవార్తప్రతినిధి:** ప్రముఖ హిందూ పుణ్యక్షేత్రం తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయానికి రోజూ లక్షమందివరకు భక్తులు వస్తుండటంతో భద్రతను మరింత కట్టుదిట్టంచేసే స్థాయిలో టిటిడి అధికారులు కఠిన చర్యలకు ఉపక్రమించారు.ఇందులో భాగంగా దర్శన క్యూలైన్లను పటిష్టంగా నిర్వహించడంతోబాటు వైకుంఠం క్యూకాంప్లెక్స్,నారాయణగిరి షెడ్లు, లోపల,బయట క్యూలైన్లలోని సిసికెమెరాలను ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌తో అనుసంధానం చేయాలని టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి అధికారులను ఆదేశించారు. ఈ ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను మరింతగా బలోపేతం చేసేందుకు అధునాతన సాంకేతిక అభివృద్ధిచేసేందుకు చర్యలుతీసుకోవడంపై అధికారులతో ఆయన చర్చించారు. భక్తుల కదలికలపై ,భక్తుల గణాంకాలను ఎప్పటికప్పుడు విశ్లేషించి నిర్ణయాలు తీసుకుని సదుపాయాలు కల్పించేలా చూడాలన్నారు. సోమవారం తిరుమలలోని వైకుంఠం క్యూకాంప్లెక్స్‌లో ఉన్న ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను టిటిడి సివిఎస్ఒ కెవి మురళీకృష్ణ, వింగ్ వివిఎస్ఒ ఎన్టీవిరామ్‌కుమార్, విఎస్ఒ అల్లంసురేంద్ర, ఐటి జిఎం ఫణికుమార్‌నాయుడు,డిప్యూటీ ఇఒ లోకనాథం, డిజిఎం ఐటి వెంకటేశ్వర్‌నాయుడు, కార్య ఫౌండేషన్ సంస్థ ప్రతినిధులు జయప్రసాద్,రవి తదితరులతో అదనపు ఇఒ వెంకయ్యచౌదరి సమీక్షించారు. విజిలెన్స్, వైకుంఠం, ఆలయ సిబ్బంది క్యూలైన్లలో భక్తుల సౌకర్యాలు, రద్దీ తదితరవాటిని నిరంతరం పర్యవేక్షించడం సులభమవుతుందన్నారు.

## స్వామివారి ఆశీస్సులందుకున్నా : జస్టిస్ రజని



**తిరుమల,నవంబర్ 10ప్రభాత వార్తప్రతినిధి:** కార్తీక మాసంలో సోమవారం రోజు శ్రీవేంకటేశ్వర స్వామిని దర్శించుకోవడం మన స్సు ఆనందంగా ఉందని రాష్ట్ర ఉప లోకాయుక్త జస్టిస్ పి.రజని తెలిపారు. విఐపి బ్రేక్‌లో ఆమె కుటుంబంతో కలసి ఆలయం లోనికి చేరుకుని స్వామి వారిని దర్శించుకున్నారు.

## తిరుమల, తిరుపతిలో భద్రత దళాలు నిఘా



**తిరుమల,నవంబర్ 10ప్రభాతవార్తప్రతినిధి:** దేశరాజధాని ఢిల్లీనగరంలో సోమవారం సాయంత్రం ఎర్రకోటవద్ద భారీ బాంబులు పేలడంతో పుణ్యక్షేత్రాల్లో హై అలర్ట్ ప్రకటించింది. కేంద్ర హోంశాఖ ఆదేశాలతో రాష్ట్ర హోంశాఖ ఉన్నతాధికారులు తిరుపతి జిల్లా పోలీసులను అప్రమత్తం చేసింది. తిరుపతి జిల్లా ఎస్పీ లంకెల సుబ్బరాయుడు ఆగమేఘాలపై తిరుమల,తిరుపతితోబాటు శ్రీకాళహస్తి క్షేత్రాల్లో పోలీస్ అధికారులను, ఏఆర్ బలగాలను, ఆక్టోపస్ దళాలను రంగంలోకి దించారు. తిరుమల ఆలయం పరిసరాల్లో మరింతగా నిఘా పెంచారు. తిరుమలకు వచ్చే అలిపిరి టోల్‌గేట్‌లో,కొండపై జిఎన్‌సి టోల్‌గేట్‌లో ఆక్టోపస్ దళాలు పహరాకాస్తూ వాహనాలను తనిఖీ చేస్తున్నారు.ఇదిలా ఉంటే ఇప్పటికే ఆధ్యాత్మిక నగరం, యాత్రాస్థలం తిరుపతినగరంలో గతంలో కొద్దిరోజులుగా నకిలీ మెయిల్స్ బాంబు బెదిరింపులు భయపెట్టాయి. వెంటనే పోలీసు అధికారులు, బాంబుడిస్పోజల్ టీమ్ పోలీసులు, పోలీసు జాగిలాలు అణువణువూ నిశితంగా తనిఖీలు చేశారు. ఎక్కడా ఎలాంటి బాంబులు లేవని తేలడంతో అంతా ఊపిరిపీల్చుకుంటున్నారు. తిరుమల తిరుపతి నగరం ప్రాముఖ్యతతో 24గంటలూ పోలీసు విభాగంఅప్రమత్తంగా వ్యవహరిస్తూ ఉంది. నగరం శివార్లలో, ప్రధాన వాణిజ్యసంస్థలు, హోటళ్ళు, లాడ్జీలు, స్టార్‌హోటళ్ళు, నగరానికి ప్రధాన ప్రవేశ కూడళ్ళు, నగరం అంతా అత్యాధునిక నిఘానేత్రాలు దేగకళ్ళతో పహరాకాస్తున్నాయి. ఈ నేపథ్యంలో సాంకేతిక పరిజ్ఞానం పోలీసులు మరింతగా వినియోగించుకుని ప్రజలకు భద్రత కల్పిస్తున్నారు. నగరంలో డ్రోన్ కెమెరాలతో కూడా పోలీసు యంత్రాంగం 24గంటలూ పహరాకాస్తోంది. ఇప్పుడు కేంద్రహోంశాఖ హెచ్చరికలతో మరింతగా అలర్ట్ అయ్యారు.

## నిందితుడి పట్ల ఉదాసీనత ఎందుకు చూపారు?

**- ఎఫ్ఐఆర్ తరువాత అరెస్ట్ చేయలేదెందుకు?**
**- పోలీసు అధికారులను విచారణ చేసిన సిఐడి**




**తిరుపతి,నవంబర్ 10ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమల పరకామణిలో 2023 ఏప్రిల్‌నెలలో అమెరికన్ డాలర్లు చోరీ కేసుపై ఎఫ్ఐఆర్ చేసినా నిందితుడైన సివి రవికుమార్‌ను ఎందుకు అరెస్ట్ చేయలేక పోయారని, ఈ కేసులో నిందితుడిపట్ల ఉదాసీనత చూపాల్సిన అవసరం ఏ ముందని సిఐడి అధికారులు పూర్వ తిరుమలలో పనిచేసిన ప్రస్తుత విఆర్‌లో ఉన్న సిఐ జగన్మోహన్‌రెడ్డిని, ఎస్ఐ లక్ష్మీరెడ్డిని ప్రశ్నించినట్లు సమాచారం. ఈ కేసులో మీపై ఎవరైనా ఒత్తిడి చేశారా,టిటిడి అధికారులు ,అప్పటి బోర్డు కలుగజేసుకుందా అనే ప్రశ్నలు సంధించి సమాధానాలు రాబట్టినట్లు తెలిసింది. చట్టపరంగా మీకున్న అధికారాలను ఎందుకు ఉపయోగించుకోలేకపోయారని అడిగిన దానికి సమాధానం తీసుకున్నట్లు, ఈ వ్యవహారం మొత్తం పరకామణి కేసు దర్యాప్తు చేపట్టిన సిఐడి బృందం వీడియో రికార్డు చేసినట్లు తెలుస్తోంది. 2023 ఏప్రిల్‌లో పరకామణిలో గుమస్తాగా ఉన్న సివి రవికుమార్ ఏకంగా 920 విదేశీ డాలర్లు, 11నోట్లు చోరీ చేసిన తరువాత అప్పటి ఏవిఎస్ఒ సతీశ్‌కుమార్ ఫిర్యాదుపై ఎలా స్పందించారని వివరాలు సేకరించారు. తదనంతరం ఆధారాలు సేకరించి ఎఫ్ఐఆర్ చేసిన తరువాత చట్టప్రకారం నిందితుడ్ని ఎందుకు అరెస్ట్ చేయలేదనేది కీలకంగా వివరాలు రాబట్టడం విశేషం. పూర్తిస్థాయిలో ఆధారాలు ఎందుకు సేకరించలేకపోయారని, నిందితుడి నుండి సమగ్ర కేసు వివరాలు రాబట్టలేకపోవడం వెనుక ఆంతర్యమేమని ప్రశ్నించడం తెలుస్తోంది. అయితే ఏవిఎస్ఒ ఈ కేసులో ఫిర్యాదిదారుడు కావడంతో టిటిడి నిబంధనల మేరకు కేసులో మధ్యవర్తిత్వం జరిపి రాజీచేసుకునే పరిస్థితులు వివరించారని వెల్లడించినట్లు సమాచారం. చివరకు మూడునెలల్లోనే లోక్‌అదాలత్‌లో కేసు రాజీ చేసుకున్నారని ఈ తతంగం మొత్తం టిటిడి అధికారుల నుండి ఏవిఎస్ఒ వివరణమేరకు జరిగిందని పోలీస్ అధికారులు వివరించినట్లు తెలిసింది. పూర్వ టిటిడి విజిఒగా పనిచేసిన ప్రస్తుత డిఎస్పీ గిరిధర్ కూడా ఈ కేసులో కేవలం నిమిత్తమాత్రులమేనని,టిటిడిలో ఉన్నతాధికారులు, బోర్డు కీలకమని సిఐడి దృష్టికి తీసుకొచ్చినట్లు సమాచారం. ఈ వ్యవహారంలో ఎవరికీ దురుద్దేశ్యం లేదని, టిటిడి అధికారుల సూచనల మేరకు అన్ని జరిగాయని పోలీస్ అధికారులు వివరించినట్లు తెలుస్తోంది. ఇప్పుడు టిటిడి పూర్వ అధికారులను విచారణకు పిలుస్తారా లేక మళ్ళీ నిందితుడు రవికుమార్‌కు సంబంధించి పూర్తి వివరాలు సిఐడి బృందం దర్యాప్తు చేసి హైకోర్టుకు నివేదిక సమర్పించేందుకు త్వరత్వరగా ముందుకు కదులుతోంది. ఈ కేసులో గత పోలీస్ అధికారులను సిఐడి విచారణ చేయడంతో టిటిడిలో ఉలిక్కిపడుతున్నారు. రవికుమార్ ఆస్తుల వివరాలను సిఐడి సేకరించే పనిలో నిమగ్నమైంది. గత టిటిడి బోర్డు సభ్యులు, గత టిటిడి అధికారుల గుండెల్లో భయం పట్టుకుందని తెలుస్తోంది.

## ఇండియన్ రోడ్ కాంగ్రెస్ అధ్యక్షుడుగా ఆర్ అండ్ బి శాఖ ఇఎన్సీ జె.మోహన్ నాయక్ ఎంపిక

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి** హైదరాబాద్,నవంబర్10: ఆర్ అండ్ బి శాఖ ఇంజనీర్ ఇన్ చీఫ్ జె.మోహన్ నాయక్ కు అరుదైన గౌరవం దక్కింది. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తరుపున ఐఆర్‌సి సదస్సులో పాల్గొన్న ఈఎన్సి మోహన్ నాయక్ బృందం ఆర్ అండ్ బి శాఖ మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి ఆదేశాల మేరకు హైదరాబాద్ లో 85వ ఐఆర్‌సి నిర్వహించేలా కృషి చేశారు. కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీకి రాసిన లేఖలు,పలు మార్లు మంత్రి ప్రత్యేకంగా జరిపిన సంప్రదింపులు ఫలితంగా 2026 ఐఆర్‌సి సదస్సు తెలంగాణలో నిర్వహించేందుకు కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ అంగీకరించారు. దీనిపై మంత్రి ఇప్పటికే కేంద్ర మంత్రికి ధన్యవాదాలు తెలిపారు. కాగా, ఇండియన్ రోడ్ కాంగ్రెస్ ప్రెసిడెంట్ గా ఆర్ అండ్ బి శాఖ ఈఎన్సి జె.మోహన్ నాయక్ ను సోమవారం భువనేశ్వర్ లో జరిగిన ఐఆర్‌సి కౌన్సిల్ మీటింగ్‌లో ప్రకటించారు. వచ్చే ఏడాది హైదరాబాద్ లో జరగనున్న ఐఆర్‌సికి జె.మోహన్ నాయక్ నాయకత్వం వహించనున్నారు.

## మెడ నలుపు తగ్గాలంటే !



వ్యక్తిగత పరిశుభ్రత పాటించకపోవడం, వాతావరణ కాలుష్యం, పలు దీర్ఘకాలిక సమస్యలు.. సైతం అందానికి ఆవరోధాలుగా మారుతుంటాయి. మెడ చుట్టూ నల్లగా మారడం కూడా ఇలాంటిదే! అయితే ఈ సమస్యను కొన్ని ఇంటి చిట్కాల ద్వారా తగ్గించుకోవచ్చని చెబుతున్నారు నిపుణులు. **పెరుగుతో..** కొద్దిగా పెరుగు తీసుకొని దానికి కొన్ని చుక్కల నిమ్మరసాన్ని కలపాలి. ఈ మిశ్రమాన్ని మెడపై రాసుకొని పది నుంచి పదిహేను నిమిషాల పాటు ఆరనివ్వాలి. ఆ తర్వాత శుభ్రం చేసుకోవాలి. పెరుగు మాయిశ్చరైజర్ పనిచేయడంతో పాటు చర్మంపై పేరుకున్న మురికిని తొలగిస్తుందట. **ఇవి కూడా**

✦ కొద్దిగా కొబ్బరి నూనెను తీసుకొని.. దానికి కొన్ని చుక్కల నీళ్లు కలపాలి. ఈ మిశ్రమంతో మెడను కాసేపు మర్దన చేసుకొని వేడినీటితో కడిగేసుకోవాలి. కొబ్బరి నూనెకు బదులుగా బాదం, ఆలివ్ నూనెలను కూడా వాడచ్చంటున్నారు నిపుణులు.

✦ నిమ్మరంస, రోజ్ వాటర్‌లను సమపాళ్లలో కలిపి రోజూ రాత్రి నిద్రపోయే ముందు మెడకు రాసుకోవాలి. ఉదయం చల్లటి నీటితో శుభ్రం చేసుకోవాలి. ఇలా రోజూ చేస్తూ ఉంటే మెడపై ఏర్పడిన నలుపు క్రమంగా తగ్గిపోతుందట.

✦ బాదం నూనెను గోరువెచ్చగా వేడిచేసి, దాంతో పది నిమిషాల పాటు మెడను మర్దన చేసుకున్నా మంచి ఫలితం కనిపిస్తుందని చెబుతున్నారు నిపుణులు. ◻

## ఈ తప్పులు వద్దు..



ఒకప్పుడు అమ్మా నాన్నలు పిల్లల్ని కొట్టినా తిట్టినా క్రమశిక్షణలో పెట్టడానికే అన్నట్లు ఉండేది. కాలం మారింది. పేరెంటింగ్‌లోనూ మార్పులు వచ్చాయి. మారుతున్న పరిస్థితులకు తగ్గట్టు ఈతరం అమ్మా నాన్నలు చిన్నారులపై అంచనాలు పెట్టుకుంటున్నారు. వాటిని సాధించేలా పిల్లల్ని ప్రేరేపిస్తున్నారు. దీన్నే 'టాక్సిక్ పేరెంటింగ్' అంటున్నారు నిపుణులు. దీని వల్ల కొత్త సమస్యలు తలెత్తుతున్నాయట. "చదువులో మంచి మార్కులు రావాలి. ఆటల్లో ముందుండలంటూ చాలానే అంచనాలు పెట్టుకుంటున్నారు తల్లిదండ్రులు. చిన్నారులు వాటిని సాధించగలిగితే సరి. ఏదీ వెనకబడినా అక్కడే మొదలవుతుంది చిక్కు ఓడిపోయా రనో, మార్కులు తగ్గాయనో వెంటనే పిల్లల్ని 'నీకు ఏం చేతకాదు' అంటూ మాటలతో చిన్నబుచ్చుతుంటారు. ఇలా వాళ్ల లక్ష్యాలపై దృష్టి పెట్టలేక మిమ్మల్ని సంతోషపెట్టాలనే ఉద్దేశంతో మాత్రమే ముందుడుగు వేస్తారట. అది వాళ్ల భవిష్యత్తుపైన తీవ్ర ప్రభావం చూపుతుందట. ✦ పిల్లలు ఎప్పుడూ సానుకూలంగానే ఆలోచించాలి అనుకుంటారు ఈ తరం అమ్మానాన్నలు. చిన్నారులు ఎదిగే వారిలో ప్రతికూల ఆలోచనలూ వస్తుంటాయి. ఆ సమయంలో తల్లి దండ్రులు వారిపై కోపంతో విరుచుకుపడొద్దు. సమరస్యంగా వ్యవహరించాలి. అప్పుడే వాళ్లకి మంచిచెడుల మధ్య తేడా తెలుస్తుంది. ✦ ఇంకొంతమంది క్రమశిక్షణ పేరుతో కఠినమైన ఆంక్షల మధ్య చిన్నారులను పెంచుతుంటారు. ఇది వారి స్వేచ్ఛకు భంగం కలిగిస్తుంది. ఇలాంటి పిల్లలు చదువులో రాణించొచ్చు కానీ, ఇతరులతో మాట్లాడే నైపుణ్యాలు లేక నలుగురితో కలవలేక మానసికంగా ఇబ్బంది పడే అవకాశం కూడా ఉందంటున్నారు. ✦ ఏ ఒక్కరి ఆలోచనా తీరూ ఒకేలా ఉండదు. ఎవరి ప్రతిభ వారిది. అందుకే చిన్నారులని ఇతరులతో పోల్చకుండా వారి నైపుణ్యాలను గుర్తించి ఆ దిశగా అడుగులు వేసేలా సహకారం అందించాలి అంటున్నారు నిపుణులు. ◻

## లొంగని హనుమ



శిష్యులకు అనేక విషయాలు బోధించేటప్పుడు పురాణాల్లోని అంశాలను ప్రస్తావించేవారు రామకృష్ణ పరమహంస కింది ఉదంతం అలాంటిదే. సీతమ్మ జాడను తెలుసుకునేందుకు లంకలో ప్రవేశించిన హనుమంతుడు స్ఫటిక స్తంభంలో దాచిపెట్టిన రావణుడి అస్త్రాన్ని తీసుకెళ్తుంటే.. మండోదరి గమనించింది. అతణ్ణి నిలువరించడానికి రకరకాల పండ్లతో మభ్యపెట్టాలని చూసింది. పండ్ల మీది ఆశతో అస్త్రాన్ని హనుమ విడిచిపెట్టేస్తాడు ఆమె ఆశ. కాని లొంగేవాడు కాదు. ధనం, గౌరవం, దేహసుఖాలను లక్ష్యపెట్టని ఆ రామబంటుకు శ్రీరాముడే ఆరాధ్య దైవం, ఆయనే తన కల్పతరువు. అందువల్ల మండోదరితో.. ఫలము కేమి కొదవు నాకు జన్మఫలమె ఉందు మోక్ష ఫలము లొసగు రామ వృక్షమున్నది హృదయమందు రామ కల్పతరువు మూల కూర్చుండినాను కోరుకున్న ఫలమేదైన చేరి కోసుకొనందున అన్నాడు. రాముణ్ణి హృద యంలో నిక్షిప్తం చేసుకోవడం అంటే హనుమంతుడి హృదయం పరిపూర్ణతతో ఉందని అర్థం. ఇలాంటి స్థితినే ప్రతి ఒక్కరూ ఆకాంక్షించాలి. దీని కోసమే భగవంతుణ్ణి ఆరాధించాలి. బతుకు తెరువు కోసం భౌతిక సంపదలు అవసరమే గానీ ఆధ్యాత్మిక సంపద మరీ అవసరం అంటూ ప్రబోధించారు. పరమహంస. ◻

## మహిళలు ఆర్థిక స్వతంత్రం సాధించాలని ..



రూప

**మహిళగా భారతీయ అంశం రంగంలో సీఈఓగా ఎంపికవ్వడం, నిరూపించుకోవడం సామాన్యుడు కాదు! కానీ నలభైల్లోనే సీఈఓ అయ్యారు రూపా కుద్వా. ఆమె అనుభవాలను పాఠాలుగా మార్చి 'లీడర్‌షిప్ బియాండ్ ద ప్లేబుక్' పుస్తకంగా తెచ్చారు. తన గురించీ, మహిళలు వృత్తిలో రాణించడం గురించీ ఆమె గూర్చి తెలుసుకుందాం..**

రూప పెరిగింది మేఘాలయ, అసోంలలో, మేఘాలయాలో మాతృస్వామ్య వ్యవస్థ ఉంటుంది. మహిళలు పనిచేయాలి, ఆర్థిక స్వతంత్రం సాధించాలని రూపానికి చిన్నప్పట్నుంచీ ఉండేది. గువా హాటిలోని కాటన్ కాలేజీ నుంచి బీఎస్సీ, ఐఐఎం అహ్మదాబాద్ నుంచి ఎంబీఏ పూర్తిచేసిన రూపం.. ఐడీబీఐలో కెరియర్ కారణంగా. 1992లో రేటింగ్స్ సంస్థ 'క్రిజిల'కు మారారు. నేను ముంబయిలో, కుటుంబం బెంగళూరులో ఉండేది. క్రిజిల్ బెంగళూరు శాఖను ప్రారంభిస్తున్నట్లు పేపర్లో చూశారు, మర్నాడు వాళ్ల ఆఫీసుకు వెళ్లి సీఐఓ ప్రదీప్ షాను బెంగళూరులో చేరతా నంటే... మాటల్లోనే ఓకే చేశారు అంటారు రూప.

**అర్హత ఉందంటూ...** క్రిజిల్లో గ్లోబల్ రేటింగ్స్ సంస్థ ఎస్‌ఎన్పీ భాగస్వామిగా మారడంతో ఆ సంస్థ తరపున 1998-2000 మధ్య పారిస్లో పనిచేశారు. తిరిగొచ్చేసరికి ఇండియాలో క్రిజిల్ చీఫ్ రేటింగ్స్ ఆఫీసర్(సీఆర్) స్థానం ఖాళీ అయింది. దాన్ని భర్తీ చేయకుండా మాలాంటి సెక్టార్ లీడ్స్ నేరుగా సీఈఓకే రిపోర్ట్ చేయాలన్నారు. ఓరోజు సీఈఓను కలిసి సంస్థకు సీఆర్ ప్రాధాన్యన్నీ, అందుకు నాకున్న అర్హతల్నీ చెబుతూ చిన్న ప్రెజెంటేషన్ ఇచ్చా. ఆర్నెళ్ల తర్వాత, సీఆర్ ఓగా నియమించారు. రేటింగ్స్ విభాగాన్ని మరింతగా అభివృద్ధి చేయడానికీ, ఆపై సీఈఓ కావడానికి అది తోడ్పడింది అని చెప్పే రూప... కోరుకోనిదే, ఏది దక్కదంటారు.

**సీఈఓ హోదా వద్దనుకుని.. ....** "ఉద్యోగం చేయడానికో కారణం, సంతృప్తి ఉండాలి. 2015 నాటికి నాకు 50 ఏళ్లు. అప్పటికి క్రిజిలకు సీఈఓగా ఏడేళ్లున్నాను. మరో పదేళ్ల ఉండొచ్చు. అది నాకూ, కంపెనీకీ మంచిది కాదనిపించింది. కొత్త ప్రపంచంలోకి వెళ్లాలను కున్నా. 'ఓమిడియార్ నెట్వర్క్ ఇండియా' సంప్రదించడంతో ఆ సంస్థకు మేనేజింగ్ పార్ట్‌నర్‌గా వెళ్లాను, డిజిటల్ సాధనలతో భారత్‌లోని దిగువన 60 శాతం అభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని స్టార్టప్‌లకు పెట్టుబడులు అందించే సంస్థ ఇది' అంటూ తన కెరియర్లో మార్పు గురించి వివరిస్తారు రూప.

**అనుభవ పాఠాలు...** లైఫ్‌లో వృత్తి చాలా ముఖ్యం. అలాగే మానవ సంబంధాలూ! వర్క్‌లైఫ్ ఇంటిగ్రేషన్ ఉండాలి. మనం అంటే ఉద్యోగం, హోదా ఒక్కటే కాదు. లైఫ్‌లో భిన్న అంశాలకు చోటివ్వాలి. హోదాకు అర్హత వారికి ఉందా, లేదా అన్న భావన (ఇంపోస్టర్ సిండ్రోమ్) పురుషుల్లోనూ ఉంటుంది. మహిళలు మరీ లోతుగా ఆలోచిస్తే. ఈ ఆలోచన మంచిదే! ఎందుకంటే మిమ్మల్ని కొత్త హోదాకు తగ్గట్టు సిద్ధం చేసుకుంటారు. ఉద్యోగ అర్హతల్లో 60 శాతం ఉన్నా, పురుషులు దరఖాస్తు చేస్తారట. మహిళలైతే, 100 శాతం అర్హత సాధించేదాకా వేచి చూస్తారట. ఈ 'కాన్ఫిడెన్స్ గ్యాప్' అనేది సామర్థ్యానికి సంబంధించినది కాదు, ఆలోచనాధోరణికి సంబంధించినది. సాధనతో ఆత్మవిశ్వాసాన్ని పెంచుకోవచ్చు. నిర్ణయం తీసుకున్నాక, పనిచేశాక ఆత్మవిశ్వాసం వస్తుంది తప్ప, ముందే రాదు. సంస్థలు... మహిళలను ఉద్యోగాల్లోకి తీసుకోవడం, వాళ్లకు నెట్‌వర్క్, ఏర్పాటుచేయడమే కాదు... పదోన్నతుల్లో పక్షపాతం లేకుండా చూడాలి. మహిళలు నాయకత్వ స్థానాల్లో ఉండటం వెనక పురుషుల పాత్ర కీలకం. మద్దతివ్వడం మార్గనిర్దేశం చేయడం, వివక్ష ఆపడం... వంటివన్నీ చేయాలి. నాయకత్వం అంటే నిర్దేశిత పాత్రకు పరిమితమవ్వడం కాదు, మన శక్తి సామర్థ్యాలను ఉపయోగించి పెద్ద లక్ష్యాలను నిర్దేశించుకుని వాటి సాధనకు కృషిచేయడం. వైవిధ్యాన్నే కాదు... క్లిష్టమైన వ్యాపార వాతావరణంలో విజయానికి అవసరమయ్యే తమ దృష్టికోణాన్నీ, పరిజ్ఞానాన్నీ, నాయకత్వ శైలిని తెస్తారు మహిళలు. ◻

## యాపిల్ తింటున్నారా..



**రోజూ ఒక యాపిల్ తింటే డాక్టర్తో పని ఉండదని చిన్నప్పటి నుంచీ వింటున్నాం కదా! ఇంతకీ ఇందులో ఉన్న సుగుణాలేంటో, ఎన్ని విధాలుగా ఉపయోగపడుతుందో...**

కెలోరీలు, పీచు, సివిటమిన్, కాపర్, పొటాషియంలతో యాపిల్ మంచి పోషకాహారం. మలబద్ధక సమస్యను నివారిస్తుంది. ఇది రక్తపోటును క్రమబద్ధం చేస్తుంది. అగ్న్యాశయానికి (పాంక్రియాజ్) మంచిది. కొలెస్ట్రాల్ను తగ్గిస్తుంది. మంట, తాపం, బాధల నుంచి ఉపశమనం కలిగిస్తుంది. మంచి పోషకాలతో దండిగా ఉంటుంది కాబట్టి త్వరగా ఆకలి వేయదు. బరువు తగ్గాలనుకునేవారికి యాపిల్ మంచిది. అమెరికాలో 40 వేలమంది మీద జరిపిన పరిశోధనలో యాపిల్స్ తినేవారిలో గుండెజబ్బులు వచ్చే అవకాశం చాలా తక్కువని తేలింది. టైప్ 2 డయాబెటిస్, రక్తంలో చక్కెరలను నియంత్రిస్తుంది. సైనస్, ఉబ్బసం వంటి శ్వాస ఇబ్బందులను నివారిస్తుంది. క్యాన్సర్కు వ్యతిరేకంగా పోరాడుతుంది. మెదడు పనితీరును మెరుగుపరుస్తుంది. ఇది జీర్ణమవుతుంది కనుక వృద్ధులకు, త్వరగా అనారోగ్య సమస్యలతో బాధపడేవారికి కూడా మంచిది. మనలో చాలామంది యాపిల్ చెక్కు తీసి తినడానికి ఇష్టపడతాం. నిజానికి అందులో యాంటీ ఆక్సిడెంట్లు విస్తారంగా ఉన్నాయి కాబట్టి తీయకుండానే తినాలని చెబుతున్నారు ఆహార నిపుణులు. యాపిల్ ఎలా తిన్నా రుచిగానే ఉంటుంది.

## చెక్క దువ్వెన శుభ్రతెలా?



దువ్వెనలను వాడుతున్న వారి సంఖ్య పెరుగుతోంది. మామూలు వాటినైతే ఏ సందేహం లేకుండా నానబెట్టి, కడిగేయొచ్చు. మరి వీటి శుభ్రత ఎలా? అంటే... మడు, కురులు ఆరోగ్యంగా ఉండాలంటే దువ్వెన శుభ్రం చేయడం తప్పనిసరి. కాబట్టి, ముందు పొడి టూత్ బ్రష్ దువ్వెన పళ్ల సందుల్లో రుద్దాలి. తరువాత ఒక పాత్రలో గోరువెచ్చని నీళ్లు తీసుకుని, దానిలో డిష్వాష్ లిక్విడ్ లేదా షాంపూ అయిదారు చుక్కల కొబ్బరి, ఆలివ్ వంటి నూనెలను కలపాలి. ఇప్పుడు దువ్వెనను ఈ మిశ్రమంలో ఉంచండి. నీరు తగిలితే ఇవి ఉబ్బి, పాడవుతాయి. కాబట్టి, నీటిలో ఎక్కువగా నాననీయకూడదు. 2 నిమిషాలు చాలు, తరవాత తిరిగి బ్రష్ మరోసారి రుద్ది, మెత్తని వస్త్రంతో తడిని తుడిచేయండి. కాసేపు ఎండలో ఉంచినా మంచిదే. దువ్వెన పూర్తిగా ఆరాకే తిరిగి ఉపయోగిస్తే మేలు. నిజానికి శుభ్రత తరవాత దువ్వెన మొత్తాన్నీ కొద్దిపాటి నూనెతో తుడిచి పక్కనపెడితే ఎక్కువకాలం పనిచేస్తుంది. నీటితో శుభ్రత అస్సలు ఇష్టం లేదు, పాడవుతుందన్న భయం ఉంటే మరోలానూ శుభ్రం చేయొచ్చు. ముందు ఏదైనా సహజ నూనెను దువ్వెన మొత్తం పట్టించి, నాననివ్వాలి. ఓ "అరగంటయ్యాక బ్రష్తో దువ్వెన పళ్లను శుభ్రం చేయాలి. ఆపై మరోసారి మెత్తని వస్త్రంతో తుడిచి, ఎండలో కొద్దిసేపు ఉంచి, తీసినా సరిపోతుంది.

తెర

## తిరువీర్ సరసన ఐశ్వర్య రాజేశ్



లేటెస్ట్ బ్లాక్ బస్టర్ 'ప్రీ వెడ్డింగ్ షో'తో అద్భుతమైన విజయాన్ని అందుకున్న యంగ్ హీరో తిరువీర్ తన నెక్స్ట్ ప్రాజెక్ట్ ను ప్రకటించారు. సంక్రాంతికి వస్తున్నాం విజయం తర్వాత ఐశ్వర్య రాజేష్ ఈ చిత్రంలో కథానాయికగా నటిస్తున్నారు. ఈ చిత్రం భరత్ దర్శన్ డైరెక్టర్ గా పరిచయం అవుతున్నారు. గంగా ఎంటర్టైన్మెంట్స్ బ్యానర్ పై మహేశ్వర రెడ్డి మూలి ప్రొడక్షన్ నంబర్ 2గా నిర్మిస్తున్నారు. ప్రేక్షకులకు వైవిధ్యమైన కథలతో అలరించే తిరువీర్, మసూద నుంచి ప్రీ వెడ్డింగ్ షో వరకు డిఫరెంట్ జానర్లలో ఆకట్టుకున్నారు. ఈ కొత్త సినిమా హిలేరియస్ ఎంటర్‌టైనర్‌గా రూపుదిద్దుకుంటోంది. ప్రేక్షకులకు కొత్త అనుభూతిని ఇవ్వబోతోంది. ఈ నెల 19వ తేదీ నుండి రెగ్యులర్ షూటింగ్ ప్రారంభమవుతుంది. సినిమా తెలుగు, తమిళ, మలయాళం, కన్నడ భాషల్లో ఒకేసారి విడుదల కానుంది. తారాగణం: తిరువీర్, ఐశ్వర్య రాజేష్

## 'గత వైభవం' గ్రాండ్‌గా రిలీజ్



ఎస్ఎస్ దుష్యంత్, ఆషికా రంగనాథ్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న ఎపిక్ ఫాంటసీ డ్రామా గత వైభవ. సింపుల్ సుని దర్శకత్వంలో సర్వెగర సిల్వర్ స్క్రీన్స్, సుని సినిమాస్ బ్యానర్స్ పై దీపక్ తిమ్మప్ప, సుని నిర్మిస్తున్నారు. ఈ చిత్రం ఈ నెల 14న విడుదలకు సిద్ధమవుతోంది. ప్రైమ్‌షో ఎంటర్‌టైన్‌మెంట్ కే. నిరంజన్‌రెడ్డి, చైతన్యరెడ్డి ఈ సినిమా తెలుగు హక్కులను సొంతం చేసుకున్నారు. ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీని విలియమ్ జె. డేవిడ్, సంగీతాన్ని జుదా శాండీ, ఆర్ట్ డైరెక్షన్ శివకుమార్, ఉన్నాస్ హైదూర్, రఘు మైసూర్ అందించారు. లవ్, మైథాలజీ, పునర్జన్మ, పీరియడ్ డ్రామా, నాలుగు యుగాల నేపథ్యంలో సాగే ఈ కథ, అద్భుతమైన జునీశ్రీతో ప్రేక్షకులకు విజువల్ వండర్ ఎక్స్ పీరియన్స్ ఇవ్వనుంది.

## 'సంతాన ప్రాప్తిరస్తు' క్యూట్ లవ్ స్టోరీ

విక్రాంత్, చాందినీ చౌదరి జంటగా నటిస్తున్న సినిమా "సంతాన ప్రాప్తిరస్తు". ఈ సినిమాను మధుర ఎంటర్ టైన్ మెంట్, నిర్వి ఆర్ట్స్ బ్యానర్స్ పై మధుర శ్రీధర్ రెడ్డి, నిర్వి హరిప్రసాద్ రెడ్డి నిర్మిస్తున్నారు. దర్శకుడు సంజీవ్ రెడ్డి ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నారు. రచయిత షేక్ దావూద్ జి ఈ సినిమాకు స్క్రీన్ ప్లే అందించారు. "సంతాన ప్రాప్తిరస్తు" సినిమా ఈ నెల 14న గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు రెడీ అవుతోంది. నేను, డైరెక్టర్ సంజీవ్ రెడ్డి పదేళ్లుగా కలిసి జర్నీ చేస్తున్నాం. నేను నిర్మించిన "లేడీస్ అండ్ జెంటిల్ మేన్" మూవీకి రైటర్ గా పనిచేశాడు. ఆ సినిమాకు అప్పటి ఏపీ ప్రభుత్వ నంది పురస్కారాల్లో తృతీయ ఉత్తమ చిత్రంతో పాటు బెస్ట్ ఎడిటర్ గా నవీన్ నూలికి అవార్డ్ వచ్చింది. నవీన్ నూలికి ఎడిటర్ గా తొలి చిత్రమది. ఆ తర్వాత అల్లు శిరీష్ హీరోగా సంజీవ్ దర్శకత్వంలో ఏబీసీడీ రూపొందించాం. సంజీవ్ అహ నా పెళ్లంట అనే వెబ్ సిరీస్ కూడా చేశాడు. ఈ సినిమా చూశాక ఫెర్టిలిటీ ఇష్యూస్ తో బాధపడుతున్న వారికి ఒక ధైర్యం వస్తుంది. మంచి మెసేజ్ చేరుతుంది. మనం ఈ సమస్య కోసమా ఇంత బాధపడింది అనుకుంటారు. పాండమిక్ ముందు మనకు వరల్డ్ సినిమా తెలియదు. కరోనా టైమ్ లో మనమంతా ఓటీటీల్లో డిఫరెంట్ జానర్స్ కంటెంట్ చూశాం. గతంలో తెలుగులో ఇలాంటి కొన్ని కాన్సెప్ట్ తో మూవీస్ ప్రయత్నాలు చేశారు. అప్పుడు ఆదరణ పొందలేదు. కానీ ఇప్పుడు ప్రేక్షకుల టేస్ట్, ట్రెండ్ మారింది. మా మూవీని మ్యూజికల్ ఫ్యామిలీ ఎంటర్ టైనర్‌గా చెబుతు న్నాం. ఎందుకంటే సినిమాలోని పాటలన్నీ హిట్ అయ్యాయి. మా మూవీ మ్యూజిక్ ఆలిండియాలో 15వ ప్లేస్ లో ట్రెడ్ అవుతుంటే, కంటెంట్ బాగున్న సినిమాలకు ఎప్పుడూ తెలుగు ప్రేక్షకుల నుంచి ఆదరణ లభిస్తుంది. "సంతాన ప్రాప్తిరస్తు" లాంటి చిన్న సినిమా దాదాపు 300 థియేటర్స్ లో రిలీజ్ అవుతోందంటే ట్రైలర్ ఆకట్టుకోవడం వల్లే. డిజిటల్ బిజినెస్ కూడా కంప్లీట్ చేసుకోగలిగాం. . నేల విడిచి సాము చేయడం నాకు ఇష్టం ఉండదు. "సంతాన ప్రాప్తిరస్తు" తెలుగులో మంచి విజయం సాధించాక, ఆ క్రెడబిలిటీతో పాన్ ఇండియాకు రీచ్ అవుతుంది. నిర్మాత నిర్వి హరిప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ..




"సంతాన ప్రాప్తిరస్తు" సినిమాతో నిర్మాతగా మీ ముందుకు రావడం హ్యాపీగా ఉంది. నేను ఐటీ సెక్టార్ నుంచి వచ్చాను. "సంతాన ప్రాప్తిరస్తు" సినిమా ఐటీ ఎంప్లాయ్ నేపథ్యంగా ఉంటుంది కాబట్టి మా ఫ్రెండ్స్ అంతా బాగా రిలేట్ అవుతు న్నారు. ట్రైలర్ వాళ్లకు బాగా నచ్చింది. సెన్సబుల్ ఇష్యూను, సెన్సిటివ్ గా చూపిస్తూ సెన్సేషన్ క్రియేట్ చేయాలని ఈ సినిమాను ప్రారంభించాం. పిట్టకొంచెం కూత ఘనం అన్నట్లు...మా సినిమా పేరుకే చిన్నది కానీ ప్రేక్షకుల్ని బాగా మెప్పిస్తుంది, ఎక్కువ మందికి రీచ్ అవుతుంది. నాలా యూఎస్ లో ఉన్న తెలుగు ఐటీ సెక్టార్ వాళ్లకు మూవీస్ లో ఇంట్రెస్ట్ ఉంది. కానీ ఇక్కడ ఇండస్ట్రీలో సినిమా చేయడం సులువే కానీ దాన్ని బిజినెస్ చేయడం కష్టం. ఇండస్ట్రీలో అనుభవం ఉన్న వారితో అసోసియేట్ అయితేనే మూవీని సేల్ చేసి ఫైనాన్షియల్‌గా సేఫ్ కాగలం.

## 'ఆంధ్ర కింగ్ తాలూకా' సాంగ్ 12న రిలీజ్

ఎనర్జిటిక్ స్టార్ రామ్ పోతినేని మోస్ట్ ఎవైటెడ్ యూనిక్ ఎంటర్ టైనర్ 'ఆంధ్ర కింగ్ తాలూకా' పాన్ ఇండియా నిర్మాణ సంస్థ మైత్రి మూవీ మేకర్స్ నిర్మిస్తున్న ఈ చిత్రానికి మహేశ్ బాబు పి దర్శకత్వం వహిస్తున్నారు. అద్భుతమైన ప్రమోషనల్ మెటీరియల్‌తో ఈ సినిమా భారీ బజ్‌ను సృష్టించింది. టైటిల్ గ్లింప్స్, పాటలు, టీజర్ ప్రతి ప్రమోషనల్ కంటెంట్ సినిమాపై భారీ అంచనాలు పెంచాయి. ఈరోజు మేకర్స్ ఫోర్త్ సింగిల్ ఫస్ట్ డే ఫస్ట్ షో అప్డేట్ ఇచ్చారు. ఫస్ట్ డే ఫస్ట్ షో సెలబ్రేషన్స్ కి పర్ఫెక్ట్ వుండే ఈ సాంగ్ నవంబర్ 12న విడుదల కానుంది. రామ్ సెలబ్రేషన్స్ మోడ్ లో వున్న సాంగ్ అనౌన్స్మెంట్ పోస్టర్ అదిరిపోయింది. భాగ్యశ్రీ బోర్సే హీరోయిన్‌గా నటిస్తుండగా, కన్నడ సూపర్‌స్టార్ ఉపేంద్ర ఈ సినిమాలో సూపర్‌స్టార్‌గా కనిపించనున్నారు. రావు రమేశ్, మురళీ శర్మ, సత్య, రాహుల్ రామకృష్ణ, వీటీవీ గణేష్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. వివేక్ మర్విన్ సంగీతం అందిస్తుండగా, సిద్ధార్థ నూని సినిమాటోగ్రఫ, శ్రీకర్ ప్రసాద్ ఎడిటింగ్, అవినాష్ కొల్లా ప్రొడక్షన్ డిజైన్‌ను నిర్వహిస్తున్నారు. 'ఆంధ్ర కింగ్ తాలూకా' నవంబర్ 28న థియేటర్లలో విడుదల కానుంది.

## 'ప్రేమంటే' వెడ్డింగ్ సాంగ్



ప్రియదర్శి రిఫ్రెషింగ్ రొమాంటిక్ కామెడీ మూవీ ప్రేమంటే నవంబర్ 21న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఆనంది హీరోయిన్‌గా నటిస్తోంది. సుమ కనకాల ఒక ముఖ్యమైన పాత్ర చేస్తున్నారు. నవనీత్ శ్రీరామ్ డైరెక్టర్ గా అరంగేట్రం చేస్తున్నారు. పుస్కూర్ రామ్ మోహన్ రావు, జాన్వీ నరంగ్ నిర్మాణంలో, శ్రీ వెంకటేశ్వర సినిమాస్ ఎల్‌ఎల్‌పీ బ్యానర్‌పై తెరకెక్కుతున్న ఈ చిత్రాన్ని రానా దగ్గుబాటి స్పిరిట్ మీడియా సమర్పిస్తోంది. దివంగత నారాయణ్ దాస్ నారంగ్ గారికి ట్రిబ్యూట్ గా నిలిచే ఈ చిత్రానికి ఆదిత్య మెరుగు సహ నిర్మాత. ఇటీవల విడుదలైన టీజర్ కు ప్రేక్షకులనుంచి అద్భుతమైన స్పందన వచ్చింది. మనుసుని హత్తుకునే ప్రేమకథపై ప్రేక్షకుల్లో అంచనాలు పెంచింది. ఈ రోజు చిత్రంలోని రెండో పాట "పెళ్లి షురుఖిని హీరోయిన్ శ్రీలీల లాంచ్ చేశారు. శ్రీమణి రాసిన సాహిత్యం, కొత్త జీవితాన్ని మొదలుపెడుతున్న జంట భావోద్వేగాలను చక్కగా ప్రజెంట్ చేసింది. చాలా రోజుల తరువాత తెలుగు పాటకు వాయిస్ అందించిన శ్రేయా ఘోషాల్ తన మధురమైన వోకల్స్ పాటకు కొత్త అందాన్ని తెచ్చారు. ప్రియదర్శి, ఆనంది ఇద్దరూ బ్యూటీఫుల్ డ్యాన్స్ మూవ్స్ తో పాటకు జీవం పోశారు. ఈ పాట తెలుగు పెళ్లిళ్లలో మస్ట్ ప్లే సాంగ్‌గా మారబోతోంది.

## 'జిగ్రీస్' ఎంజాయ్ చేసే సినిమా




కృష్ణ బురుగుల, ధీరజ్ ఆత్రేయ, మణి వక్కా, రామ్ నితిన్ ప్రధాన పాత్రల్లో మోంట్ మెరు పిక్చర్స్ నిర్మిస్తున్న యూత్‌ఫుల్ క్రేజీ ఎంటర్‌టైనర్ 'జిగ్రీస్'. హరిష్ రెడ్డి ఉప్పుల దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రానికి కృష్ణ వోడపల్లి నిర్మాత. ఇప్పటికే విడుదలైన టీజర్, సాంగ్స్ కి అద్భుతమైన రెస్పాన్స్ వచ్చింది. జిగ్రీస్ నవంబర్ 14న వరల్డ్ వైడ్ రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా మేకర్స్ ప్రెస్ మీట్ నిర్వహించారు. ప్రెస్ మీట్ లో దర్శకుడు హరీష్ రెడ్డి ఉప్పుల మాట్లాడుతూ.. అందరికి నమస్కారం. జిగ్రీస్ 14న రిలీజ్ అవుతుంది. ఇది యూత్ ఫుల్ ఎంటర్టైనర్. ఒక సినిమాలా కాకుండా ఒక ఎక్స్పీరియన్స్ లాగా ఉంటుంది. మణి వక్కా మాట్లాడుతూ.. అందరికీ థాంక్యూ. ఈ సినిమాని అందరూ సపోర్ట్ చేయాలని కోరుకుంటున్నాను. కృష్ణ బురుగుల మాట్లాడుతూ... అందరికి నమస్కారం. టీజర్ ట్రైలర్ మీ అందరికీ నచ్చడం చాలా ఆనందంగా ఉంది. సినిమా చాలా అద్భుతంగా వచ్చింది. నవంబర్ 14న అందరం థియేటర్స్ లో కలుద్దాం. ధీరజ్ ఆత్రేయ మాట్లాడుతూ... అందరికి నమస్కారం. ఈ సినిమా ఒక మంచి ఎక్స్పీరియన్స్. అందరు కూడా ఎంజాయ్ చేసేలా ఉంటుంది. నిర్మాత కృష్ణ వోడపల్లి మాట్లాడుతూ..అందరికి నమస్కారం. ఈ సినిమాని చాలా కష్టపడి తీశాం. మా టీంకి థాంక్యూ. లొకేషన్స్ సీన్స్ అన్నీ ఒక కల్ట్ సినిమా గా ఉండబోతుంది. సినిమా ఎంత హిలేరీష్‌గా ఉంటుందో అంత ఎమోషనల్‌గా ఉంటుంది. తప్పకుండా ఈ సినిమాని అందరూ నవంబర్ 14న థియేటర్స్‌లో చూసి ఎంజాయ్ చేస్తారని కోరుకుంటున్నాను. సహ నిర్మాత చిట్టెం వినయ్ మాట్లాడుతూ.. ఇది మంచి యూత్ ఫుల్ ఎంటర్టైనర్. తప్పకుండా మీ అందరిని అలరిస్తుంది. నవంబర్ 14న అందరూ థియేటర్స్‌లో చూడాలని కోరుకుంటున్నాను.

# జపాన్ బ్యాడ్మింటన్‌లో ప్రమోద్‌కు ట్రిపుల్ స్వర్ణం

## డబుల్ గోల్డ్‌తో కృష్ణ, సుకాంత్ స్వర్ణం, రజతం



**న్యూఢిల్లీ:** జపాన్ పారా బ్యాడ్మింటన్ ఇంటర్నేషనల్ 2025లో భారత పారా బ్యాడ్మింటన్ స్టార్లు అద్భుతమైన ప్రదర్శన ఇచ్చారు. ప్రమోద్ భగత్ సింగిల్స్, డబుల్స్, మిక్స్‌డ్ డబుల్స్‌లో 3 స్వర్ణ లను సాధించి అగ్రస్థానంలో నిలిచాడు. కృష్ణ నాగర్ సింగిల్స్, మిక్స్‌డ్ డబుల్స్‌లో 2 స్వర్ణాలను గెలుచుకున్నాడు. సుకాంత్ కదమ్ పురుషుల డబుల్స్‌లో 1 స్వర్ణం, సింగిల్స్‌లో 1 రజతం సాధించాడు. ఈ ఛాంపియన్‌షిప్ ఎస్ఎల్3 సింగిల్స్ ఫైనల్లో భగత్ డైసుకే ఫుజిహారా (జపాన్) చేతిలో తొలి సెట్ కోల్పోయిన తర్వాత అద్భుతమైన పునరాగమనం చేశాడు. మొదటి మ్యాచ్‌లో 17-21తో, రెండవ మ్యాచ్‌లో 16-19తో వెనుకబడినప్పటికీ, ప్రమోద్ ధైర్యాన్ని ప్రదర్శించి మ్యాచ్‌ను సమం చేశాడు. తర్వాత 1 గంట 33 నిమిషాల పాటు జరిగిన పోరులో 17-21, 21-19, 21-10 తేడాతో ఆధిపత్యం చెలాయించాడు. అలాగే పురుషుల డబుల్స్‌లో భగత్, సుకాంత్ కదమ్‌తో కలిసి జగదీష్ దిల్లీ, నవీన్ శివకుమార్‌లను మూడు సెట్లల్లో (21-17, 18-21, 21-16) ఓడించాడు. మనీషా రామదాస్‌తో కలిసి మిక్స్‌డ్ డబుల్స్ ఎస్ఎల్4-ఎస్‌యు5 టైటిల్‌ను గెలుచుకోవడం ద్వారా అతను తన బంగారు హ్యాట్రిక్‌ను పూర్తి చేశాడు. 29 నిమిషాల పోటీలో నితేష్ కుమార్, తులసిమతి మురుగేషన్‌లను 21-19, 21-19 తేడాతో ఓడించాడు. ఇక టోక్యో పారాలింపిక్ బంగారు పతక విజేత కృష్ణ నాగర్ మరోసారి రెండు బంగారు పతకాలు గెలుచుకున్నాడు. సింగిల్స్, మిక్స్‌డ్ డబుల్స్‌లో యుఎస్‌కు చెందిన మైల్స్ క్రజెవ్స్కీని వరుస సెట్లలో ఓడించాడు. మొదటి సెట్‌లో 11-17తో వెనుకబడిన తర్వాత, తిరిగి 22-20తో సెట్‌ను కైవసం చేసుకున్నాడు. తదుపరి రెండవ సెట్‌ను 21-13తో సునాయాసంగా ముగించాడు.



# ఏథెన్స్ ఓపెన్ టోర్నీ విజేత జోకోవిచ్

**న్యూఢిల్లీ:** ఏథెన్స్ ఓపెన్ టోర్నీ 2025 విజేతగా ప్రపంచ మాజీ నంబర్ వన్, సెర్బియా దిగ్గజం నోవాక్ జోకోవిచ్ నిలిచాడు. ఈ ఏడాది రికార్డు స్థాయిలో 25వ గ్రాండ్ స్లామ్ టైటిల్‌ను సొంతం చేసుకోవడంలో జనోకోవిచ్ విఫలమైనా సీజన్‌ను మాత్రం సింగిల్స్ టైటిల్‌తో ముగించాడు. ఏథెన్స్ ఓపెన్ ఏటీపీ-250 టోర్నీలో ప్రపంచ ఐదో ర్యాంకర్ జోకోవిచ్ ఛాంపియన్‌గా అవతరించాడు. 2 గంటల 59 నిముషాల పాటు జరిగిన ఫైనల్లో జోకోవిచ్ 4-6, 6-3, 7-5తో ప్రపంచ తొమ్మిదో ర్యాంకర్ లొరెంజో ముసెట్టి (ఇటలీ)పై చిరస్మరణీయ విజయం సాధించాడు.

తద్వారా తన కెరీర్‌లో 101వ సింగిల్స్ టైటిల్‌ను దక్కించుకున్నాడు. ముసెట్టిపై జోకోవిచ్ కు ఇది తొమ్మిదో విజయం కావడం విశేషం. నువ్వా నేనా అన్నట్లు సాగిన ఈ మ్యాచ్‌లో జోకోవిచ్ ఆరు ఏస్‌లు సంధించి, మూడు డబుల్ ఫాల్ట్‌లు చేశాడు. తన ర్వీస్‌ను మూడుసార్లు కోల్పోయి, ప్రత్యర్థి సర్వీస్‌ను నాలుగు సార్లు బ్రేక్ చేశాడు. తొలి సర్వీస్‌లో 61 పాయింట్లకు గాను 43 పాయింట్లు, రెండో సర్వీస్‌లో 36 పాయింట్లకు గాను 21 పాయింట్లు గెలిచాడు. టైటిల్ ఖాయమైన వెంటనే ఈ సెర్బియా స్టార్ తన జెర్సీని చించివేసి విజయ గర్జన చేశాడు.

# ఆర్చరీ ఛాంపియన్‌షిప్‌లో ఫైనల్స్‌కు భారత్

## కొరియాతో మెన్, ఉమెన్ టీంల తుది పోరు

**న్యూఢిల్లీ:** ఆసియా ఆర్చరీ ఛాంపియన్‌షిప్-2025లో భారత రికర్వ్ పురుషులు, కాంపౌండ్ మహిళల జట్లు ఫైనల్‌కు చేరుకున్నాయి. భారత పురుషుల రికర్వ్, మహిళల కాంపౌండ్ జట్లు రెండూ ఫైనల్‌లో దక్షిణ కొరియాతో తలపడను న్నాయి. బంగ్లాదేశ్‌లోని ఢాకాలో సోమవారం జరిగిన ఛాంపియన్‌షిప్‌లో అనుభవజ్ఞులైన అతాను దాస్, రాహుల్, యశ్‌దీప్ భోగేలతో కూడిన భారత పురుషుల రికర్వ్ ఆర్చరీ జట్టు సెమీఫైనల్లో కజకిస్తాన్‌ను 5-3 తేడాతో ఓడించింది. ఫైనల్‌కు చేరుకునే అవకాశం కోసం హోరాహోరీగా జరిగిన ఈ పోరులో, తొలి సెట్‌ను గెలుచుకుని భారత్ మంచి ఆరంభం ఇచ్చింది. రెండో సెట్ టైగా ముగిసిన తర్వాత కజకిస్తాన్ మూడో సెట్‌ను గెలుచుకుని స్కోరును సమం చేసింది. తదుపరి కజకిస్తాన్ క్రమేపీ బలహీనం కావడంతో భారత్ తన సత్తా చాటుతూ నాల్గవ సెట్‌ను 57-52 తేడాతో మ్యాచ్‌ను గెలుచుకుంది. ఫలితంగా దక్షిణ కొరియాతో టైటిల్ పోరుకు సిద్ధమైంది. ఇదిలా ఉండగా, దీప్షిక, ప్రితిక ప్రదీప్, వెన్నం జ్యోతి సురేఖల తో కూడిన భారత మహిళల



కాంపౌండ్ జట్టు సెమీఫైనల్లో ఆతిథ్య బంగ్లాదేశ్‌ను 234-227 తేడాతో ఓడించింది. తొలి సెట్ ముగిసే సమయానికి భారత జట్టు నాలుగు పాయింట్ల ఆధిక్యాన్ని సాధించి, ఆ జోరును కొనసాగించి ఫైనల్‌కు చేరుకుంది. గురువారం జరిగే ఫైనల్‌లో దక్షిణ కొరియా జట్టుతో కూడా వారు తలపడనున్నారు. కాగా అంతకు ముందు భారత్ నంబర్ 1 రికర్వ్ ఆర్చర్లు బూమదేవర ధీరజ్, దీపికా కుమారి తమ తమ టీమ్ ఈవెంట్లలోకి అర్హత సాధించలేకపోయారు. ఈ ఇద్దరు ఆటగాళ్ళు ర్యాంకింగ్ రౌండ్‌లో నాల్గవ అత్యుత్తమ భారతీయులుగా నిలిచినా, ముగ్గురు సభ్యుల పురుషులు, మహిళల వేర్వేరు టీముల్లో స్థానం కోల్పోయారు.

ఆట

# సిఎస్‌కె కెప్టెన్‌గా సంజూ

## జడేజా, కరణ్ ఛేంజింగ్

## సిఎస్‌కె, ఆర్‌ఆర్ మధ్య ఫిక్సింగ్







**న్యూఢిల్లీ:** ఐపీఎల్ 2026 సీజన్‌లో చెన్నై సూపర్ కింగ్స్(సీఎస్‌కే) ను వెటరన్ వికెట్ కీపర్ సంజూ శాంసన్ నడిపించబోతున్నాడు. ఈ మేరకు రాజస్థాన్ రాయల్స్ (ఆర్‌ఆర్)తో చెన్నై సూపర్ కింగ్స్ ట్రేడ్ డీల్ జరుగుతున్నట్లు తెలుస్తోంది. త్వరలో జరగనున్న ఐపీఎల్ మినీ వేలానికి ముందే ఈ రెంటి ఫ్రాంచైజీల మధ్య ట్రేడింగ్ డీల్ జరుగుతోంది. తద్వారా రాజస్థాన్ రాయల్స్ నుంచి సంజూ శాంసన్‌ను సీఎస్‌కే తీసుకోనున్నట్లు తెలుస్తోంది. ఇందుకు గానసంజూ శాంసన్‌ను ఇవ్వాలంటే ఇద్దరు ఆటగాళ్లను ఇవ్వాలని రాజస్థాన్ రాయల్స్ చేసిన ప్రతిపాదనకు సీఎస్‌కే గ్రీన్‌సిగ్నల్ ఇచ్చినట్లు తెలుస్తోంది. సంజూ శాంసన్ కోసం స్టార్ ఆల్‌రౌండర్ రవీంద్ర జడేజాతో, పాటు సామ్ కరణ్‌ను వదులుకునేందుకు సీఎస్‌కే సిద్ధంకావడం విశేషం. ఈ ఇద్దరిని తీసుకునేందుకు రాజస్థాన్ రాయల్స్ అంగీకరిస్తే, ఆటగాళ్ల మార్పిడి ప్రక్రియ పూర్తవుతుంది. ఇక సంజూ శాంసన్ తన ఐపీఎల్ కెరీర్‌లో ఎక్కువ కాలం రాజస్థాన్ రాయల్స్‌కే ఆడాడు. ఐపీఎల్ 2021 సీజన్ నుంచి కెప్టెన్‌గా కొనసాగుతున్నాడు. మరోవైపు జడేజా తన కెరీర్‌ను రాజస్థాన్ రాయల్స్‌తో ప్రారంభించాడు. ఆ తర్వాత చెన్నైకే ఎక్కువ ప్రాతినిధ్యం వహించాడు. ఇంగ్లండ్ ఆల్‌రౌండర్ సామ్ కరణ్ సీఎస్‌కేతో పాటు పంజాబ్ కింగ్స్‌కు ఆడాడు. సంజూ శాంసన్, రవీంద్ర జడేజా ఐపీఎల్ వేతనం రూ.18 కోట్లు. కాబట్టి ఇది స్వాప్ డీల్. కానీ సామ్ కరణ్ ధర రూ. 2.40 కోట్లు. ఈ డబ్బును రాజస్థాన్ రాయల్స్ చెల్లించాల్సి ఉంటుంది. ఈ ట్రేడింగ్ డీల్ విషయమై త్వరలోనే అధికార ప్రకటన రానుం దని ఇరుజట్ల వర్గాలు పేర్కొన్నాయి. సంజూ శాంసన్‌ను జట్టులోకి తీసుకొని సారథ్య బాధ్యతలు అప్పగించాలనే యోచనలో సీఎస్‌కే ఉంది. కాగా మహేంద్ర సింగ్ ధోనీ కెరీర్ చివరి దశలో ఉండటం, కెప్టెన్‌గా రుతురాజ్ గైక్వాడ్ ఆశించిన ఫలితాలు అందించకపోవడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది.



# మహిళల ఆసియా కప్‌కు భారత్ అర్హత

## గ్రూప్ ఆఫ్ డెత్‌లో జపాన్, ఆస్ట్రేలియాతో ఢీ

**న్యూఢిల్లీ:** మహిళల ఆసియా కప్ 2026కు భారత్ అర్హత సంపాదించింది. జపాన్, ఆస్ట్రేలియా మరియు చైనీస్ తైపీతో భారత్ డ్రా చేసుకుంది. దీంతో గ్రూప్ ఆఫ్ డెత్‌లో స్థానం దక్కింది. ఇది టోర్నమెంట్‌లో అత్యంత కఠినమైన గ్రూప్ గా పరిగణించబడుతుంది. సోమవారం బ్యాంకాక్‌లో జరిగిన అధికారిక డ్రా తర్వాత మహిళల ఆసియా కప్ కోసం జపాన్, ఆస్ట్రేలియా, చైనీస్ తైపీలతో పాటు, భారతదేశం సవాలుతో కూడిన గ్రూప్ సి లోకి ప్రవేశించింది. సీడెడ్ ఆతిథ్య థాయిలాండ్ ఎ 1 స్థానాన్ని ఆక్రమించగా, పాట్ 4 నుండి డ్రా అయిన భారత్, చారిత్రాత్మక నాకౌట్‌దశ బెర్తును సాధించడంలో ఆసియాలోని అత్యుత్తమ జట్లతో ఢీ కొట్టనుంది. 2026 ఏప్రిల్ 1 నుండి 18 వరకు జరగనున్న 12 జట్ల ఖండాంతర పోటీల్లో భారత్ 2006 తర్వాత తొలిసారి పాల్గొంటుంది. ఆరుసార్లు ఛాంపియన్లుగా నిలిచి, యూత్ ఫుట్‌బాల్‌లో ఖండంలోని అత్యంత ఆధిపత్య శక్తులలో ఒకటైన టాప్‌సీడ్ జపాన్ ఈ గ్రూప్‌కు నాయకత్వం వహిస్తుంది. వీరితో పాటు శారీరక దృఢత్వం, వ్యూహాత్మక క్రమశిక్షణకు పేరుగాంచిన ఆస్ట్రేలియా, సాంకేతికంగా బలమైన, వేగవంతమైన జట్టును కలిగి ఉన్న చైనీస్ తైపీ కూడా ఉన్నాయి. పాట్ 4 నుండి తీసుకోబడిన భారత్ గ్రూప్ దశ దాటి ముందుకు సాగడానికి బలీయమైన జట్లను ఎదుర్కోవాల్సి ఉంటుంది. మొత్తం 12 జట్లను 4 గ్రూపులుగా విభజించగా, ఎ లో ఆతిథ్య థాయిలాండ్, చైనా, వియత్నాం, బంగ్లాదేశ్ ఉండగా, బి లో కొరియా, కొరియా రిపబ్లిక్, ఉజ్బెకిస్తాన్, జోర్డాన్ ఉన్నాయి. ప్రతి గ్రూప్ నుండి మొదటి రెండు జట్లు, మూడవ స్థానంలో నిలిచిన రెండు ఉత్తమ జట్లు క్వార్టర్ ఫైనల్స్‌కు అర్హత సాధిస్తాయి.

# మూడు రోజుల నష్టాలకు బ్రేక్!

## లాభాల్లో ముగిసిన స్టాక్ సూచీలు



**ముంబయి, నవంబరు 10:** మూడు రోజుల నష్టాలకు బ్రేకులు వేస్తూ దేశీయ స్టాక్ మార్కెట్లు సోమవారం లాభాల్లో ముగిశాయి. ఐటీ, ఆటో, ఎంపిక చేసిన బ్యాంకింగ్ షేర్లలో కొనుగోళ్ల మద్దతు, అమెరికా ప్రభుత్వ షట్‌డౌన్ సమస్య త్వరలో పరిష్కారం కావచ్చన్న సానుకూల అంచనాలు సూచీలకు కలిసొచ్చాయి. ట్రేడింగ్ ముగిసే సమయానికి, బీఎస్ఇ సెన్సెక్స్ 319 పాయింట్లు లాభపడి 83,535.35 వద్ద స్థిరపడింది. మరోవైపు, ఎన్ఎస్ఇ నిఫ్టీ 82 పాయింట్లు వృద్ధితో 25,574.35 వద్ద ముగిసింది.

ఉదయం మందగమనంతో ప్రారంభమైన సెన్సెక్స్, ట్రేడింగ్ మధ్యలో టెక్, ఆటో షేర్లలో భారీ కొనుగోళ్ల కారణంగా దాదాపు 500 పాయింట్లు ఎగబాకి, ఇంట్రాడేలో 83,754.49 గరిష్ఠాన్ని తాకింది. అమెరికా షట్‌డౌన్ పరిష్కారంపై సానుకూల సంకేతాలు, మెరుగైన రెండో త్రైమాసిక ఫలితాల అంచనాలతో విదేశీ సంస్థాగత ఇన్వెస్టర్లు తిరిగి కొనుగోళ్లు చేపట్టడం మార్కెట్ సెంటిమెంట్‌ను బలపరిచింది. దేశీయంగా స్థూల ఆర్థిక సూచికలు బలంగా ఉండటం కూడా కలిసొచ్చిందని జియోజిత్ ఇన్వెస్ట్‌మెంట్స్ రీసెర్చ్ హెడ్ వినోద్ నాయర్ అంచనావేసారు. సెన్సెక్స్ సూచీలో ఇన్ఫోసిస్, హెచ్‌సీఎల్ టెక్, ఏషియన్ పెయింట్స్, టాటా మోటార్స్, టిసిఎస్, భారతీ ఎయిర్‌టెల్, టైటాన్, ఎల్అండ్‌టీ భారీగా లాభపడ్డాయి. మరోవైపు, పవర్‌గ్రిడ్, అల్ట్రాటెక్ సిమెంట్, మహీంద్రా అండ్ మహీంద్రా, యాక్సిస్ బ్యాంక్ నష్టపోయిన వాటిలో ఉన్నాయి. రంగాల వారీగా చూస్తే, నిఫ్టీ ఐటీ సూచీ 1.62శాతం, నిఫ్టీ ఆటో 0.30శాతం చొప్పున పెరిగాయి. బ్యాంకింగ్, ఫైనాన్షియల్ సర్వీసెస్ సూచీలు కూడా లాభాల్లోనే ముగిశాయి. అయితే, ఎఫ్ఎంసీజీ రంగం నష్టాల్లో ముగిసింది. బ్రాడర్ మార్కెట్లలోనూ కొనుగోళ్ల ఆసక్తి కనిపించింది. నిఫ్టీ మిడ్‌క్యాప్ 100 సూచీ 0.47శాతం, స్మాల్‌క్యాప్ 100 సూచీ 0.35శాతం లాభపడ్డాయి. ఇక రూపాయి మారకం విలువ విషయానికొస్తే, డాలర్ ఇండెక్స్ బలహీనపడినప్పటికీ, ఎఫ్ఐఐల అమ్మకాల ఒత్తిడి కొనసాగడంతో రూపాయి ఫ్లాట్‌గా 88.66 వద్ద ట్రేడ్ అయింది. ఈ వారం విడుదల కానున్న భారత్, అమెరికా ద్రవ్యోల్బణ గణాంకాలు రూపాయి కదలికలపై ప్రభావం చూపుతాయని ఎల్‌కేపీ సెక్యూరిటీస్‌కు చెందిన జతిన్ త్రివేది అంచనా వేశారు. సమీప భవిష్యత్తులో రూపాయి 88.45 88.90 మధ్య కదలాడవచ్చని ఆయన పేర్కొన్నారు.

వాణిజ్యం

# ఐదు కంపెనీల ఐపిఒలు

# రూ.10వేల కోట్లు టార్గెట్!

**న్యూఢిల్లీ, నవంబరు 10:** స్టాక్ మార్కెట్‌లో పబ్లిక్ ఇష్యూల సందడి పెరుగుతోంది. ఈ వారం మొత్తం 5 ఐపిఒలు ఉండగా వాటిలో మూడు మెయిన్ బోర్డు కేటగిరీ నుంచి రెండు ఎస్ఎంఈ సెగ్మెంట్ ఉన్నాయి. ఆయా కంపెనీల సబ్‌స్క్రిప్షన్లు నవంబరు 11 నుంచి 14వ తేదీ మధ్య జరగనున్నాయి. ఈ ఐదు కంపెనీలు మొత్తం కలిపి రూ.10,000 కోట్లక ుపైగా సమీకరించే లక్ష్యంతో ఉన్నాయి. ఎడ్యుకేషన్, హరిత ఇంధనం నుంచి ఆటోమోటివ్ టెక్నాలజీ, ఫార్మా రంగాల వరకు ఈ కంపెనీలు విస్తరించి ఉన్నాయి. మరి ఆయా కంపెనీల పబ్లిక్ ఇష్యూల గురించి తెలుసుకుందాం. మెయిన్ బోర్డు నుంచి వస్తున్న ఎడ్‌టెక్ కంపెనీ ఫిజిక్స్ వాలా పబ్లిక్ ఇష్యూ సబ్‌స్క్రిప్షన్ 11న మొదలై 13వ తేదీ వరకు కొనసాగుతుంది. షేర్ల ప్రైస్ బ్యాండ్ రూ.103-109గా నిర్ణయించారు. ఐపిఒద్వారా రూ.3480 కోట్లు సమీకరించనుంది. బీఎస్ఇ, ఎన్ఎస్ఇ రెండింటిలోనూ లిస్టింగ్ కానుంది. టెన్నెకో క్లీన్ ఎయిర్ ఇండియా పబ్లిక్ ఇష్యూ ద్వారా రూ.3,600 కోట్లు సమీకరించే లక్ష్యంతో ఉంది. మొత్తంగా ఆఫర్ ఫర్ సేల్ ద్వారానే షేర్లు విక్రయిస్తోంది. ఈ ఐపిఒ సబ్‌స్క్రిప్షన్ 12న మొదలై 14వ తేదీ వరకు కొనసాగనుంది. ఒక్కో షేరుకు రూ.378-397గా నిర్ణయించారు. ఎమ్వీ ఫోటోవోల్టాయిక్ పవర్ కంపెనీ పబ్లిక్ ఇష్యూ ద్వారా రూ.2900 కోట్లు సమీక రించనుంది. ఈ ఐపిఒ సబ్‌స్క్రిప్షన్ ఈనెల 11న మొదలయి 13వ తేదీ వరకు కొనసాగుతుంది. ఒక్కో షేరుకు రూ.206-217గా నిర్ణయించారు. ఎస్ఎంఇ విభాగం నుంచి వస్తున్న ప్రముఖ కంపెనీల్లో మహామాయ లైఫ్ సైన్సెస్ ఐపిఒ అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. ఈ ఐపిఒ సబ్‌స్క్రిప్షన్ ఈనెల 11న ఓపెన్ అయి 13వ తేదీ వరకు అందుబాటులో ఉంది. ఈ పబ్లిక్ ఇష్యూ ప్రైస్ బ్యాండ్ రూ.108-114గా నిర్ణయించారు. ఈ ఐపిఒ ద్వారా రూ.70.44 కోట్లు సమీకరించనుంది.




టెక్ సొల్యూషన్స్ సేవల సంస్థ వర్క్ మేట్స్ కోర్ 2 క్లౌడ్ సొల్యూషన్ సంస్థ ఈ వారం ఎస్ఎంఈ నుంచి వస్తున్న మరో ఐపీఓ. పబ్లిక్ ఇష్యూ ద్వారా రూ.69.84 కోట్లు సమీకరించనుంది. ఇక సబ్‌స్క్రిప్షన్ ఈనెల 11వ తేదీనుంచి మొదలయి 13వ తేదీ వరకు కొనసాగుతుంది. ఒక్కో షేరు ధర రూ.200-204గా నిర్ణయించింది.

# బ్రిటానియాకు కొత్త ఎండి సిఇఒ



**ముంబయి, నవంబరు 10:** బ్రిటానియా కంపెనీ ఎండి సిఇఒ వరుణ్ బెర్రీ తన పదవికి రాజీనామాచేసారు. ఇటీవలే నియమితులయిన చీఫ్ రక్షిత్ హర్గావే ఆయన స్థానంలో కొత్త ఎండి సిఇఒగా బాధ్యతలు స్వీకరిస్తారని కంపెనీ ప్రకటించింది. కంపెనీకి ఎగ్జిక్యూటివ్ వైస్ ఛైర్మన్ ఎండిగా బ్రిటానియాలో బెర్రీ పనిచేసారు. గత మేనెలలోనే రాజ్‌నీత్‌మోహ్లి రాజీనామాతో ఆయన సిఇఒగా పదోన్నతి పొందరు.

గడచిన 13 ఏళ్లగా బ్రిటానియాలో పనిచేసారు. వినియోగరంగ ఉత్పత్తుల విభాగంలోపనిచేసిన ఆయన ఉపాధ్యక్షుడు, చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్‌గా 2013లో పనిచేసారు. అంతకుముందు బెర్రి పెప్సికో ఇండియా యూనిట్‌లోను, హిందూస్థాన్ యూనిలీవర్‌లోను పని చేసారు. గతవారంలోనే బ్రిటానియా బిర్లా ఒపస్‌కు హర్గావే తన కొత్త సిఇఒ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా ఉంటారని ప్రకటించింది. వచ్చే డిసెంబరు 15 నుంచి హర్గావే తన సిఇఒ ఎండి కొత్త బాధ్యతలు స్వీకరిస్తారు. ఐదేళ్లపాటు ఎండిసిఇఒగా కొనసాగుతారు. ఈలోపు నటరాజన్ వెంకటరామన్ అనే సీనియర్ ఎగ్జిక్యూటివ్‌ను తాత్కాలిక సిఇఒగా నియమించింది.

# భారత్-బహ్రెయిన్‌ల మధ్య యుపిఐ సేవలు




**న్యూఢిల్లీ, నవంబరు 10:** భారత్, బహ్రెయిన్ మధ్య రియల్ టైమ్ క్రాస్ బోర్డర్ లావాదేవీలను సులభతరం చేయడానికి ఆ దేశానికి చెందిన ప్రముఖ ఫిన్‌టెక్ కంపెనీ వెనెఫిట్‌తో భాగస్వామ్య ఒప్పందం చేసుకున్నట్లుగా నేషనల్ పేమెంట్ లిమిటెడ్ (ఎన్పీసిఐ) సోమవారం ప్రకటించింది. దీనితో యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ (యుపిఐ) సేవలు బహ్రెయిన్ ఎలక్ట్రానిక్ ఫండ్స్ ట్రాన్స్‌ఫర్ సిస్టమ్ ఫారిప్లస్ సేవతో అనుసంధానించనున్నట్లు తెలిపింది. ఇది రెండు దేశాల్లోని వినియోగదారులు తక్షణం డబ్బు పంపించడంతో పాటు స్వీకరించడం వీలవుతుంది. ఫారీప్లస్ అనేది బహ్రెయిన్‌లో దాదాపు రియల్ టైమ్ బ్యాంక్ టు బ్యాంక్ ఫండ్ ట్రాన్స్‌ఫర్ సేవలు అందిస్తుంది. ఇది దేశంలోని ఎలక్ట్రానిక్ ఫండ్స్ ట్రాన్స్‌ఫర్ సిస్టమ్‌లో భాగం. ఈ భాగస్వామ్యం రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ బహ్రెయిన్ మార్గదర్శకత్వంలో జరిగింది. రెండు దేశాల మధ్య క్రాస్‌బోర్డర్ చెల్లింపు కనెక్టివిటీని బలోపేతం చేయడంలో ఈ సహకారం ఓ కీలకమైన అడుగుగా పరిగణిస్తున్నారు. రెండు దేశాల నివాసితులకు వేగవంతమైన, సమర్థవంతమైన, సరసమైన చెల్లింపులను సులభతరం చేస్తుందని సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు. డిజిటల్ ఆర్థిక సేవలు ప్రోత్సహించేందుకు, అంతర్జాతీయ లావాదేవీ వ్యవస్థలను ఆధునీకరించడానికి ఈ చర్య ఒక ఉమ్మడి దృష్టిని ప్రతిబింబిస్తుంది. యూపిఐ, ఫారిప్లస్ సర్వీస్ ఏకీకరణ భారతదేశం, బహ్రెయిన్ మధ్య వ్యూహాత్మక చెల్లింపుల కారిడార్‌ను ఏర్పాటు చేస్తుందని ఇది దేశ మొత్తం జనాభాలో దాదాపు 30 శాతం ఉన్న బహ్రెయిన్‌లో నివసిస్తున్న భారతీయులకు డబ్బు పంపడం, ఆపై జమలను సులువుగాను సురక్షితంగాను చేస్తుందని పేర్కొన్నాయి.




# స్వదేశీ, విదేశీ రూట్లలో మరిన్ని ఆకాశ ఎయిర్ సర్వీసులు!

**ముంబయి, నవంబరు 10:** ఆకాశ ఎయిర్ త్వరలో మరికొన్ని దేశీయ, అంతర్జాతీయ రూట్‌లో విమానసర్వీసులు ప్రారంభిస్తోంది. బోయింగ్ నుంచి విమానాలను త్వరగా తీసుకురావాలనుకుంటున్నట్లు ఎయిర్‌లైన్ అధికారి సోమవారం తెలిపారు. ఆకాసా ఎయిర్‌లైన్స్ 2022 ఆగస్టులో తొలిసారిగా కార్యకలాపాలు ప్రారంభించింది. ప్రస్తుతం ఆ కంపెనీకి 30 విమానాలు ఉన్నాయి. 24 దేశీయ, మరో ఆరు అంతర్జాతీయ గమ్యస్థానాలకు విమానాలను నడుపుతుంది.

త్వరలోనే ఢిల్లీ నుంచి మరికొన్ని అంతర్జాతీయ విమానాలను ప్రారంభించనున్నట్లు ఆకాశ ఎయిర్ సహ వ్యవస్థాపకుడు, చీఫ్ కమర్షియల్ ఆఫీసర్ ప్రవీణ్ అయ్యర్ పేర్కొన్నారు. ఎయిర్‌లైన్ ప్రస్తుతం ఢిల్లీ నుంచి ప్రతిరోజూ 24 విమానాలను నడుపుతోంది. సింగపూర్, ఉజ్బెకిస్తాన్, ఇండోనేషియా, వియత్నాం, తాష్కెంట్‌తో సహా వివిధ విదేశీ గమ్యస్థానాలకు విమానాలను నడపాలని ఎయిర్‌లైన్ యోచిస్తుందని అయ్యర్ ఓ బ్రీఫింగ్‌లో చెప్పారు. ఆకాశ ఎయిర్ ప్రస్తుతం ఆరు అంతర్జాతీయ నగరాలకు విమానాలను నడుపుతోంది. ఇందులో దోహా (ఖతార్), జెడ్డా, రియాద్ (సౌదీ అరేబియా), అబుదాబి (యూఎఇ), కువైట్ సిటీ, ఫుకెట్ (థాయిలాండ్) ఉన్నాయి. ఎయిర్‌లైన్ మొత్తం 226 బోయింగ్ 737 మాక్స్ విమానాలను ఆర్డర్ చేసింది. అయితే, డెలివరీలో జాప్యం జరుగుతున్నది.

# సిగ్నల్ లేని చోట్ల జియో, బిఎస్ఎన్ఎల్ టైఅప్

## ఐసిఆర్‌పరిధిలో రెండు ప్రత్యేక జియో ప్లాన్లు




**ముంబయి, నవంబరు 10:** ఇంట్రా సర్కిల్ రోమింగ్ రీఛార్జి ప్లాన్ల కోసం రిలయన్స్ జియో ప్రభుత్వ రంగ టెలికాం సంస్థ బీఎస్ఎన్ఎల్‌తో ఒప్పందంచేసుకుంది. జియో సిగ్నల్స్ లేని మారుమూల గ్రామీణ ప్రాంతాల్లో బీఎస్ఎన్ఎల్ నెట్‌వర్క్ ఉపయోగించుకోవచ్చు. జియో యూజర్లకు బీఎస్ఎన్ఎల్ సిగ్నల్ అందించడమే ఇంట్రా సర్కిల్ రోమింగ్ లక్ష్యమని ,చెపుతూ బీఎస్ఎన్ఎల్‌తో టైఅప్ చేసుకున్నట్లు ప్రకటించింది. మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ యూజర్లకు మాత్రమే ఈ సరికొత్త ప్లాన్లను జియో అందుబాటులోకి తీసుకొచ్చింది.

రెండు ఇంట్రా సర్కిల్ రోమింగ్ రీఛార్జ్ ప్లాన్లను తెచ్చినట్లు తెలిపింది. 28 రోజుల వ్యాలిడిటీతో ఈ రెండు రీఛార్జ్ ప్లాన్స్ అందిస్తున్నట్లు తెలిపింది. అవి రూ. 396, రూ. 196 ప్లాన్ల ధరలు నిర్ణయించినట్లు జియో తెలిపింది. ఇక రూ. 396 రీఛార్జ్ ప్లాన్‌తో 10 జీబీ డేటాతో పాటుగా 1000 నిమిషాల టాక్ టైమ్, 1000 ఎస్ఎంఎస్‌లు లభిస్తాయి. ఇక రూ. 196 ఐసీఆర్ రీఛార్జ్ ప్లాన్‌తో 2 జీబీ డేటాతో పాటుగా వెయ్యి నిమిషాల మేర టాక్ టైమ్, 1000ఎస్ఎంఎస్‌లు ఇస్తోంది. అయితే, ఈ ప్లాన్స్‌ద్వారా కేవలం బిఎస్ ఎన్ఎల్ నెట్వర్క్‌మాత్రమే ఉపయోగించకోవచ్చు. అంటే జియో సిగ్నల్ లేని సందర్భంలో బిఎస్ఎన్ఎల్ నెట్వర్క్ సిగ్నల్ ఎంచుకున్నప్పుడు మాత్రమే ఈ ప్లాన్స్ పని చేస్తాయి. ఈఏడాది జనవరిలోనే టెలికాం నియంత్రణ సంస్థ డాట్ ప్రకటించింది. ఈ ప్లాన్ ద్వారా జియో, ఎయిర్‌టెల్, బిఎస్ఎన్ఎల్ యూజర్లు తమ సొంత సెల్యులార్ టవర్ల రేంజ్‌లో లేని సందర్భంలో ఇతర టెలికాం నెట్‌వర్క్ ఉపయోగించుకుని సేవలు పొందవచ్చు.

Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.